ఆంధ్రభూమి

సంపుటి 59 సంచిక 123 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | శనివారం, 2 ఫిబ్రవరి 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

ఓటెత్తిన పద్దు

జనా'కర్షక' తాయిలాలు
అన్ని వర్గాలకూ వరాలు

- ప్రతి రైతు కుటుంబానికి సాలీనా రూ. 6000 నగదు బదిలీ
- రూ. 75వేల కోట్లతో పీఎం కిసాన్ పథకం
- ఉద్యోగులకు రూ.5 లక్షల వరకూ ఐటీ మినహాయింపు
- 8 కోట్ల మంది మహిళలకు ఉచిత ఎల్పీజీ కనెక్షన్లు
- రిటైరైన అసంఘటిత కార్మికులకు నెలకు 3వేల పెన్షన్
- రెండో ఇంటిపై విధిస్తున్న నోషనల్ ఆదాయ పన్ను రద్దు



లోక్‌సభ ఎన్నికలకు ఎన్డీఏ సర్కార్ తాయిలాలకు తెరలేపింది. అందరికీ అన్నీ అనే రీతిలో బడ్జెట్ వరాలు ప్రకటిస్తూ జనాకర్షక బాట పట్టింది. రైతులకు పెద్దపీట వేయడం, ఉద్యోగ వర్గాలను ఆదుకోవడం, వ్యాపార వాణిజ్య వర్గాలను అక్కున చేర్చుకోవడం ద్వారా సబ్ కా వికాస్ అన్న నినాదానికి అద్దం పట్టే రీతిలో ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టింది.

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: మరో రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొంటున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్‌డీఏ ప్రభుత్వం దేశంలోని అన్ని వర్గాలపై వరాల జల్లు కురిపించారు. 25 కోట్ల మంది రైతులు, ఉద్యోగస్తులు, మధ్య తరగతి కుటుంబాలు, అసంఘటిత కార్మికులు, చిన్న వ్యాపారులకు ప్రయోజనం చేకూరే హామీలు ఇచ్చారు. 8కోట్ల మంది మహిళలకు ఉజ్వల ఎల్పీజీ కనెక్షన్లను ఇస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి రైతు కుటుంబానికి సాలీనా 6000 రూపాయల నగదు బదిలీ చేసే 75 వేల కోట్ల పథకం, రుణాలపై వడ్డీ మినహాయింపు ఇవ్వనున్నారు. అలాగే ఉద్యోగస్తులకు 5 లక్షల రూపాయల ఆదాయం వరకూ పన్ను మినహాయింపు, స్టాండర్డ్ మినహాయింపును 40 వేల నుంచి 50 వేలకు పెంపు, అసంఘటిత కార్మికులకు పదవీ విరమణ చెందిన తరువాత ప్రతి నెలా మూడు వేల రూపాయల పెన్షన్ పథకం, మధ్యతరగతి కుటుంబాలకు రెండు లక్షల నలభై వేల రూపాయల అద్దె ఆదాయాన్ని ఐటీ నుంచి నుంచి మినహాయింపు కల్పించారు. రెండో సొంత ఇంటిపై పన్ను తొలగింపు, బ్యాంకు డిపాజిట్ల 40 వేల వడ్డీ ఆదాయంపై టీడీఎస్ రద్దును మోదీ ప్రభుత్వం ప్రకటించింది. ఉద్యోగస్తులకు 5 లక్షల రూపాయల ఆదాయం వరకూ పూర్తి పన్ను మినహాయింపు ఇవ్వటంతో పాటు పొదుపు చేసే పక్షంలో ఆరున్నర లక్షల ఆదాయం వరకూ పన్ను మినహాయింపు లభిస్తుంది.

> *భారత్ ప్రతిష్ట, ఆత్మవిశ్వాసం పెంచాం. ఇప్పుడు అభివృద్ధి పథంవైపు సాగుతోంది. 2020 నాటికి నూతన భారత దేశ నిర్మాణం దిశగా ముందుకు వెళుతున్నాం. త్వరలోనే ఆరో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించనుంది. దేశ సర్వతోముఖాభివృద్ధికి మా ప్రభుత్వం స్పష్టమైన ఆలోచన, పారదర్శక విధానం, పటిష్టమైన సమగ్రతతో పురోగమిస్తోంది.*
>
> *- పీయూష్ గోయల్*

పీఎం రైతు పథకం కింద 12 కోట్ల మంది రైతులు, అసంఘటిత కార్మికుల పెన్షన్ వల్ల పది కోట్ల మంది కార్మికులు, పన్ను మినహాయింపువల్ల మూడు కోట్ల మంది మధ్యతరగతి ప్రజలు, చిన్న పన్ను చెల్లింపుదారులు, చిన్న వ్యాపారస్తులు, స్వయం ఉపాధి కల్పనదారులకు ప్రయోజనం కలుగుతుంది. ఈ లెక్కన మొత్తం ఇరవై ఐదు కోట్ల మంది రైతులు, ఉద్యోగస్తులు, కార్మికులు, మధ్యతరగతి వారికి ప్రయోజనం చేకూరుతుంది. మోదీ ప్రభుత్వం చార, అర్థ సంచార జాతుల వారి అభివృద్ధికి ప్రత్యేక బోర్డును ప్రకటించింది.

ఆర్థిక శాఖ తాత్కాలిక మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభలో 2019-20 వార్షిక ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తూ నవ భారత నిర్మాణానికి పది ప్రాధాన్యతలతో కూడిన పది సంవత్సరాల విజన్ కార్యక్రమాన్ని ప్రకటించారు. పీయూష్ గోయల్ రెండు గంటల బడ్జెట్ ప్రసంగంలో దేశాభివృద్ధికి 10 ప్రాధాన్యతా రంగాలను ప్రకటించటంతోపాటు పలు ఇతర ప్రతిపాదనలు చేశారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రెండు హెక్టార్ల వరకు భూమి ఉన్న రైతులకు సాలీనా ఆరు వేల రూపాయల నగదును 12 కోట్ల మంది సన్న, చిన్నకారు రైతుల ఖాతాల్లో వేస్తారు. ఇది 2018 డిసెంబర్ నుంచి జమ అవుతుందని పీయూష్ గోయల్ ప్రకటించారు. మొదటి రెండు వేల రూపాయల కిస్తును ఇప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని గోయల్ ప్రకటించారు. రైతులకు ఆరు వేల రూపాయలను మూడు వాయిదాల్లో చెల్లిస్తామన్నారు. ఈ పథకానికి సాలీనా 75 వేల కోట్లు ఖర్చు అవుతుందంటూ 2018-19 సంవత్సరంలో ఈ పథకాన్ని ప్రారంభించటంతో పాటు మొదటి కిస్తు చెల్లించేందుకు 2018-19 సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ. 20 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. దేశంలో చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు మత్స్య పెంపకం విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు గోయల్ స్పష్టం చేశారు. కిసాన్ క్రెడిట్ కార్డుపై రుణాలు తీసుకున్న పశు సంవర్ధక, చేపల పెంపకం దారులకు 2 శాతం పన్ను

- మిగతా 6వ పేజీలో



మధ్యంతర బడ్జెట్ పత్రాలతో శుక్రవారం పార్లమెంటుకు వచ్చిన రైల్వే మంత్రి పీయూష్ గోయల్. అరుణ్ జైట్లీ అనారోగ్యం కారణంగా, గోయల్ ఆర్థిక మంత్రిత్వ శాఖను అదనపు బాధ్యతగా స్వీకరించి, ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు.



> అన్నం పెట్టే రైతుకు రోజుకు 17 రూపాయలు ఇవ్వడం అవమానం. ఐదేళ్ళుగా రైతాంగం చిన్నాభిన్నమైంది.
>
> - రాహుల్‌గాంధీ

అందరికీ ప్రోత్సాహం

బడ్జెట్‌పై ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ శుక్రవారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ సమాజంలోని అన్నివర్గాలతోపాటు ప్రతిఒక్కరినీ ప్రోత్సహించేలా ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ప్రధాని మాట్లాడుతూ బడ్జెట్‌లో పేర్కొన్న వివిధ పథకాలకు చేసిన కేటాయింపులు సమాజంలోని ప్రతిఒక్కరినీ అలరించేదిగా, మేలు చేకూర్చేదిగా ఉందని పేర్కొన్నారు. దేశంలోని 12 కోట్లకు పైగా గల రైతుల సంక్షేమంతోపాటు దేశవ్యాప్తంగా గల మూడు కోట్ల మధ్యతరగతి కుటుంబాలు, 30 నుంచి 40 కోట్ల మంది అసంఘటిత కార్మికులకు బడ్జెట్‌లో ఎంతో ప్రయోజనం చేకూర్చినట్టు మోదీ స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి తమ ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల పేదరికం చాలావరకు తగ్గుముఖం పట్టిన విషయాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశంలోని 130 కోట్ల మంది పౌరులు కలలుగన్న సరికొత్త భారత్‌ను నిర్మించే దిశగా కొత్త బడ్జెట్‌ను రూపొందించినట్టు మోదీ స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఎన్నో పథకాలు చేపట్టినప్పటికీ మెజారిటీ రైతులకు ఈ ప్రయోజనాలు అందకుండా పోయాయని మోదీ అన్నారు. ప్రధాని కిసాన్ నిధి వల్ల 5 ఎకరాల్లోపు వ్యవసాయ భూమి కలిగిన రైతులంతా లబ్ధి పొందుతారని, ఏవిధంగా చూసినా కూడా రైతుల సంక్షేమం దిశగా తీసుకున్న చారిత్రక నిర్ణయమే ఇదని మోదీ స్పష్టం చేశారు. తాత్కాలిక బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి చేసిన ప్రతిపాదనలు పేదరిక నిర్మూలనకు దోహదం చేస్తాయని స్పష్టం చేశారు. ప్రస్తుత మధ్యతరగతి ప్రజలు సరికొత్త ఆశలు, ఆకాంక్షలతో ముందుకు వెళ్తున్నారని పేర్కొన్న మోదీ 'లోక్‌సభ ఎన్నికల అనంతరం భారతదేశం సాధించబోయే ప్రగతికి ఈ తాత్కాలిక బడ్జెట్ మార్గనిర్దేశన చేసింది' అని మోదీ అన్నారు.

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం,
తిథి: బహుళ త్రయోదశి రా.9.25
నక్షత్రం: పూర్వాషాఢ రా.12.15
వర్జ్యం: ఉ.8.43 నుండి 10.26 వరకు
విశేషాలు: సామాన్య శనిత్రయోదశి
దుర్ముహూర్తం:
ఉ.06.00 నుండి 07.36 వరకు
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు

తెలంగాణకు రూ.20వేల కోట్లు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: తెలంగాణకు కేంద్రం వసూలు చేసే వివిధ పన్నులు, డ్యూటీల నుండి మొత్తం 20,583.05 కోట్ల రూపాయలు కేటాయించారు. కేంద్ర పన్నులు, డ్యూటీల నుండి 2.437 శాతం నిధులు తెలంగాణకు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన కార్పొరేట్ పన్నుల నుండి 6,665.84 కోట్లు, ఆదాయం పన్ను నుండి 5,600.58 కోట్లు, ఆస్తిపన్ను నుండి 0.18 కోట్లు, సెంట్రల్ జీఎస్టీ పన్నుల నుండి 6,229.45 కోట్లు, కస్టమ్స్ పన్నుల నుండి 1,293.35 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ పన్నుల నుండి 794.01 కోట్ల రూపాయలను తెలంగాణకు కేటాయించారు.



రైతుబంధును కాపీ చేశారు

ఎంపీ కవిత ధ్వజం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్రంలో అమలులోకి తీసుకొచ్చిన రైతు బంధు పథకాన్ని కేంద్రం కాపీ కొట్టి బడ్జెట్ రూపొందించారని టీఆర్ఎస్ ఎంపీ కే.కవిత ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ప్రతి ఎకరాకు రెండు దఫాలుగా 5వేల రూపాయులు ఇస్తోందని ఆమె గుర్తుచేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం పథకంలో ఎకరాకు 6 వేల రూపాయలు మాత్రమే ప్రకటించిందన్నారు. కేసీఆర్ రైతు బంధు పథకాన్ని కేంద్రం కాపీ కొట్టిందని ఆమె ఆరోపించారు. తెలంగాణతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వం గొప్పగాలేదని కవిత అన్నారు. అయినా ఈ పథకాన్ని టీఆర్ఎస్ స్వాగతిస్తోందని ఆమె వెల్లడించారు. అలాగే 33 శాతం మహిళల రిజర్వేషన్ అంశాన్ని బడ్జెట్‌లో వెల్లడించలేదన్నారు. కచ్చితంగా ఇది ఎన్నికల బడ్జెట్ మాత్రమేనని కవిటీ ట్వీట్ చేశారు. టీఆర్ఎస్ లోక్‌సభ సభ్యుడు వినోద్‌కుమార్ విలేఖరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో లబ్ధికోసం కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని ఆరోపించారు. విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలు లేనటువంటి

- మిగతా 6వ పేజీలో

ఘనగామా



అందుకేగా మేడం... రాజకీయాలలో నిలదొక్కుకున్నాడు!



చార్జీలు యథాతథం

రైల్వే బడ్జెట్ రూ.1.58 లక్షల కోట్లు


- ప్రయాణ, రవాణా చార్జీల జోలికెళ్లని పీయూష్
- వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు వరం
- వచ్చే రెండేళ్లలో 200 హమ్‌సఫర్, 290 దీన్‌దయాళ్ కోచ్‌లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా రైలు ప్రయాణికులపై ఎలాంటి భారం వేయకుండా ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తాత్కాలిక బడ్జెట్‌ను శుక్రవారం లోక్‌సభలో ప్రవేశ పెట్టారు. అలాగే రవాణా చార్జీలనూ యథాతథంగా కొనసాగించారు. రైల్వే శాఖకు పెట్టుబడుల వినియోగం కింద రూ. 1.54లక్షల కోట్లను కేటాయించారు. ఈ వివరాలను ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గత ఏడాది రైల్వే శాఖకు రూ.1.48లక్షల కోట్ల బడ్జెట్‌ను మంజూరు చేశారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణం ప్రయాణికులకు మంచి అనుభూతిని ఇస్తుందని, ప్రపంచ స్థాయి ప్రమాణాలను ఈ రైలులో ప్రవేశపెట్టామని కేంద్రమంత్రి పేర్కొన్నారు. రైల్వే శాఖ రోలింగ్ స్టాక్ మెరుగుదలకు బడ్జెట్‌లో రూ. 6,114.82 కోట్లను కేటాయించింది. రోలింగ్ స్టాక్ అంటే ట్రాక్‌పై అన్ని రకాల రైళ్లు, గూడ్సు రైళ్ల రాకపోకల రద్దీ. ఈ రేటును 64 శాతం పెంచాలని నిర్ణయించారు. ప్రపంచ వ్యాప్తంగా రోలింగ్ స్టాక్ మార్కెట్ 200 బిలియన్ డాలర్లు ఉంది. 2018-19లో రోలింగ్ స్టాక్‌కు రూ.3724.93 కోట్లను కేటాయించారు. 2021 నాటికి దేశీయ పరిజ్ఞానంతో కోచ్‌లు, వ్యాగన్ల తయారీకి ప్రణాళికలను రైల్వే శాఖ రూపొందించింది. ఇప్పటికే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు 180 కి.మీ వేగంతో ప్రయాణిస్తూ రికార్డు సృష్టించింది. కొత్తగా ఎయిర్ కండిషన్ కోచ్‌ల తయారీకి రైల్వే శాఖ వినూత్న ప్రణాళికలను రూపొందించనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. రాయబరేలిలోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీకి, చెన్నైలోని ఇంటిగ్రెల్ కోచ్ ఫ్యాక్టరీకి, కపుర్తలా, హాల్దియాలోని ఫ్యాక్టరీల ద్వారా 2019-2021 మధ్య 15వేల కోచ్‌లను తయారు చేయాలని కేంద్ర రైల్వేశాఖ ప్రణాళికను ఖరారు చేసింది. ఇందులో 200 హమ్‌సఫర్ కోచ్‌లు, 290 దీన్ దయాళు కోచ్‌లు, 40 అంత్యోదయ కోచ్‌లు ఉన్నాయి. ఇంకా ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్, మెయిన్‌లైన్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్లను తయారు చేస్తున్నారు. ఒక్కో రైలును రూ.97 కోట్ల వ్యయంతో ఆరు ట్రైన్-18 కోచ్‌లను తయారు చేసే ప్రతిపాదనలను ఆమోదించారు. అలాగే 884 దీన్ దయాళ్ జనరల్ కేటగిరీ కోచ్‌లను తయారు చేస్తారు. ఇవన్నీ జనరల్ కేటగిరీ కోచ్‌లు. వీటిల్లో బయో టాయిలెట్లు ఉంటాయి. ఇంకా 600 మెమూ ప్యాసింజర్ రైళ్లను తయారు చేస్తారు. పెద్ద నగరాల్లో ప్యాసింజర్ రైళ్ల కోచ్‌ల స్థానంలో వీటిని ప్రవేశపెట్టనున్నారు. 2019వ సంవత్సరం రైళ్లరాకపోకలకు సంబంధించి చక్కటి పటిష్టమైన చర్యలు తీసుకున్నామని, రైళ్లు సురక్షితంగా, నిర్దేశించిన గమ్యానికి చేరుకున్నాయని చెప్పారు. బ్రాడ్‌గేజ్ నెట్‌వర్క్‌లో అన్‌మాన్డ్ లెవెల్ క్రాసింగ్‌లు లేకుండా చర్యలు తీసుకున్నారు. రైల్వే శాఖకు సంబంధించి టెక్నాలజీని అభివృద్ధి చేశామని, ఎక్కువ ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

సందేహాలు తీర్చండి

ఈవీఎంలపై ఈసీని కలవనున్న విపక్షాలు

8



వెనక్కి వెళ్లేది లేదు

ఈవీఎంలతోనే ఓటింగ్
తేల్చిచెప్పిన కేంద్ర ఎన్నికల సంఘం

ఓట్లపై ప్రేమే తప్ప మేలు చేసేది కాదు

కేంద్ర బడ్జెట్‌పై పీసీసీ పెదవి విరుపు



విలేఖరులతో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్, కోదండరెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కాదని, అది ఓట్ల బడ్జెట్ అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అభివర్ణించింది. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందించినట్టే ఉంది తప్ప ప్రజలకు మేలు చేసేలా లేదని టీపీసీసీ పెదవి విరిచింది. గాంధీభవన్‌లో కేంద్ర బడ్జెట్‌పై స్పందిస్తూ శుక్రవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి మీడియాతో మాట్లాడారు.

మధ్య తరగతి ప్రజానీకానికి ఆదాయ పన్ను పరిమితిని పెంచి వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామని చెప్పడంలోనే కేంద్ర ప్రభుత్వానికున్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమౌతుందని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బీజేపీ వ్యాపారస్తుల పార్టీ అని మరోసారి రుజువు ఈ బడ్జెట్ ద్వారా నిరూపితమైందన్నారు. పన్ను ఎగవేతదారుల గురించి కేంద్రం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీ సర్కార్ బడా వ్యాపారస్తుల మన్ననలు పొందే ప్రయత్నం చేసిందని విమర్శించారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేసిందన్నారు. తమ పథకాన్ని కాపీ కొట్టారని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానిస్తే, తమను సరిగా కాపీ కొట్టలేకపోయారని ఎంపీ కవిత వ్యాఖ్యానించారని పొన్నం గుర్తు చేశారు. దేశంలో కొత్తగా ఏ పథకం వచ్చినా అది తామేనని టీఆర్‌ఎస్ డప్పు కొట్టుకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. మోదీ వల్ల సామాన్యుడికి ఒరిగిందేమి లేదని, ఆయన్ను గద్దె దించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పొన్నం హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడితే, బీజేపీ వచ్చాక దానిని నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు. బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులు లేకపోయినా, విభజన హామీలను నెరవేర్చలేకపోయినా టీఆర్‌ఎస్ ఎంపీలు ఎందుకు స్పందించడం లేదని పొన్నం ధ్వజమెత్తారు. కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ సర్కార్ నాలుగున్నరేళ్లుగా రైతాంగాన్ని విస్మరించి ఎన్నికల కోసం ప్రేమ ఒలకబోస్తోందని దుయ్యబట్టారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు అలమటిస్తుంటే ఏ రోజు అయినా వారి గురించి కేంద్రం ఆలోచించిందా? అని కోదండరెడ్డి ప్రశ్నించారు. కేంద్రంలో మోదీ సర్కార్ వచ్చాకే వంట నూనె, చక్కెర, పప్పు ధాన్యాలను దిగుమతి చేసుకునే పరిస్థితి ఏర్పడిందని కోదండరెడ్డి విమర్శించారు. ప్రభుత్వం చేసుకుంటున్న దిగుమతుల వల్ల వ్యవసాయరంగం సంక్షోభంలో పడిందని కోదండరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం అమలు చేస్తోన్న ఫసల్ బీమా పథకం ఒక పెద్ద కుంభకోణమని ఆయన ఆరోపించారు.

రైతు బంధు పేరు మార్చారు

★ ట్విట్టర్‌లో కేటీఆర్



కేటీఆర్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు బంధు పథకాన్ని కేంద్రం అనుకరించిందని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు తెలిపారు. కాకపోతే రైతుబంధు పథకం పేరు మార్చి బడ్జెట్‌లో ప్రకటించిందని ఆయన శుక్రవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు మానస పుత్రిక అయిన రైతు బంధు దేశానికి ఆదర్శంగా నిలవడం, దేశ ప్రజలకు అందనుండడం హర్షనీయమని తెలిపారు. అనుకరణకు మించిన ప్రశంస మరేదీ లేదని ఆయన పేర్కొన్నారు.


కేంద్రం కాపీ కొట్టింది: అసద్

రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న రైతు బంధు పథకాన్ని కేంద్ర ప్రభుత్వం కాపీ కొట్టిందని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ లాంటి రాజకీయ దూరదృష్టి దేశానికి ఎంతైనా అవశ్యకత ఉందని అసద్ ట్విట్ చేశారు. దేశానికి దిశా నిర్దేశం చేసే సత్తా కూడా కేసీఆర్‌కే ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ చురుకుదనం ముందు చూపు, అమోఘమైన జ్ఞానం దేశానికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ప్రకృతి విలయంతో తల్లడిల్లుతున్న కరవు ప్రాంతాల్లోని రైతులకు రైతుబంధు లాంటి పథకం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఇదంతా ముఖ్యమంత్రి కేసీఆర్ క్రెడిట్ అని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలనే కేంద్రం అనుకరిస్తున్నదని, ప్రధాని నరేంద్ర మోదీకి సొంత ఆలోచనలు లేవని అన్నారు.

సంక్షేమం కోసం సాహసోపేత చర్యలు

ఓట్ ఆన్ బడ్జెట్‌పై బీజేపీ ప్రశంసలు

ఆంధ్రభూమి బ్యూరో



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

హైదరాబాద్, ఫిబ్రవరి 1: కేంద్రప్రభుత్వం అత్యంత సాహసోపేతమైన సంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్ పేర్కొన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన ఆదర్శప్రాయమైన ఆధునిక దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని నరేంద్రమోదీ విజన్‌కు అనుగుణంగా ఆర్థిక శాఖ సహాయ మంత్రి పియూష్ గోయల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ దేశాభివృద్ధి , పేదల సంక్షేమం కోసం పది సూత్రాలను అమలుచేస్తూ ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌గా అభివర్ణించారు. నవ భారత నిర్మాణానికి దోహదం చేసే బడ్జెట్ ప్రవేశపెట్టిన నరేంద్రమోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మరోమారు నరేంద్రమోదీని ప్రధానిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించే బడ్జెట్ అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఆదాయపన్ను పరిమితిని ఐదు లక్షలకు పెంచడం సాహసోపేతమని అన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి కింద దేశవ్యాప్తంగా ఐదు ఎకరాల లోపు రైతులకు ఐదు వేల రూపాయిల సాయం అందించడం గొప్ప నిర్ణయమని అన్నారు. ఈ పథకం కింద ఇచ్చే సాయాన్ని రైతుకు ఐదు వేలు అందజేస్తూనే అదనంగా తాజా అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో రైతుబంధు పథకం కింద ఎకరాలకు 10వేల రూపాయిలు పెట్టుబడి సాయం అమలుచేయాలని అన్నారు. 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేయడమే ప్రధాని లక్ష్యమని చెప్పారు. భూసార కార్డుల జారీ, పంట పెట్టుబడికి ఒకటిన్నర రెట్లు కనీస మద్దతు ధర పెంచడం, పంట బీమా లాంటి అనేక పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు భద్రతనిస్తూ ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ కింద నెలకు మూడు వెల రూపాయిల పింఛను ఇవ్వడాన్ని కొనియాడారు. రక్షణ రంగానికి మూడు లక్షల కోట్లతో పాటు అనేక రంగాలకు సముచితంగా కేటాయింపులు జరిపారని అన్నారు. సబ్‌కా సాథ్- సబ్‌కా వికాస్ అనేదే బీజేపీ విధానమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్ రామచందర్ రావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి చింతా సాంబమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎ మల్లారెడ్డి, అధికార ప్రతినిధి రాకేశ్ రెడ్డి, కిసాన్‌మోర్చ అధ్యక్షుడు గోలి మధుసూధన్‌రెడ్డి, యువ మోర్చ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, నాయకులు పాపయ్య గౌడ్, ఎన్ వేణుగోపాల్‌రెడ్డి, సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

లోపాలు లేకుండా మంచినీటి సరఫరా

మిషన్ భగీరథలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్★ అధికారులతో మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సబర్వాల్ సమావేశం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరాలో లోపాలు తలెత్తకుండా ఇంటెలిజెన్స్ ఆర్టిఫిషియల్ సాంకేతికతను వినియోగించుకునే అంశాన్ని ప్రభుత్వం యోచిస్తోంది. మంచినీటి సరఫరాలో లోపాలు తలెత్తకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో స్మార్ట్ టెర్రా స్టార్టప్ ప్రతినిధి గోకుల్ కృష్ణ శుక్రవారం మిషన్ భగీరథ ఉన్నతాధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మిషన్ భగీరథపై నిర్వహిస్తోన్న వర్క్ షాప్ శుక్రవారం రెండో రోజు కార్యక్రమానికి మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సబర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, స్థిరమైన మంచినీటి సరఫరా అంశంపై చీఫ్ ఇంజనీర్ విజయ్ ప్రకాశ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మిషన్ భగీరథలో ఎలాంటి ఆటంకాలు లేని మంచినీటి సరఫరా వ్యవస్థ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తలెత్తే సమస్యలను వివరించారు. మిషన్ భగీరథతో 24 గంటల మంచినీటి సరఫరాకు ఉన్న సాధ్యాసాధ్యాలు, ఎదురయ్యే సమస్యలపై అస్కీ డైరెక్టర్ శ్రీనివాసా చారి ప్రజెంటేషన్ ఇవ్వగా, తలెత్తే సమస్యలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పరిష్కరించవచ్చని టెర్రా స్టార్టప్ ప్రతినిధి గోకుల్ కృష్ణ వివరించారు. రోజు వారీ నీటి వినియోగం, లీకేజీలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గుర్తించవచ్చన్నారు. యునిసెఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ, తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మంచినీటి సౌకర్యాలు, శుద్ధి చేసిన నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు తమ సర్వేలో తేలిందన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజల సమస్యలు తీరుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ అమలు తర్వాత ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పులు వస్తాయని ఈ సంస్థ కార్యదర్శి స్మితా సబర్వాల్ అన్నారు. యునిసెఫ్ భాగస్వామ్యం కావడంతో ఇది మరింత ప్రతిష్టాకరంగా మారిందన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఇంటి ముందుకే మంచినీటిని తీసుకొస్తుందని ప్రజలు జాగ్రత్తంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.



మిషన్ భగీరథపై జరిగిన వర్క్‌షాప్‌కు హాజరైన ఆ సంస్థ కార్యదర్శి స్మితా సబర్వాల్, సాంకేతిక నిపుణులు

ప్రలోభాల బడ్జెట్: జగన్

ఆంధ్రభూమి బ్యూరో



హైదరాబాద్, ఫిబ్రవరి 1: ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్ పేరిట ప్రలోభాల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. పైగా ఆంధ్ర ప్రదేశ్‌కు లోగడ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పేర్కొనలేదని ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం జగన్ లోటస్ పాండ్‌లోని తన నివాసంలో పార్టీ ముఖ్యులతో సమావేశమై కేంద్ర బడ్జెట్‌పై, ఏపీ అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ నాలుగు నెలలకు ప్రవేశపెట్టాల్సిన బడ్జెట్‌లో వాగ్దానాలు, వరాలు, పథకాలు పెడుతున్నారంటే ప్రజలను మోసం చేయడంలో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పెద్ద పీహెచ్‌డి తీసుకున్నారని అర్థం అవుతున్నదని విమర్శించారు. మధ్యంతర బడ్జెట్ ప్రవేశ పెడుతూ ఇంత హడావుడి చేస్తున్నారంటే, ఇంతగా ప్రలోభాలకు దిగుతున్నారంటే రాజకీయాలు ఎంతగా దిగజారాయో ప్రజలకు అర్థం అవుతున్నదని అన్నారు. ఇది దిగజారుడు రాజకీయాల్లో కొత్త ఒరవడి అని ఆయన తెలిపారు. ఈ ఐదో బడ్జెట్లో కూడా ఏపీకి రావాల్సిన హామీల అమలు గురించి ప్రస్తావించకపోవడం దురదృష్టకరమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతకానితనం వల్లే రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతింటున్నాయని ఆయన విమర్శించారు. ఓటుకు కోట్లు కేసు ఘటన తర్వాత చంద్రబాబు లొంగుబాటు వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఆ తర్వాతే ప్రత్యేక హోదాను చంద్రబాబు వదిలేసి ప్యాకజీకి సరేనన్నారని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా కేంద్రానికి ధన్యవాదాలు తెలుపుతూ అసెంబ్లీలో నాలుగు సార్లు తీర్మానాలు చేయించారని జగన్ చెప్పారు. ఆ రోజున చంద్రబాబు చేసిన నిర్వాహకం పట్ల తాము నిరసన వ్యక్తం చేస్తూ నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వచ్చామని ఆయన గుర్తు చేశారు. అసెంబ్లీలో ఆందోళన వ్యక్తం చేసినందుకు పార్టీ ఎమ్మెల్యేలకు ప్రివిలేజస్ నోటీసులు ఇప్పించారని ఆయన తెలిపారు. ఇప్పుడు అసెంబ్లీలో ఎవరూ లేనందున చంద్రబాబు భారీ డైలాగులు కొడుతున్నారని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో లేని వ్యక్తుల గురించి చంద్రబాబు మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన పార్టీలన్నింటికీ గుణపాఠం తప్పదని జగన్ హెచ్చరించారు.

చదువుతో పాటు విజ్ఞానం, వికాసం అవసరం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: చదువుతో పాటు విద్యార్థులకు వినోదం, వికాసం, విజ్ఞానం పెంచడంతో పాటు ప్రపంచ అవగాహన కల్పించే చర్యలను శ్రీ చైతన్య స్కూల్స్ చేపట్టిందని సంస్థ అధినేత డాక్టర్ బిఎస్ రావు, అకడమిక్ డైరెక్టర్ సీమ చెప్పారు. 105 మంది విద్యార్థులు, 10 మంది టీచర్లతో 8 రోజుల పాటు మలేషియా, సింగపూర్‌లలో విజయవంతంగా విజ్ఞాన ప్రదర్శన నిర్వహించామని, గతంలో 110 మంది విద్యార్థులతో 10 రోజుల పాటు ఐదు దేశాల్లో విజయవంతంగా విజ్ఞాన పర్యటన చేపట్టామని అన్నారు. దీనికి విద్యార్థులు తల్లిదండ్రుల నుండి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. ఇదే ఉత్సాహంతో వచ్చే జూన్‌లో అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో జరిగే అంతర్జాతీయ అంతరిక్ష అభివృద్ధి సమావేశాలకు విద్యార్థులను సమాయత్తం చేస్తున్నామని అన్నారు. తద్వారా విద్యార్థులను గ్లోబల్ లీడర్స్‌గా తీర్చిదిద్దాలనేదే తమ ఉద్ధేశ్యమని చెప్పారు. మలేషియా పుత్రజయ నగర పర్యటనలో భాగంగా పుత్ర మసీదు, ప్రధాని కార్యాలయ భవనం పెర్ధన పుత్ర, మానవ నిర్మిత పుత్ర సరస్సు, దానిపై నిర్మించిన మూడు అంతస్తుల బ్రిడ్జి , అలాగే సింగపూర్‌లో నైట్ సఫారీ , సైన్స్ సెంటర్‌లలో తదితర ప్రాంతాలను విద్యార్థులు సందర్శించారని చెప్పారు.

వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు అభినందన

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: వికలాంగుల సంక్షేమ శాఖ సంచాలకురాలు శైలజను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి అభినందించారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో వికలాంగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసిన శైలజకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఇసీ) అవార్డును అందజేసింది. ఇలాఉండగా శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషిని శైలజ కలిసారు. ఈ సందర్భంగా డాక్టర్ జోషి ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అవార్డు అందుకోవడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని ఆయన అన్నారు.

ఐదు వర్సిటీల్లో వైకాపా విద్యార్థి విభాగాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్ర ప్రదేశ్‌లోని ఐదు విశ్వ విద్యాలయాల పార్టీ విద్యార్థి విభాగాలకు ఇన్‌ఛార్జీలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎస్కేయు, జెఎన్‌టియు అనంతపురం, రాయలసీమ, విక్రమసింహాపురి వర్సిటీలకు ఇన్‌ఛార్జీగా జి. లింగారెడ్డి, ఎస్‌వీ వర్సిటీ ఇన్‌ఛార్జీగా పి. మురళీధర్, జెఎన్‌టీయు-కాకినాడ, విజ్ఞాన్, కేఎల్ వర్సిటీల ఇన్‌ఛార్జీగా కే. రాజశేఖర్, ఆంధ్ర వర్సిటీ ఇన్‌ఛార్జీగా బీ. మోహన్ బాబు, నాగార్జున వర్సిటీ ఇన్‌ఛార్జీగా కే. కిరణ్‌ను నియమించింది.

ఏపీకి నేడు సుప్రీంకోర్టు సీజే గొగోయ్ రాక

అమరావతి, ఫిబ్రవరి 1: రాజధాని అమరావతిలో ఈనెల 3వ తేదీన జుడీషియల్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంతో పాటు శాశ్వత హైకోర్టు భవనాల శంకుస్థాపనకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ రానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం అమరావతి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి రంజన్‌తోపాటు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్‌వి రమణ, లావు నాగేశ్వరరావు, ఆర్ సుభాష్‌రెడ్డి ఏపీ, తెలంగాణ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు సీనియర్ అధికారిని నియమించారు. వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికార్లకు కూడా బాధ్యతలు అప్పగించారు.

భవన నిర్మాణ ప్రాంతాల్లో భద్రత కల్పించాలి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: డబుల్ బెడ్‌రూమ్ భవన నిర్మాణాల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రత, కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. నిర్మాణ స్థలాల్లో సరైన భద్రత లేదని శుక్రవారం నాడొక ప్రకటనలో ఆరోపించారు. రాంపల్లిలో ఇటీవల నిర్మాణ పనులు చేస్తూ మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు. కనీసం కుటుంబానికి రూ. 25 లక్షలు రూపాల పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర బడ్జెట్ భేష్

★ తెలంగాణ, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో అన్ని వర్గాలకు చేయూతనిచ్చేదిగా ఉందని తెలంగాణ, ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ అభిప్రాయపడింది. శుక్రవారం హైదరాబాద్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ సమాఖ్య కార్యాలయంలో కేంద్ర బడ్జెట్‌పై చర్చా కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి జంట నగరాల్లోని పారిశ్రామిక వేత్తలు, మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలను సంతృప్తి పరిచిందని సమాఖ్య వైస్ ప్రెసిడెంట్ రమాకాంత్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కరునేంద్ర అన్నారు. ఈ బడ్జెట్ అందరికీ ప్రయోజనకారని చెప్పక తప్పదని పేర్కొన్నారు. 2019- 2020 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను చాంబర్ స్వాగతిస్తోందన్నారు. ముఖ్యంగా రైతాంగం కోసం తీసుకొచ్చిన పీఎం కిసాన్ సమ్మాన్ పథకం అద్భుతమని చెప్పారు. రైతాంగానికి కొంతలోకొంతైనా కష్టాలు తీరుతాయని స్పష్టం చేశారు. ఈ పథకంతో రైతులకు భరోసా ఇచ్చినట్లుగా ఉందన్నారు. ఐదు ఎకరాలు, అంతకు తక్కువ ఉన్న వ్యవసాయ రైతులకు నేరుగా బ్యాంక్‌ల్లో రూ. 6 వేలను జమ చేయడం ముదావహం అన్నారు. దీనివల్ల రైతుకు ప్రత్యక్షంగా మేలు జరుగుతుందన్నారు. ఈ విధానం ఒక విధంగా అధికారులకు లంచాలు ఇచ్చే బాధ తప్పుతుందని రామాకాంత్ చెప్పారు. వ్యవసాయ కూలీలకు బీమా పథకాన్ని ప్రవేశపెట్టడంతో వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతుందని తెలిపారు.

తాయిలాల బడ్జెట్: టీడీపీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ కేవలం ఎన్నికల తాయిలాలుగా ఉన్నాయని టీడీపీ సీనియర్ నేత రావుల చంద్రశేఖరరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఎన్టీఆర్ భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కోసం తీసుకువచ్చిన బడ్జెట్‌గా ఆయన అభివర్ణించారు. మోదీ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా ప్రజలను అన్ని విధాలా ఇబ్బందులకు గురి చేసిందన్నారు. నోట్ల రద్దుపై కేంద్రం కనీసం అఖిల పక్ష సమావేశం నిర్వహించలేదని ఆయన చెప్పారు. దేశ వ్యాపితంగా 12 కోట్ల మంది రైతులు ఉన్నారని కేంద్రం చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర ప్రకటించలేదన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు ఎందుకు అమలు చేయలేదని ఆయన నిలదీశారు.

రాష్ట్రంలో అంగన్‌వాడీలకు రేషన్ షాపుల ద్వారా బియ్యం

వేలి ముద్రల ఆధారంగా పంపిణీ ★ ఈ-పాస్ యంత్రాల వినియోగం



ఈ-పాస్ ప్రక్రియను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించింది. బియ్యం పంపిణీలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం కోసం వేలి ముద్రల ఆధారంగా 35,700 కేంద్రాలకు సమీపంలో ఉన్న రేషన్‌షాపుల్లో ఈ-పాస్ యంత్రాల ద్వారా బియ్యాన్ని పంపిణీ ప్రక్రియను చేపట్టింది. దీని కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న మొత్తం 72 వేల మంది వర్కర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్ల ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లో ప్రారంభించిన కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లాలోని కొన్ని రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీలో నాణ్యతను మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎం జగదీశ్వర్, డైరెక్టర్ విజయేందిర బోయి, పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ పరిశీలించారు. బియ్యం పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పౌరసరఫరాలశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖలు సమన్వయంతో పని చేయాలని అకున్ సబర్వాల్ సూచించారు. ఈ కొత్త విధానంలో అంగన్‌వాడీ నిర్వాహకులు ఏ రోజు ఎన్ని క్వింటాళ్ల బియ్యాన్ని తీసుకెళ్లిందీ తెలుసుకోవడం సులభతరంగా ఉంటుందన్నారు. గతంలో పౌరసరఫరాల సంస్థ గోదాముల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు కాంట్రాక్టర్లు బియ్యం సరఫరా చేయడం వల్ల అనేక అక్రమాలు జరగడం వల్ల ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టినట్టు అకున్ సబర్వాల్ వివరించారు.

వెనిజులాపై మీ పెత్తనమేమిటి?

★ అమెరికాపై సురవరం ఆగ్రహం



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: వెనిజులా అంతరంగిక వ్యవహారంలో క్షోభంలో అమెరికా జోక్యం చేసుకోవడంపై సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ముఖ్దూం భవన్‌లో పార్టీ నేతలు చాడ వెంకటరెడ్డి, సుధాకర్‌తో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రభుత్వంపై అమెరికా సామ్రాజ్యవాదం దాడి గర్హనీయమన్నారు.

ఇది ప్రపంచ శాంతికి విఘాతమేనని ఆయన చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన మదురో ప్రభుత్వాన్ని కూలదోసి 'గుయ్‌డో' తానే అధ్యక్షునిగా ప్రకటించుకుంటే ట్రంప్ మద్దతు ఇవ్వడం ఏమిటని ఆయన నిలదీశారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ట్రంప్ తుంగలో తొక్కారని అన్నారు. వెనిజులా దేశంలో ఆయిల్ నిక్షేపాలు ఎక్కువగా ఉన్నాయని అందుకే అమెరికా కన్నేసిందని ఆయన ధ్వజమెత్తారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడారు.

చలి తీవ్రతకు ముగ్గురు వృద్ధుల మృతి

పాత బెల్లంపల్లి గ్రామంలో విషాదం



మృతులు బాలయ్య, రుక్కమ్మ, మల్లమ్మ (ఫైల్‌ఫొటోలు)

బెల్లంపల్లి, ఫిబ్రవరి 1: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని పాత బెల్లంపల్లి గ్రామంలో గురువారం రాత్రి చలి తీవ్రతను తట్టుకోలేక ముగ్గురు వృద్ధులు మృతి చెందారు. రెండు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో గ్రామానికి చెందిన జంగ మల్లమ్మ (90), గురువారం రాత్రి మృతి చెందింది. అంతేకాకుండా శుక్రవారం తెల్లవారుఝామున అదే గ్రామంలో కందుల బాలయ్య (75), ఇత్తినేని రుక్కమ్మ (70) కూడా చలి తీవ్రతను తట్టుకోలేక మృతి చెందారు. చలి తీవ్రత ఎక్కువ అవడంతో కొన్ని గంటల వ్యవధిలోనే ముగ్గురు వృద్ధులు మృతి చెందడంతో పాత బెల్లంపల్లి గ్రామంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి.

భవనం పైనుంచి దూకి ఐఐటీ విద్యార్థి ఆత్మహత్య

★ మిత్రుడికి మెయిల్ ద్వారా ముందస్తు సమాచారం

★ మానసిక వత్తిడే కారణమని అనుమానం

ఆంధ్రభూమి బ్యూరో



అనిరుధ్య (ఫైల్‌ఫొటో)

సంగారెడ్డి, ఫిబ్రవరి 1: మానసిక వత్తిడిని తట్టుకోలేక ఏడంతస్తుల భవనం పైనుంచి దూకి బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కంది గ్రామ శివారులోని ఐఐటీహెచ్‌లో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన అనిరుధ్య (21) తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని బోయినిపల్లిలో నివాసం ఉంటున్నారు. బీటెక్ 4వ సంవత్సరం మెకానికల్ అండ్ ఎరోస్ ఇంజనీరింగ్ చేస్తున్న అనిరుధ్య కొంత కాలంగా మానసిక వత్తిడికి గురవుతున్నట్లు తెలిసింది. ఇటీవలే మానసిక వైద్యులను సైతం సంప్రదించినట్లు సమాచారం. కాగా గురువారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో తన స్నేహితుడు కనిష్క్‌రెడ్డికి ఈ మెయిల్ ద్వారా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమాచారం చేరవేసాడు. ఏడవ అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఈ మెయిల్‌లో సమాచారం ఇచ్చారు. అనిరుధ్య భవనంపై నుంచి పడిన వెంటనే ఐఐటీహెచ్‌లోనే ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మొదట ప్రమాదవశాత్తు అనిరుధ్య చనిపోయాడని భావించగా కనిష్క్‌రెడ్డి ఈ మెయిల్ చూసాక ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ధృవీకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభయారణ్యంలో అనుక్షణం భయం!

కవ్వాల్ అడవుల్లో వేటగాళ్ల ఇష్టారాజ్యం • అంతరిస్తున్న మూగజీవాలు • రెండు పులులు, చిరుతల మృతిపై సర్కారు సీరియస్ • మంచిర్యాల ఎఫ్‌డివోపై బదిలీ వేటు

ఆంధ్రభూమి బ్యూరో

ఆదిలాబాద్,ఫిబ్రవరి 1: స్మగ్లర్ల గొడ్డలివేటుకు అటవీ సంపద అంతరించిపోతుంటే.. మరోవైపు వేటగాళ్ళ ఉచ్చుకు వన్యప్రాణుల సంఖ్య హరించుకుపోతున్న వరస సంఘటనలు అటవీ శాఖ అధికారుల్లో అలజడి రేపుతున్నాయి. రాష్ట్రంలోని కవ్వాల్, అమ్రాబాద్ టైగర్‌జోన్ పరిధిలో వేటగాళ్ళ ఉచ్చుకు భారీ సంఖ్యలో వన్యప్రాణులు మృతి చెందుతున్న ఘటనపై కేంద్ర అటవీ శాఖతో పాటు వైల్డ్‌లైఫ్ విభాగం ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టిసారించి ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తుకు నడుం బిగించారు. దట్టమైన అటవీ సంపదతో పాటు వివిధ రకాల వన్యప్రాణులకు అలవాలమైన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో శాకాహర జీవుల నుండి అడవి రాజు అయిన పెద్దపులి వరకు స్మగ్లర్ల వేటకు బలైపోతున్న వరస ఘటనల నేపథ్యంలో కవ్వాల్ అభయారణ్యం సంరక్షణ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇటీవల పెంబి మండలం పాండ్వపూర్ అడవుల్లో కరెంట్ తీగలు అమర్చి పెద్దపులిని హతమార్చిన ఘటనలో స్మగ్లర్ బానోత్ ప్రకాష్‌ను అరెస్ట్ చేయగా ఈ కేసులో ప్రమేయం ఉన్న రేంజ్ ఆఫీసర్‌తో పాటు నలుగురిపై సస్పెన్షన్ వేటు విధించారు. అదే విధంగా మంచిర్యాల మండలం రంగపేట అడవుల్లో వేటగాళ్ళు అమర్చిన కరెంట్ తీగల ఉచ్చుకు చిరుత పులి బలికాగా ఇదే జిల్లాలోని జైపూర్ మండలం శివారం వద్ద పెద్దపులిని హతమార్చి కళేబరాన్ని అక్కడే పూడ్చిపెట్టగా గోళ్ళు, చర్మాన్ని ఒలిచి స్మగ్లర్లు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా స్వచ్ఛంద సంస్థ సభ్యుల సమాచారంతో పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటనపై సీరియస్‌గా స్పందించిన ప్రభుత్వం మంచిర్యాల డివిజన్ అటవీ శాఖ అధికారి జూపల్లి వెంకటేశ్వర్‌రావుపై బదిలీ వేటు వేస్తూ హైదరాబాద్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేయగా శివారంలో పులి హతం కేసులో సంబంధిత బీట్ అధికారి ఎం.జ్యోతిని శుక్రవారం సస్పెండ్ చేశారు. అదే విధంగా బాధ్యతరహితంగా విధులు నిర్వర్తిస్తున్నారే అభియోగంపై అటవీ సెక్షన్ అధికారులు చంద్రమోహన్, సంతోష్ మండల్, బాలకృష్ణలకు చార్జిమెమోలు జారీచేయడం అటవీ శాఖలో కలకలం రేపింది. వన్యప్రాణులు వేటగాళ్ళ ఉచ్చులో పడి మరణిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 7లక్షల 20వేల హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉండగా కవ్వాల్ అభయారణ్యం పరిధిలో 2లక్షల 12వేల హెక్టార్లు విస్తరించి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా వన్యప్రాణులు, పులుల సంరక్షణ కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుండగా ఈ జిల్లాలో అనువైన వాతావరణాన్ని కల్పించకపోవడంతో జీవ సమతుల్యత లోపించి వన్యప్రాణుల మనుగడ కష్టతరంగా మారింది. దశాబ్దం క్రితం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 5వేలకు పైగా కుందేళ్ళు, 3,400 పైగా అడవి పందులు, 4వేలకు పైగా జింకలు, 2వేలకు పైగా మనుబోతులు, దుప్పులు ఉండేవని లెక్కలు చెబుతున్నాయి. 2008లో పులుల విషయానికి వస్తే ఆదిలాబాద్ జిల్లాలో 19 పులుల సంఖ్య ఉంటే ప్రస్తుతం రెండు పులులు మృతి చెందడంతో జిల్లాలో ప్రస్తుతం రెండు పులులు మాత్రమే ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లా సరిహద్దులోని ప్రాణహిత మీదుగా తాడోబ వన్యప్రాణి ప్రాంతానికి పులులు వలస వెళ్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకు కారణం ఇక్కడ వేటగాళ్ళు పెట్రేగి వన్యప్రాణులను వధించి సొమ్ము చేసుకోవడం, అటవీ అధికారులు స్మగ్లర్లతో చేతులు కలపడం వల్లే మూగ జీవాల సంఖ్య తగ్గిపోతున్నట్లు తెలుస్తోంది. 2008లో జిల్లాలో 170 చుక్కల దుప్పిలు ఉంటే ప్రస్తుతం వాటి సంఖ్య 88కి మాత్రమే పరిమితమైంది. 2008లో 32 చిరుత పులులు ఉండగా ప్రస్తుతం 16 చిరుతలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.



జన్నారం వద్ద విస్తరించిన అటవీ ప్రాంతం



రంగపేట అడవుల్లో కరెంట్ తీగల ఉచ్చుకు బలైన చిరుతపులి (ఫైల్‌ఫొటో)

సాంబర్లు, కృష్ణ జింకల, కొండెంగలు, కొండ గొర్రెలు, అడవి పందులు నానాటికి వేటగాళ్ళ ఉచ్చుకు బలవుతూ వన్యప్రాణుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతున్న అధికారుల్లో చలనం కనిపించడం లేదు. వన్యప్రాణి విభాగం, కవ్వాల్ అభయారణ్యం సంరక్షణపై అధికారుల నిర్లక్ష్యం బయటపడిన నేపథ్యంలో వాటి మనుగడ, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అటవీ శాఖ ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే ఆరుగురు అధికారులపై వేటు పడగా మరో ఐదుగురు డివిజన్ స్థాయి అధికారులను త్వరలోనే బదిలీ చేసి స్మగ్లర్ల ఆటకట్టుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

సీతారామ ప్రాజెక్టుకు లైన్ క్లియర్

అటవీ శాఖ తుది అనుమతులు మంజూరు • 1531 హెక్టార్ల అటవీ భూమి బదలాయింపు


ఆంధ్రభూమి బ్యూరో

ఖమ్మం, ఫిబ్రవరి 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుకు లైన్ క్లియర్ అయింది. ఈ మేరకు తుది అనుమతులను మంజూరు చేస్తూ అటవీ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 1531హెక్టార్ల అటవీ భూమిని బదలాయిస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ అనుమతులిచ్చింది. ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని దాదాపు 9లక్షల ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. 2016 ఫిబ్రవరి 18న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం రోళ్ళపాడు వద్ద ప్రాజెక్టుకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. నాటి నుంచి పనులను చేపట్టిన ప్రభుత్వం మూడు దశల్లో నిర్మాణాలు ప్రారంభించింది. ప్రాజెక్టుకు సంబధించి 13783 ఎకరాల అటవీ భూమిని సేకరించాల్సి ఉండటంతో కేంద్ర అటవీ పర్యావరణ అనుమతుల కోసం ప్రయత్నించి గత ఫిబ్రవరిలో మొదటి దశ అనుమతులు రాగా ఇందుకోసం 276కోట్లు కూడా చెల్లించారు. ఇప్పుడు రెండవదశ అనుమతులు రావడంతో అన్ని అనుమతులు వచ్చినట్లయింది. ప్రాజెక్టు ప్రధాన కాల్వ కిన్నెరసాని వన్యప్రాణి అటవీ ప్రాంతంలో ఉండటంతో అనుమతుల కోసం గట్టిగా ప్రయత్నించాల్సి వచ్చింది. ఫేజ్-1లో అడ్డంకిగా ఉన్న 444హెక్టార్ల అభయారణ్యంలో పనులు చేసేందుకు కేంద్రం అనుమతులు ఇవ్వడంతో వెంటనే పనులు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితా సబర్వాల్ ఈ పనులను పరిశీలించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో భూసేకరణ కూడా పూర్తి కావడం, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నాటికి కొంతమేరకైనా సాగునీరు ఇవ్వాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు రెండు, మూడురోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బృందం కూడా పర్యటించనున్నది. ప్రధాన కాల్వల నిర్మాణం పూర్తి కావచ్చిన నేపథ్యంలో పంపుహౌస్‌ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయడం, మోటార్లు బిగించడం లాంటివి చేయాలని ఆదేశాలు వచ్చాయి.

అప్పుల బాధతో నేత కార్మికుడి ఆత్మహత్య

★ ప్రాణాంతక మెదడు వ్యాధి చికిత్సకు పెరిగిన అప్పులు

★ తీర్చే మార్గం లేక ఇంటిలోనే చీరతో ఉరి



శ్రీనివాస్ మృతదేహం

సిరిసిల్ల, ఫిబ్రవరి 1: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో నేత కార్మికుడు కొండ్ల శ్రీనివాస్ (40) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక టెక్స్‌టైల్ పార్కులో పవర్‌లూం కార్మికుడిగా పని చేస్తున్న శ్రీనివాస్ మెదడులో ప్రాణాంతక వ్యాధి సంక్రమించడంతో అప్పుల పాలై, చివరికి శుక్రవారం సాయంత్రం తన కాలనీలోని తన ఇంటిలో ఉరి వేసుకుని బలవన్మరణం పొందాడు. దీనిపై చేనేత జౌళి శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

కొండ్ల శ్రీనివాస్ టెక్స్‌టైల్ పార్కులోని బాలాజి టెక్స్‌టైల్స్‌లో పవర్‌లూం కార్మికుడిగా పని చేస్తున్నాడు. కొంత కాలంగా మెదడుకు సంబంధించిన వ్యాధి రావడంతో చికిత్స కోసం తిరిగి తిరిగి సుమారు ఎనిమిది లక్షల మేరకు అప్పుల పాలైనట్టు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆయన మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో చికిత్స పొందుతున్నాడు. అప్పులు పెరగడంతో ఇక్కడి ఇందిరమ్మకాలనీలోని ఇల్లు కూడా అమ్మకానికి పెట్టాడు. ఈ స్థితిలో అప్పుల బాధ, అనారోగ్యం తీవ్రం కావడంతో తన ఇంటిలో చీరతో ఉరి వేసుకుని మృతి చెందాడు. భార్య సవిత (32) బీడీ కార్మికరాలుగా పని చేస్తున్నది. శ్రీనివాస్‌కు భార్య, కూతురు అక్షిత (14), కుమారుడు రోహిత్ (8) ఉన్నారు. తంగళ్ళపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కుపాదం మోపితేనే గల్ఫ్ మోసాలకు అడ్డుకట్ట

ఈ దిశగా పోలీసు యంత్రాంగం చొరవ చూపేనా? • సత్ఫలితాలు అందించలేకపోతున్న గల్ఫ్ సెల్

ఆంధ్రభూమి బ్యూరో

నిజామాబాద్, ఫిబ్రవరి 1: ఇటీవలి కాలంలో గల్ఫ్‌లో ఉద్యోగావకాశాల పేరిట నకిలీ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్న ఉదంతాలు తరుచూ వెలుగు చూస్తున్నాయి. ఏజెంట్ల ధన దాహం కారణంగా వందలాది కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడకపోగా, మరింతగా తలకిందులవుతోంది. ఈ క్రమంలోనే పలువురు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ తరహా మోసాలకు అడ్డుకట్ట పడాలంటే నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై ఉక్కుపాదం మోపాల్సిందేనని బాధిత కుటుంబీకులు, పలు సంస్థల ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇటీవలే జిల్లాకు చెందిన 14 మంది యువకులు గల్ఫ్ ఏజెంట్ మాయమాటలు నమ్మి ఇరాక్‌కు వెళ్లి అక్కడే చిక్కుబడిపోయిన విషయం విదితమే. నాలుగు నెలల అనంతరం ఎం.పీ కవిత, తెలంగాణ గల్ఫ్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధి బసంత్‌రెడ్డిల చొరవతో అతి కష్టం మీద స్వస్థలాలకు చేరుకోగలిగారు. ఈ తరహాలో గల్ఫ్ ఏజెంట్ల మోసాల బారి నుండి యువతను కాపాడేందుకు వీలుగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గత ఏడు మాసాల క్రితం ప్రత్యేకంగా గల్ఫ్ సెల్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, నకిలీ ఏజెంట్ల మోసాలు మాత్రం యధాతథంగా కొనసాగుతూనే ఉన్నాయి. గల్ఫ్ ఏజెంట్లు ప్రధానంగా అమాయక యువతకు గల్ఫ్ దేశాల్లో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఆశ కల్పిస్తూ, విజిటింగ్ వీసాలు వారికి అంటగట్టి విదేశాలకు పంపిస్తున్నారు. దీంతో అక్కడికి వెళ్లిన తరువాత యువకులు తాము మోసపోయినట్టు గుర్తించినప్పటికీ, పరాయి దేశంలో చేసేదేమీ లేక అక్కడే చిక్కుబడిపోయి నరకయాతన అనుభవించాల్సి వస్తోంది.

జిల్లాలో గల్ఫ్ ఏజెంట్లే లేరా..?

నిజానికి గల్ఫ్ మోసాలకు చెక్ పెట్టేందుకు వీలుగా ఆయా గ్రామాలలో ఉన్న గల్ఫ్ ఏజెంట్లు వారికి సమీపంలో వున్న పోలీస్ స్టేషన్‌లో తమ వివరాలను నమోదు చేయించుకోవాలని జిల్లా పోలీస్ అధికారులు ఇదివరకే ఆదేశాలు జారీ చేస్తూ నిర్దిష్ట గడువును సైతం విధించారు. అయితే గడువు ముగిసినప్పటికీ జిల్లా మొత్తంలో ఏ ఒక్క పోలీస్ స్టేషన్‌లోనూ గల్ఫ్ ఏజెంట్ల వివరాలు నమోదు కాలేదని తెలిసింది. అంటే జిల్లాలో ప్రభుత్వ అనుమతి కలిగిన గల్ఫ్ ఏజెంట్లు ఒక్కరు కూడా లేరా? లేకపోతే ఉన్న వారందరూ నకిలీలేనా అన్నది పోలీసు అధికారులే నిర్ధారించాల్సి ఉంది. ఈ కోణంలో పోలీస్ శాఖ దృష్టి సారిస్తే నకిలీల వివరాలను తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదనే చెప్పాలి. ఆయా పోలీస్ స్టేషన్ల ద్వారానే కాకుండా పాస్‌పోర్టు వెరిఫికేషన్ బాధ్యతలు నిర్వర్తించే స్పెషల్ బ్రాంచ్ విభాగం ద్వారా, నిఘా వర్గాల నుంచి కూడా గల్ఫ్ ఏజెంట్లకు సంబంధించిన పూర్తి సమాచారం సేకరించేందుకు తగిన వ్యవస్థ ఉన్నప్పటికీ, ఈ దిశగా ఇప్పటివరకు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. మోసపోయిన గల్ఫ్ బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసిన సందర్భాల్లో పలువురిపై చీటింగ్ కేసులు నమోదు చేయడంతోనే సరిపెట్టుకుంటున్నారు. చాలావరకు సయోధ్య కుదిర్చే ప్రయత్నాలే జరుగుతున్నాయని తెలుస్తోంది. ఈ కారణంగా తమపై కఠిన చర్యలు ఉండడం లేదనే భావనతో అనేక మంది గల్ఫ్ ఏజెంట్లుగా అవతారం ఎత్తుతూ నిరుద్యోగ యువతను ఎంతో సులువుగా మోసగిస్తున్నారు. వీసాల పేరుతో ఒక్కొక్కరి నుండి లక్షలాది రూపాయలను వసూలు చేస్తూ, వారిని బోల్తాకొట్టించి కొన్నాళ్ల పాటు అజ్ఞాతంలోకి వెళ్లి మళ్లీ తిరిగి వస్తున్నారు. మోసాలకు పాల్పడే సదరు ఏజెంట్లపై కఠిన చర్యలు చేపడితేనే గల్ఫ్ గాయానికి కాయకల్ప చికిత్స చేసినట్లవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అప్రమత్తతతో మోసాలకు అడ్డుకట్ట

అయితే, ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే యువత కూడా కొంత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. గల్ఫ్ ఏజెంట్లు అక్కడి కంపెనీల్లో ఉద్యోగం అని చెబితే, ఎమిగ్రేషన్ క్లియరెన్స్ కోసం డిమాండ్ లెటర్, పవర్ ఆఫ్ అటార్నీ, యాజమాన్యం నుండి ఉద్యోగ నియామకపు కాంట్రాక్ట్ ఒరిజినల్ ప్రతిని తప్పనిసరిగా అడిగి తీసుకోవాలని సూచిస్తున్నారు. జోర్డాన్, కువైట్, లెబనాన్, లిబియా, యెమన్ వంటి దేశాల్లో ఉద్యోగాల నిమిత్తం వెళ్లే నైపుణ్యం లేని శ్రామికులు, ఇంటి పని కోసం వెళ్లే మహిళలు ఉద్యోగ పత్రాలను ఎమిగ్రేషన్ అధికారులకు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. గల్ఫ్‌కు వెళ్తున్న వారు తమ పాస్‌పోర్టు కనీసం ఆరు నెలల కాలపరిమితి వరకు చెల్లుబాటులో ఉండేలా చూసుకోవాలి. అసలు గల్ఫ్‌లో ఉద్యోగం కోసం ఎంపిక చేసిన రిక్రూటింగ్ ఏజెన్సీకి అనుమతి ఉందా? అన్నది ముందు నిర్ధారించుకోవాలి. గల్ఫ్ ఏజెంట్‌కు ప్రభుత్వ అనుమతి ఉన్న విషయాన్ని నిర్ధారించుకునేందుకు అతనికి పీఓఈ ద్వారా మంజూరు చేసిన రిజిస్ట్రేషన్ లెటర్ చూపాల్సిందిగా కోరవచ్చు. రిజిస్టర్డ్ ఏజెంటు పూర్తి వివరాలు తెలియాలంటే ఎమిగ్రేషన్ శాఖ వెబ్‌సైట్‌ను కూడా సంప్రదించవచ్చు. అదేవిధంగా తన తరపున ఉద్యోగిని నియమించేందుకు అనుమతిస్తూ విదేశీ (కంపెనీ)యాజమాన్యం జారీ చేసిన పవర్ ఆఫ్ అటార్నీ గల్ఫ్ ఏజెంట్ వద్ద తప్పనిసరిగా ఉండాలి. అన్నింటికంటే ముఖ్యంగా గల్ఫ్ ఏజెంట్ల నుండి ఆమోదయోగ్యమైన రసీదులు తీసుకోకుండా వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు చెల్లించకూడదు. ఉద్యోగ ఒడంబడిక పత్రాలను పూర్తిగా చదివి అర్ధం చేసుకున్న తరువాత కానీ, నమ్మకస్తులైన ఇతరులతో చదివించి అన్ని అంశాలు సరిగా ఉన్నాయని నిర్ధారించుకున్న మీదటే వాటిపై సంతకం చేయాలి. తెల్ల కాగితాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ సంతకాలు చేయకూడదు. పై జాగ్రత్తలు పాటిస్తే చాలావరకు గల్ఫ్ మోసాల బారిన పడకుండా తమను తాము కాపాడుకునేందుకు ఆస్కారం ఉంటుందని అధికారులు హితవు పలుకుతున్నారు.

మిర్యాలగూడకు చేరిన మూగ విద్యార్థినులు

ముంబయిలో బధిర విద్యార్థుల ఒలింపియాడ్ తిలకించేందుకు వెళ్లామని వెల్లడి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 1: మిర్యాలగూడ విద్యానగర్ ఎస్‌సి వసతి గృహం నుండి ఈ నెల 29న అదృశ్యమైన ఆలపు పూజ, కటికేరి నింగమ్మలను ముంబాయి నుంచి సాంఘిక సంక్షేమ అధికారులు, పోలీసుల చొరవతో మిర్యాలగూడకు శుక్రవారం సాయంత్రం తీసుకువచ్చారు. మిర్యాలగూడ ప్రభుత్వ బధిర జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (హెచ్‌ఈసి) చదువుతున్న ఇద్దరు విద్యార్థులు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు చెప్పకుండా ఈ నెల 29 ఉదయం బ్యాగులతో వెళ్లిపోగా వారికోసం గాలించి చివరికి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ముంబాయి పోలీసులను అప్రమత్తం చేయగా వారి ఆచూకీ కనుగొన్నారు. వారు ముంబయిలో బధిర విద్యార్థుల ఒలింపియాడ్ తిలకించేందుకు వెళ్లారని పోలీసులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు అంటున్నారు. వారిని తండ్రులు కటికేరి సాయిబన్న, ఆలపు మహేష్‌లకు శుక్రవారం సాయంత్రం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ సిహెచ్.సదానాగరాజు, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి వెంకటకృష్ణ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు జానిమియా, ఆడావత్ పార్వతి సమక్షంలో అప్పగించారు. వారి తల్లిదండ్రుల వెంట వెళ్తున్నట్టు తిరిగి వస్తామని పోలీస్ స్టేషన్‌లో వాంగ్మూలం నమోదు చేశారు. తల్లిదండ్రుల ఇంటి వద్ద 10 రోజుల పాటు ఉండి తిరిగి మిర్యాలగూడ వచ్చి కళాశాలలో చదువుకుంటూ వసతి గృహంలో ఉంటారని సాంఘిక సంక్షేమ సహాయ అధికారి వెంకటకృష్ణ తెలిపారు. మొత్తం మీద జిల్లా అధికార, పోలీసు యంత్రాంగాన్ని వారి అదృశ్యం కదిలించింది. వారు తిరిగి మిర్యాలగూడ చేరిన విషయం, ఫొటోలు కూడా పత్రికల్లో వద్దని అధికారులు పేర్కొంటున్నారు. మహారాష్ట్ర పోలీసులు కూడ ఈ విషయంలో సంపూర్ణ సహకారం అందించారని స్థానిక పోలీసు అధికారులు అంటున్నారు. మొత్తం మీద ఒలింపియాడ్ కోసం వెళ్లారని అధికారులు చెబుతున్న విషయంలో నిజం ఎంతో అర్థం కావడం లేదని, పూర్తి స్థాయిలో విచారణ జరపాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఉస్మానియాకు రూసా ప్రాజెక్టు

• రూ. 100 కోట్లు కేటాయించిన ఎంహెచ్‌ఆర్‌డీ

• ఏడు పరిశోధనా కేంద్రాల ఏర్పాటు

• 3న ప్రధాని చేతులు మీదుగా వీడియో కాన్ఫరెన్సింగ్‌లో ప్రారంభం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: ఉస్మానియా యూనివర్శిటీకి రూసా ప్రాజెక్టు కింద కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ 100 కోట్ల రూపాయిలను కేటాయించింది. పారిశ్రామిక ఔత్సాహికత- వినూత్న ఆవిష్కరణలు- ఉపాధి కేంద్రాన్ని ఉస్మానియా యూనివర్శిటీ ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రాన్ని ప్రధాని నరేంద్రమోదీ న్యూఢిల్లీ నుంచి వీడియోకాన్ఫరెన్సింగ్ ద్వారా ఈ నెల 3వ తేదీ సాయంత్రం మూడు గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లో వర్శిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ రామచంద్రం, ప్రత్యేక ప్రధాద కార్యదర్శి నవీన్ మిట్టల్, రూసా ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ సౌందర్య జోసఫ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్‌రెడ్డి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ టి కృష్ణారావు, నోడల్ అధికారులు ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ హాజరవుతారు. ఓయూ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్, సెంటర్ ఫర్ బయోడైవర్సిటీ అండ్ కన్జర్వేషన్ స్టడీస్, సెంటర్ ఫర్ మైక్రోబియల్ ఫెర్మెంటేషన్ టెక్నాలజీ, సెంటర్ ఫర్ ప్రొటోటైపింగ్ అండ్ టెస్టింగ్ ఇండస్ట్రియల్ ప్రోడక్ట్స్, సెంటర్ ఫర్ సైబర్ సెక్యూరిటీ అండ్ సైబర్ లా, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్, డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ రీసెర్చి సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ చెప్పారు.

నిష్ణాతుల నియామకం

తెలంగాణ అకాడమి ఆఫ్ సైన్సెస్ పది మంది నిష్ణాతులను ఫెల్లో హోదా కల్పించింది. అందులో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వీ రమణారావు, డాక్టర్ దష్కాంత్ రాం, డాక్టర్ వికాస్ కుమార్, డాక్టర్ ఆర్ వెంకట కోటేశ్వరరావు, డాక్టర్ విజయ, డాక్టర్ ఎన్ ఆర్ మునితర్నం , ప్రొఫెసర్ ఎస్వీఎస్ నాగేశ్వరరావు, ప్రొఫెసర్ సీ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రొఫెసర్ రాధ రాపాక ఉన్నారు.

మొదలైన ఇంటర్ ప్రాక్టికల్స్

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నుండి ప్రాక్టికల్స్ ప్రారంభం అయ్యాయని బోర్డు కార్యదర్శి డాక్టర్ ఏ అశోక్ చెప్పారు. రాష్ట్రంలో 386 కేంద్రాల్లో 46,566 మందికి తొలి రోజు ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయని అన్నారు.

సింగరేణి ఎక్స్‌ప్లొరేషన్ విభాగం కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంపు

2019 జనవరి నుంచి అమలు • లేబర్ కమిషనర్‌తో సంఘం ఒప్పందం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: సింగరేణిలో గత కొన్నేళ్లుగా ఎక్స్‌ప్లొరేషన్ విభాగంలో (అన్వేషణ) పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచడానికి సింగరేణి యాజమాన్యం ఒప్పుకుంది. ఈ మేరకు శుక్రవారం కార్మిక శాఖ సమక్షంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నేతలు, అధికారుల మధ్య ఓ అంగీకారం కుదిరింది. ఈ ఒప్పంద కార్యక్రమంలో కార్మిక శాఖ కమిషనర్ పీ. లక్ష్మణ్, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి బీ. మధు పాల్గొన్నారు. ఒప్పందం వల్ల వందలాది మంది కాంట్రాక్ట్ కార్మికులు లాభపడతారు. రోజుకు రూ. 64 చొప్పున నెలకి రూ. 1,664 రూపాయలు వేతనాలు పెరుగుతాయని కార్మిక నేతలు చెప్పారు. వేతనాలు పెంచడం పట్ల కార్మిక నేతలు యాజమాన్యానికి కృతజ్ఞతలు చెప్పారు. చర్చల్లో సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ ఆనందరావు, ఎక్స్‌ప్లొరేషన్ కేకే శర్మ, కార్మికుల తరపున మధు, ఎర్రగాని కృష్ణయ్య, కిషోర్ పాల్గొన్నారు.

నేటి నుంచి హైదరాబాద్‌లో ఐసీత్రీ విద్యా సదస్సు

ఏడు దేశాల నుంచి విద్యాసంస్థల ప్రతినిధుల రాక

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రసిద్ధ యూనివర్శిటీలు ఆఫర్ చేస్తున్న కోర్సులు, ఉపాధి అవకాశాలు, కెరీర్ కౌన్సెలింగ్‌పై ఓక్రిడ్జ్ పాఠశాల శనివారం నుంచి ఐసీత్రీ విద్యా సదస్సును నిర్వహిస్తోందని ఐసీత్రీ వ్యవస్థాపక అధ్యక్షుడు గణేష్ కొహ్లి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వంద మందికి పైగా విద్యావేత్తలు ఈ సదస్సులో పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యారంగానికి సంబంధించి విస్తృతమైన చర్చాగోష్టిలు నిర్వహిస్తారు. వచ్చే మే నెల వరకూ దక్షిణాసియా, ఆగ్నేయాసియా, మధ్య ప్రాచ్య దేశాల్లో, ఆస్ట్రేలియాలోనూ, న్యూజిలాండ్‌లో ఈ తరహా సదస్సులను నిర్వహిస్తారు.

బ్రిటిష్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్టడీ యూకే ఫెయిర్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: విద్యావకాశాలు, సాంస్కృతిక సంబంధాలకు సంబంధించి బ్రిటన్‌కు చెందిన అంతర్జాతీయ సంస్థ బ్రిటిష్ కౌన్సిల్ 4వ తేదీ మధ్యాహ్నం హోటల్ తాజ్ వివంట (బేగంపేట)లో సదస్సు నిర్వహించనుంది. స్కాలర్‌షిప్‌లు, స్టూడెంట్ వీసాలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజిమెంట్, కెమికల్ అండ్ ఫార్మాస్యుటికల్ సైన్సెస్, ఐఈఎల్‌టీఎస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.

ఈ కార్యక్రమంలో క్వీన్ మేరీ యూనివర్శిటీ ఆఫ్ లండన్ నుంచి డాక్టర్ ఎరాన్ పథ్మదాస , కింగ్‌స్టన్ యూనివర్శిటీ నుంచి డాక్టర్ స్టీఫెన్ బార్టన్, బ్రిటిష్ కౌన్సిల్ సిబ్బంది ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేస్తారని బ్రిటిష్ కౌన్సిల్ డివిజన్ హెడ్ కీర్తి తెలిపారు.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
శనివారం, 2 ఫిబ్రవరి 2019

ఇది మధ్యంతర, తాత్కాలిక ఆదాయ వ్యయ ప్రణాళిక- అన్న స్ఫురణ కలుగలేదు! ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి మొదలయ్యే 2019-2020 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి పీయూష్ గోయెల్ శుక్రవారం ఆవిష్కరించిన 'ఆదాయ వ్యయ నివేదిక'- బడ్జెట్- తాత్కాలికమైనదన్న మాటను మరచిపోవలసి వచ్చింది. 'ఇది యథావిధిగా రూపొందిన సాధారణ ఆదాయ వ్యయ పత్రం' అన్న అనుభూతి ఆవహించింది. 'నేల విడిచి సాము చేయకపోవడం', 'నేలపై నిలబడి అంతరిక్షాన్ని 'నొసలు ఉపగ్రహాలను సంధించడం' పీయూష్ గోయెల్ పార్లమెంటుకు సమర్పించిన 'ఆదాయ వ్యయ నివేదిక'లోని ఇతివృత్తం. ఈ ఇతివృత్తం భారతీయ జనతాపార్టీ ప్రభుత్వాల అనుగుణంగా రూపొందడం చారిత్రక పునరావృత్తి. అందువల్లనే 'గోయెల్ తాత్కాలిక ఆర్థికమంత్రి' అన్న స్ఫురణ కూడ కలుగలేదు. ప్రస్తుతం వైద్య చికిత్స పొందుతూ అధికార విధులకు దూరంగా ఉన్న అరుణ్ జైట్లీ స్వయంగా 'బడ్జెట్'ను సమర్పించినట్టు అనుభూతి చెందడం అనివార్య పరిణామమైంది. ప్రవర్తనలో స్వచ్ఛత, విధానంలో స్పష్టత, నిబద్ధతలో సుస్థిరత తమ ప్రభుత్వ స్వభావమన్నది పీయూష్ చెప్పిన మాట! ఈ స్వచ్ఛత స్పష్టత సుస్థిరత మరోసారి స్ఫురింప చేయడానికి జరిగిన సమీక్ష గోయెల్ ప్రసంగం. 'నేల తల్లిని నమ్ముకున్న, నేలను దున్నుతున్న, నేలను పండించే ప్రజలకు విందులు చేస్తున్న కర్షక సోదరుల అభ్యుదయం, సంక్షేమం కొత్త ఆదాయ వ్యయ పత్రం'లో ప్రస్ఫుటించిన మహా విషయాలలో మొదటిది.. జాతీయ కామధేను సంస్థ, 'జాతీయ గో సంతతి- గోకుల- పరిరక్షణ యోజన' వంటివి 'నేల విడవని సాము'కు నిదర్శనం. గోమాత రక్షణ భూమాత రక్షణకు ప్రాతిపదిక. పన్నెండు కోట్ల మంది రైతులకు, పది కోట్ల అసంఘటిత రంగ కార్మికులకు శ్రామికులకు, ఆదాయం పన్ను చెల్లిస్తున్న మూడు కోట్ల మధ్యతరగతి వారికి, లక్షల మంది 'అంగన్‌వాడీ' కార్యకర్తలకు, మహిళలకు, పొగ నుండి సెగలు కక్కే పొయ్యిల నుంచి విముక్తులైన ఎనిమిది కోట్ల కుటుంబాల మాతృమూర్తులకు, ఇంధన వాయు 'ఉజ్వల్'-పొయ్యిలను పొందిన వారికి, విశ్రాంత ఉద్యోగులకు, వయోవృద్ధులకు ఇలా సకల జనులకు సంక్షేమం సమకూర్చడం 'నేల విడవని సాము'. 'కౌసల్ వికాస శిక్షణ'ద్వారా కోటి మంది యువజనులను పారిశ్రామిక వేత్తలుగా రూపొందించడం గురించి గోయెల్ ప్రస్తావించారు. 'మాతృ వందనం'పేరుతో గర్భవతులకు, బాలింతలకు ఇరవై ఆరు వారాల సెలవును మంజూరు చేయడం మాతృభూమి నలుదెసలలో సభ తీరుతున్న సంక్షేమం.. 'వందే భారత్' పేరుతో వేగవంతమైన రైళ్లను నడపాలన్న ప్రతిపాదన మాతృభూమికి మరో వందనం!

ఐదు ఎకరాల- రెండు హెక్టారుల- లోపు భూమి ఉన్న రైతులకు ఏటా ఆరు వేల రూపాయలను అదనపు ఆదాయంగా చెల్లించాలన్న ప్రతిపాదన నేలతల్లిని నమ్ముకున్నవారికి మరికొంత ఊరట. తెలంగాణ ప్రభుత్వం 'రైతుబంధు' పేరుతో రైతన్నలకు ఏటా ఎకరానికి పది వేల రూపాయలను చెల్లిస్తుండడం అభినందనీయం!, కేంద్ర ప్రభుత్వం వారి ఈ 'ఆదాయం పెంపే' పథకం వల్ల దేశమంతటా ఉన్న రైతులకు లాభం కలుగుతుంది. పన్నెండు కోట్ల మంది సన్నకారు రైతులకు సంక్షేమం. భూరక్షణకు గోరక్షణకు దోహదకరం. నేలమీద నిలబడడం అంటే నేలను రక్షించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం! ప్రధానమంత్రిగా లోక్‌సభలో అడుగుపెట్టిన తొలిరోజున, పార్లమెంట్ గడప వద్ద నరేంద్ర మోదీ వంగి భూమికి నమస్కరించడం మాతృ మమకారానికి చిహ్నం. మమకారం పరిరక్షణకు ప్రాతిపదిక! కాలుష్యం నుండి ప్రకృతికి

'పీయూష' మధురిమ..

రక్షణ, జీవజాలానికి 'ఊపిరి'. అంతర్జాతీయ సౌరశక్తి సంఘటన- సోలార్ అలియన్స్- మన దేశం ఆధ్వర్యంలో ఏర్పడడం భూమిని పంచభూతమయమైన ప్రకృతిని పరిరక్షించడంలో భాగం. ఈ స్వచ్ఛభారత పునర్ నిర్మాణం 'సౌరశక్తి'తో ముడిపడి ఉండడం ప్రాకృతిక వాస్తవం! గత నాలుగేళ్లలో సౌరశక్తి ఉత్పత్తి పదిరెట్లు పెరగడం పర్యావరణకు పరిపుష్టిని కలిగించిన పరిణామం. బొగ్గు, ఇంధనవాయు, ఇంధన తైల వినిమయం తగ్గినకొద్దీ 'సౌరశక్తి' 'వాయుశక్తి'- విండ్ పవర్- ఉపయోగం పెరిగినకొద్దీ పర్యావరణ ఆరోగ్యం పెరుగుతుంది. ''సూర్య ఆత్మా జగతః''-జగత్తునకు సూర్యుడు ఆత్మ!- అన్న భారతీయ జీవన విధానం ఈ బడ్జెట్ ద్వారా స్ఫురించడం ప్రత్యామ్నాయ విధానం. ఈ ప్రత్యామ్నాయం నిజానికి మౌలికమైనది. మరుగున పడిన ఈ స్వభావం- నేలపై నిలబడి నింగిని చుంబించడం, సూర్యుడిని ప్రకృతిని గుర్తించడం- 'గగన యాన్' ద్వారా మరోసారి ప్రస్ఫుటిస్తోంది! మానవుడు ప్రకృతి కంటె సృష్టి కంటె భిన్నం కాదన్న స్ఫురణ సజీవంగా ఉండడానికి మోదీ చెప్పినట్టు ఈ 'సర్వవ్యాప్త, సర్వ స్పృహణీయ, సర్వభాగస్వామ్య, సర్వోత్కృష్ట' ప్రత్యామ్నాయం వికసించడం అనివార్యం! ప్రగతిలో నిహితమై ఉన్న సుగతి. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజా ఉద్యమాలుగా మార్చడం హర్షణీయం. గోయెల్ చెప్పిన ఈ మాట అతిశయోక్తి కావచ్చు.. ఆకాంక్షించడం ప్రత్యామ్నాయ స్వభావానికి నిదర్శనం!


పన్నులను తగ్గించడం వల్ల పన్నుల వసూళ్లు, పన్నులను చెల్లించేవారి సంఖ్య పెరుగుతోంది. 2018-2019వ ఆర్థిక సంవత్సరంలో 2017-2018లో కంటె పన్నుల వసూళ్లు గణనీయంగా పెరగడం 'వస్తుసేవల పన్ను'ల- జిఎస్‌టీ- వ్యవస్థ ఫలితమన్నది గోయెల్ చెప్పిన మాట! 'జిఎస్‌టి' పన్నులు తగ్గడం, తద్వారా వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండడం గోయెల్ చేసిన 'సమీక్ష'లో ప్రధాన అంశం. ఐదు లక్షల రూపాయల వరకూ వార్షిక ఆదాయం లభించేవారు ఆదాయం పన్ను చెల్లించనవసరం లేదన్న ప్రభుత్వ నిర్ణయం వచ్చే ఏడు మరింత మంది మరింత నిజాయితీగా పన్నులు చెల్లించడానికి దోహదం కానుంది. చిన్న వ్యాపారులకు లభించిన భారీ పన్ను రాయితీలు సైతం నిజాయితీని, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచగలవు! ఫలితంగా రాష్ట్రాల పన్నుల ఆదాయం ప్రతి ఏటా కనీసం పదునాలుగు శాతం పెరిగే వ్యవస్థ శాశ్వతం కానుంది. మరో ఐదేళ్లలో మన స్థూల 'జాతీయ ఆదాయం-జిడిపి- మొత్తం ఐదు కోట్ల కోట్లు యాబయి లక్షల కోట్ల రూపాయల స్థాయికి చేరడానికి ఇది దోహదం చేయగలదు. ఎనిమిదేళ్ల ఈ స్థూల జాతీయ ఆదాయం- గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్- ఏడు కోట్ల రూపాయల స్థాయికి పెరుగుతుందన్న గోయెల్ ఆకాంక్ష భరతజాతి సమష్టి.. శుభకరమైన శుభకరమైన 'పీయూష'ధార.. 'పీయూష'మంటే అమృతం, ఆవపాలు..

'రక్షణ'కు మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా కేటాయిస్తున్నప్పటికీ 'చైనా పాకిస్తాన్'ల ఉమ్మడి దురాక్రమణ పొంచి ఉన్న తరుణంలో ఇది చాలదు. వర్తమాన ఆర్థిక వత్సరంలో ప్రతిపాదిత వ్యయం- గత ఏడాది ఫిబ్రవరి ఒకటవ తేదీన- ఇరవై నాలుగున్నర లక్షల కోట్లు కాగా రక్షణ వ్యయం రెండు లక్షల తొంబయి ఐదు వేల కోట్లు, అంటే దాదాపు మూడు లక్షల కోట్ల రూపాయలు. ఏప్రిల్ ఒకటి నుంచి ఆరంభం కానున్న కొత్త ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదిత వ్యయం దాదాపు ఇరవై ఏడున్నర లక్షల కోట్లు. అందువల్ల మొత్తం వ్యయానికి అనుగుణంగా రక్షణ వ్యయం పెరగలేదన్నది స్పష్టం. చైనా మనకంటె మూడున్నర రెట్లు- అధికారికంగా- సైనిక వ్యయం జరుపుతోంది. చైనా తన బడ్జెట్‌లో పదహారు శాతం సైనిక వ్యవస్థకు కేటాయిస్తోంది. మనం పదకొండు శాతానికి పరిమితం కావడం వైపరీత్యం! మన రక్షణ వ్యయం గణనీయంగా పెరగాలి! 'ప్రపంచీకరణ' దుష్ప్రభావం నుంచి విముక్తం కావడానికి ప్రభుత్వం ఇప్పటికీ పూనుకోలేదు. విదేశీయుల పెట్టుబడుల వ్యామోహం, ప్రభుత్వరంగం ఆస్తుల విక్రయం మన ప్రగతి ప్రస్థాన గీతంలో ధ్వనిస్తున్న వికృతమైన అపశ్రుతులు.. సేంద్రియ వ్యవసాయ విస్తరణకు దోహదకరమైన పథకాలు ఏవీ?

నిరుద్యోగ నిర్మూలన పగటి కలేనా?

మన దేశంలో అతి ప్రధానమైన సమస్యల్లో నిరుద్యోగం ఒకటి. ఇటీవల జరిగిన నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం 2017-18లో దేశంలో 6.1 శాతంగా నిరుద్యోగం వున్నదని, గత 45 ఏళ్లలో ఇది ఈ స్థాయికి చేరడం మొదటిసారి అని తేటతెల్లమైంది. 2011-12లో 2.2 శాతం ఉన్న నిరుద్యోగిత 2017-18నాటికి 6.1 శాతానికి చేరుకున్నదంటే కారణం పాలక పక్షాల నిర్లక్ష్యమే అనడంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. గ్రామీణ ప్రాంతాల్లో 17.4 శాతం నిరుద్యోగిత ఉంటే, పట్టణాలలో అది 18.7 శాతంగా నమోదయ్యింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో నిరుద్యోగిత అధికమవుతూందంటే- ఇందుకు కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర ఉపాధి కల్పనకు పాటుపడకుండా, అరకొర ఉద్యోగాలు కల్పించడమే. ప్రస్తుత దుస్థితికి నేతల వైఖరి, ప్రభుత్వ విధానాలే హేతువులు.

దేశం ముందుకు సాగాలంటే అన్ని రంగాలలో అభివృద్ధి జరగాలి. ఉత్పాదకశక్తిని సరైన రీతిలో ఉపయోగించుకోలేకపోతే అభివృద్ధికి ఆటంకం ఏర్పడక తప్పదు. దేశ జనాభాలో సగానికి పైగా యువతీ యువకులు వున్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది నిరుద్యోగ సమస్యతో బాధపడుతూనే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. మరికొందరు తాత్కాలికంగా ప్రైవేటు రంగాలలో చిన్న చిన్న కొలువులు చేస్తున్నారు. ధనిక రాష్ట్రమని తెరాస నేతలు చెప్పుకొనే తెలంగాణలో సైతం నిరుద్యోగ సమస్య విలయ తాండవం చేస్తోంది. తెలంగాణ ఉద్యమం విజయవంతం కావడానికి, రాష్ట్ర ఆవిర్భావానికి యువత త్యాగాలే కారణం. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో ముందుండి, ఉద్యమం ఆకాంక్షను నెరవేస్తున్న సమయంలో ఆ పార్టీ నేతలు 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదంతో ముందుకు సాగడం వల్లే ప్రత్యేక రాష్ట్రం అవతరించింది. రాష్ట్రం



ఏర్పడి అయిదేళ్లు కావస్తున్నా నిరుద్యోగ నిర్మూలన దిశగా సరైన ప్రణాళికలను అమలు చేయలేని పరిస్థితి నెలకొన్నది.

గత దశాబ్దకాలంలో తెలంగాణ రాష్ట్రంలో చెప్పుకోదగ్గ స్థాయిలో నియామకాలు జరగకపోవడం ఒక్కేత్తయితే, నూతన రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కూడా అరకొరగా ఉద్యోగ నియామక ప్రకటనలు ఇచ్చారు. అవి కూడా ఏవో లోపాలున్నాయనే సాకుతో కోర్టు పరిధిలో మూలుగుతూ వున్నాయి. ఒకప్పుడు ఉద్యోగాల భర్తీకి ఎలాంటి నోటిఫికేషన్లు వచ్చినా- ఎలాంటి సాంకేతిక లోపాలు జరగలేదు. న్యాయస్థానం వద్దకు పోవడం అరుదుగా ఉండేది. కానీ నేడు ఎలాంటి నోటిఫికేషన్ వచ్చినా న్యాయపరమైన వివాదాలు ఎదురవుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. ప్రతి సంవత్సరం డిగ్రీ, పీజీ, ఇతర ఉన్నత చదువులు పూర్తిచేస్తూ ఎంతోమంది విద్యార్థులు బయటికి వస్తూనే వుంటారు. ఒకప్పుడు కనీసం 10 శాతం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా ఉంటే, ఇటీవలి 5 సంవత్సరాల కాలంలో ఎంతోమంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హతలు కలిగినా సరే నిరుద్యోగుల జాబితాలో చేరిపోతున్నారు.

ముఖ్యంగా గ్రామీణ యువత అప్పులు చేసి పట్టణాలకు వలసపోయి శిక్షణ తీసుకుంటూ గత 5 సంవత్సరాలుగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తూ, అరకొరగా వచ్చిన ఖాళీలకు వేలాదిమంది విద్యార్థులు పోటీపడుతున్నారు. ఈ పరిస్థితి నిరుద్యోగిత తీవ్రతను తెలియజేస్తోంది. లక్షల సంఖ్యలో ఉన్న నిరుద్యోగులందరికీ ఉద్యోగావకాశాలు కల్పించడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదు. కానీ, ఆస్తులు అమ్ముకొని, అప్పులు చేసి చదువులు పూర్తిచేసిన నిరుద్యోగులను ఏ విధంగానైనా ప్రభుత్వం ఆదుకోవాలి. వీరికి ప్రభుత్వ ఉద్యోగం రాకపోతే ప్రైవేటు రంగంలోనైనా ఉద్యోగ భద్రత కల్పించాలి. బ్యాంకుల ద్వారా రుణాలు అందజేసి వ్యాపార రంగంలో శిక్షణ ఇప్పించాలి. ఇలా చేస్తే కొంతమందికైనా ఉపాధి దక్కుతుంది.

పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ, కూరగాయల పెంపకం, కుటీర పరిశ్రమలు, చిన్న చిన్న కాంట్రాక్టు పనులు, చిన్న తరహా పరిశ్రమలకు అవకాశాలిస్తూ కొంతమేరకు నిరుద్యోగ సమస్యను తగ్గించాలి. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. చదువుకొన్న వారందరూ మంచి భవిష్యత్ కోసం వివిధ పోటీపరీక్షలకు సన్నద్ధమవుతూ కూర్చున్నారు. వీరందరికీ ఎలాగూ ఉద్యోగ అవకాశాలు కల్పించలేని ప్రభుత్వాలు, యువతను ఖాళీగా ఉంచకుండా ఏదో ఒక పనిలో నిమగ్నం అయ్యే విధంగా కృషిచేయాలి. జనాభాలో 50 శాతానికి మించి ఉన్న యువతకు పని కల్పించినప్పుడే దేశం ప్రగతి సాధిస్తుంది. వీరి భవిష్యత్‌ను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సమాజం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. యువతకు ఇప్పుడు కావాల్సింది వయోపరిమితి పెంచడం కాదు. ఏదో ఒక రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించి, దేశ ప్రగతికి దారితీసే విధంగా కృషిచేయాల్సిన అవసరం ఉన్నది. మేధావులు, విద్యావేత్తలు, సాంకేతిక నిపుణులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, నిరుద్యోగ సమస్యకు పరిష్కార మార్గం చూపి, దేశ భవిష్యత్‌ను కాపాడాల్సి ఉంది. పాలక వర్గాలు, రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో ఈ విషయానికి తగిన హామీ ఇవ్వాలి. ఓట్ల కోసం రాజకీయం చేసి, సమస్యను పరిష్కరించకపోతే నేతలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ఆత్మాభిమానం అడ్డువచ్చి చిన్న చిన్న పనులు చేయలేక, ఎంత వయసు వచ్చినా తల్లిదండ్రులకు భారమవుతూ, ఎవరిని నిందించాలో ఏమి చేయాలో తోచక- ఎంతోమంది నిరుద్యోగులు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. నిరుద్యోగానికి సంబంధించి గణాంకాలలో ఎలాంటి మార్పులు లేకుంటే అది పాలక వర్గాల వైఫల్యంగానే ప్రజలు భావించాలి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్య పరిష్కారానికి సమగ్ర విధానాలను అమలు చేయాలి.

-డా. పోలం సైదులు 94419 30361


పోరాట యోధుడు ఫెర్నాండెజ్

ఎక్కడో మంగళూరులో కాథలిక్ క్రైస్తవ కుటుంబంలో పుట్టి, క్రైస్తవ ఫాదర్ కావాలని ఆయన భావించాడు. నెహ్రూ నుండి ఇందిరా గాంధీ వరకూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి నిధులను సేకరించే నేతగా, ముంబైలో తిరుగులేని నాయకుడిగా పేరొందిన ఎస్కే పాటిల్‌ను 1967 ఎన్నికల్లో ఓడించి జాతీయ స్థాయిలో ఆయన సంచలనం సృష్టించాడు. అతనే విలక్షణమైన రాజకీయ నేత- జార్జి ఫెర్నాండెజ్. ఒక ఆటో డ్రైవర్‌ను, రైల్వే కార్మికుడిని ఎంతగా ఆదరిస్తారో ఒక ప్రధాన మంత్రితో అదే విధంగా ఉండటం, రక్షణ మంత్రిగా ఉంటూ ఇంటివద్ద ఎటువంటి రక్షణ అవసరం లేదనడం ఆయనకే చెల్లింది. తన ఇంటికి ఎవరైనా ఎటువంటి అడ్డు లేకుండా రాగలగడం, పార్లమెంట్‌కు నడుచుకొంటూ వెళ్లడం, ఇస్త్రీ కూడా చేయని దుస్తులతో అతి సాధారణంగా కేంద్ర మంత్రిగా తిరగడం... ఇటువంటి మరో నాయకుడిని భారత దేశంలో మనం మరలా చూస్తామని ఊహించలేం.

నిత్యం దేశం కోసం, ప్రజల కోసం, అన్యాయాలకు గురుతున్న వర్గాల కోసం ఆరాటపడే ఇటువంటి నేత మరొకరు మళ్లీ మనకు తారసపడే అవకాశం లేదు. ఒక విధంగా చెప్పాలంటే ఫెర్నాండెజ్ మృతితో భారత దేశం చిట్ట చివరి జాతీయ నాయకుడిని కోల్పోయింది. ఓట్ల కోసం, పదవుల కోసం రకరకాల నాటకాలు ఆడే నాయకులను మనం నేడు చూస్తున్నాం. దాదాపు అన్ని రాజకీయ పార్టీలకు వారే నేతృత్వం వహిస్తున్నారు.

జార్జి అంటేనే ఒక అగ్ని పర్వతం. రాజకీయ ప్రత్యర్థులపై ఆయన ఎక్కుపెట్టే మాటల తూటాలు, ప్రదర్శించే రాజీలేని వైఖరి, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వర్గాలకు అందించే ఆపన్న హస్తం, వారి పక్షాన ఎటువంటి సంకోచం లేకుండా నిలబడ గలగడం, కల్మషం లేని ధోరణి, ఎటువంటి అహంకారం ప్రదర్శించని మానవీయత వంటి లక్షణాలు మనం మరో నేతలో చూడలేం. సిద్ధాంతపరంగానే కాకుండా నిజమైన సామ్యవాదిగా ఫెర్నాండెజ్ జీవించారు. లక్షలాదిమంది యువకులకు మన దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా స్ఫూర్తి కేంద్రంగా నిలిచారు. వారి జీవితాలలో ఉన్నతమైన ఆదర్శ జ్యోతులను వెలిగించారు. వారి పక్షాన నిలబడ్డారు. తన సొంత మనుషులైనా సరే అవకాశవాదం ప్రదర్శిస్తున్నారని మరెవరైనా చెబితే వెంటనే ఆవేశంతో ఆయన స్పందించే వారు. తన వారిని కట్టడి చేసేందుకు ప్రయత్నం చేసేవారు. అవిశ్రాంత పోరాట యోధుడు. కేంద్రంలో రక్షణ, రైల్వేలు, పరిశ్రమలు వంటి కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహించినా ఆయనలో అధికారం ఎన్నడూ అహంకారాన్ని నింపలేదు. ఉన్నత పదవులలో సైతం సాధారణ ప్రజల గురించే తపన చెందేవారు. దేశంలో కార్మిక ఉద్యమం అంటే వామపక్షాలదే గుత్తాధిపత్యం అనుకొంటున్న సమయంలో ముంబయిలో వారి కంచుకోటలను బద్దలు చేసి సోషలిస్ట్ కార్మిక సంఘాలను మేటిగా బలోపేతం చేశారు. ఆ ప్రభావం ఇంకా ముంబై ప్రాంతంలో కొనసాగుతున్నది.

1930 జూన్ 3న మంగళూరులో క్యాథలిక్ కుటుంబంలో పుట్టిన ఫెర్నాండెజ్ చదువును మధ్యలోనే ఆపేసి, 16 ఏళ్ళ వయస్సులో ప్రీస్ట్‌గా శిక్షణ పొందారు. 1949లో ముంబాయికి చేరుకొని సోషలిస్ట్ కార్మిక సంఘాలలో క్రియాశీలకంగా పనిచేస్తూ వచ్చారు. ఆవేశంగా ప్రసంగాలు చేయడంలో పేరొందిన ఆయన నాయకత్వంలో కార్మికులు అనేక సమ్మెలు, పోరాటాలు జరిపారు. 1950వ, 1960వ దశకాలలో భారతీయ రైల్వేలో పనిచేస్తూ ఎన్నో బంద్‌లు, సమ్మెలు జరిపారు. అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడిగా 1974లో ఆయన జరిపిన రైల్వే సమ్మె చారిత్రాత్మకమైనది. ఈ సమ్మెను పాశవికంగా నాటి ప్రధాని ఇందిరా గాంధీ అణచి వేశారు. సుమారు 30 వేలమంది కార్మికులను అరెస్ట్ చేశారు. కార్మికుల ఉద్యమం పట్ల బ్రిటిష్ కాలంలో సహితం ఇంత దారుణంగా పాలకులు వ్యవహరించ లేదు. 1975లో అత్యవసర పరిస్థితి విధిం చడానికి ఈ సమ్మెను ఒక కారణంగా ఇందిరాగాంధీ చూపారు.



అత్యవసర పరిస్థితి సమయంలో జార్జ్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు అసాధారణమైనవి. ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్త పోరాటానికి సన్నాహాలు జరిపారు. అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా అంత ర్జాతీయంగా మద్దతు కూడదీయడంలో కూడా కీలకంగా వ్యవహరించారు. ఆయనను అరెస్ట్ చేయడం కోసం నాటి ప్రభుత్వం ఆయన సన్నిహితులు, బంధువుల పట్ల దారుణంగా వ్యవహరించింది. అరెస్ట్ చేసి జైలులో చిత్ర హింసలకు గురి చేయడంతో నటి స్నేహలత రెడ్డి మృతి చెందింది. ఆయన సోదరుడిని కూడా బెంగుళూరులో తీవ్రమైన చిత్ర హింసలకు గురిచేశారు. 1976లో ఫెర్నాండెజ్‌ను అరెస్ట్ చేసి,బరోడా డైనమైట్ కేసు పెట్టి విచారణ జరిపారు. ఆయన సన్నిహితులను కూడా ఈ కుట్ర కేసులో నిందితులుగా చేర్చారు. 1977లో అత్యవసర పరిస్థితిని తొలగించిన అనంతరం జరిగిన ఎన్నికలలో బిహార్ లోని ముజఫర్‌పూర్ నుండి- జైలులో ఉంటూనే 5 లక్షల ఓట్ల ఆధిక్యతతో గెలుపొంది ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయ శక్తులు ముఖ్యంగా సోషలిస్టులు, భాజపా వారు కలసి పనిచేసేందుకు ఆయన ఎంతో శ్రమించారు. దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పాటులో క్రియాశీల పాత్ర వహించారు. మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో పరిశ్రమల మంత్రిగా ఉంటూ ప్రముఖ బహుళజాతి కంపెనీలు అయిన ఐబీఎం, కోకాకోలా కంపెనీలను నిబంధనలు అతిక్రమిస్తున్నాయని అంటూ దేశం వదిలి వెళ్లిపొమ్మని ఆదేశించారు. తాను స్వదేశీ అని గర్వంగా చెప్పుకున్న మొదటి కేంద్ర మంత్రి కావడమే కాకుండా, ఆ దిశలో పలు చర్యలు తీసుకున్నారు. ఆనాడు ఐబీఎం ను దేశం నుండి పంపి వేయడం వల్లనే- తర్వాతి కాలంలో మనం ఐటిలో స్వదేశీ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోగలిగాం. అణు, అంతరిక్ష రంగాలలో స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోవడానికి దోహదపడింది. వీపీ సింగ్ మంత్రివర్గంలో రైల్వే మంత్రిగా ఉంటూ స్థానికులకు ఉపాధి కల్పించడం కోసం రైల్వే స్టేషన్‌లలో టీని కుండ కప్పులలో విక్రయించేటట్లు చేశారు. ముంబయి-మంగళూరులను కలుపుతూ కొంకణ్ రైల్వే మార్గం ఏర్పాటు చేయడానికి ప్రధాన సూత్రధారిగా నిలిచారు. జనతాదళ్ నుండి వైదొలిగి సమతా పార్టీ స్థాపించి, భాజపా నేతృత్వంలోని ఎన్డీయేలో చేరారు. వాజపేయి మంత్రివర్గంలో రక్షణ మంత్రిగా ఉంటూ కార్గిల్ యుద్ధం, పోఖ్రాన్ వద్ద అణు ప్రయోగం వంటి వ్యవహారాలలో కీలక పాత్ర వహించారు. దేశ సరిహద్దులలో సైనిక శిబిరాలకు వెళ్లి, వారి పరిస్థితులను మెరుగు పరచేందుకు ప్రయత్నం చేసిన మొదటి రక్షణ మంత్రిగా కూడా పేరొందారు.

అయితే, ఫెర్నాండెజ్ పలు వివాదాల్లోనూ ఉన్నారు. ఇతర సోషలిస్ట్ నాయకుల వలే మేధోపర చర్చలకు పరిమితం కాకుండా, నిత్యం సాధారణ ప్రజలతో మెలిగేవారు. వారి పరిస్థితులను మెరుగు పరచేందుకు తన వంతు కృషి చేసేవారు. పలు శిక్షణ సంస్థలు, పత్రికలు నెలకొల్పారు. వాజపేయి మంత్రివర్గంలో ఉండగా బరాక్ మిస్సైల్ వివాదం, శవపేటికల కొనుగోలు వివాదం, తెహెల్కా వ్యవహారం ఆయనపై ఆరోపణలు వచ్చాయి. అప్పుడు వాజపేయి ఆయనకు అండగా నిలబడ్డారు.

వాజపేయి ప్రభుత్వానికి రాజకీయంగా ఎటువంటి సమస్యలు తలెత్తినా, సంక్షోభాలు ఎదురైనా వాటి పరిష్కారం కోసం ఫెర్నాండెజ్ ముందుండేవారు. నాడు బీజేపీలో ఎల్‌కె అద్వానీ వంటి వారు వాజపేయి బలహీనుడైతే ప్రధాన పదవి అలంకరించాలని కాచుకొని ఉండేవారు. 1979లో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వమైన- మొరార్జీ దేశం సర్కారు పడిపోవడానికి తాను కారకుడయ్యానన్న ఆవేదన ఫెర్నాండెజ్‌ను జీవితాంతం వెంటాడింది. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానంపై చర్చ జరుగుతున్న సమయంలో దానిని వ్యతిరేకిస్తూ గంటకు పైగా ఆవేశంగా ప్రసంగించిన ఆయన ఆ మరుసటి రోజుకల్లా ప్రభుత్వం నుండి వైదొలిగారు. దాంతో చాలామంది ఆయనను తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని కూల్చిన విద్రోహిగా నిందించారు. 1980లో ఇందిరా గాంధీ తిరిగి అధికారంలోకి రాగలగడానికి తానే కారణం అని అయన సన్నిహితుల వద్ద ఎంతగానో కుమిలిపోయారు. చిరకాలంగా సోషలిస్ట్ ఉద్యమంలో కలసి ఉంటున్న మధు లిమాయే, రాజనారాయణ్, మధు దండావతే, సురేంద్రమోహన్ వంటి సోషలిస్ట్ నేతలంతా కలసి తమతో జనతా పార్టీ నుండి వచ్చి చరణ్‌సింగ్ కు మద్దతు తెలుపమని వత్తిడి తేవడంతో అన్యమనస్కంగానే సోషలిస్ట్ సహచరుల కోసం వచ్చారు. దశాబ్దాలుగా రాజకీయంగా సహజీవనం జరుపుతున్న సోషలిస్ట్ లను కాదనలేక పోయారు. ఆయనలోని ఆ సంశయమే తర్వాత భారత దేశ చరిత్రను మార్చివేసింది.

అటువంటి పొరపాటు మరోసారి జరగకుండా ఉండేందుకు వాజపేయి ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రికి అన్ని విపత్కర పరిస్థితులలో మద్దతుదారుడిగా జార్జి ఉన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా, సహచరులు ఎంతమంది వత్తిడి చేసినా తన కారణంగా మరో కాంగ్రెసేతర ప్రభుత్వం పడిపోరాదని పట్టుదలతో నిలబడ్డారు. ఆయనలోని ఆ పట్టుదల నాటి వాజపేయి ప్రభుత్వానికి పెట్టని కోటగా ఉన్నా, అనేకమంది మాత్రం పదవని వదులుకొని ఫెర్నాండెజ్ రాలేక పోతున్నారని అపోహలకు గురయ్యారు.

పొరుగు దేశాలలో కూడా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం జరిగే పోరాటాలకు మద్దతు ప్రకటించి, అండగా ఉంటూ ఉండేవారు. శ్రీలంకలో తమిళులు, టిబెట్‌లో బౌద్ధులు, మయన్మార్‌లో సైనిక పాలకులకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమాలకి మద్దతు ఇచ్చారు. చివరకు ఇరాన్ లో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న యువకులకు ఢిల్లీలో ఆయనే రక్షణ కల్పించేవారు. సంఘీభావం తెలుపుతూ ఉండేవారు. చిన్నప్పటి నుండే పీడనకు వ్యతిరేకంగా గళం విప్పుతూ వచ్చారు. జార్జిని న్యాయవాదిగా చేయాలని తండ్రి అనుకొన్నారు. అయితే మెట్రిక్ తోనే చదువును ఆపివేసి ప్రీస్ట్ గా శిక్షణ కోసం వెళ్లారు. అందుకు కారణం ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. నన్ను న్యాయవాదిగా చేసి తన కేసులను వాదించాలని మా నాన్న అనుకున్నారు. అయితే, ఆయన బాకీల వసూలు కోసం భూముల నుండి రైతులను బలవంతంగా తొలగించడం చూస్తూ ఉండేవాడిని. అటువంటి దౌర్జన్యాలకు మద్దతుగా ఉండ దలచుకోలేదు.. అని చెప్పారు. రెండున్నరేళ్ల పాటు బెంగళూరులోని సెయింట్ పీటర్స్ సెమినారి లో రోమన్ కాథలిక్ ప్రీస్ట్ గా శిక్షణ పొందినా అక్కడ కూడా బోధనలకు, ఆచరణలు సంబంధం లేదని తెలుసుకొని విరక్తి చెందారు. రెక్టార్లు ఎత్తుగా ఉండే టేబుల్ పై కూర్చొని మిగిలిన వారికన్నా మెరుగైన భోజనం చేస్తూ ఉంటే సహించలేక పోయేవారు. 19 ఏళ్ల వయసు నుండి ముంబైలో రోడ్డు రవాణా, హోటళ్లు, రెస్టారెంట్‌లలో కార్మికులను సంఘటిత పరచి, కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడం, వారి హక్కుల కోసం పోరాడటం ప్రారంభించారు.

ప్రజాజీవనంలో నిజాయితీకి మారుపేరుగా ఉండేవారు. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెబుతూ ఉండేవారు. సహచరులైనా, అనుచరులైనా మోసం చేయడానికి ప్రయత్నిస్తే సహించేవారు కాదు. జార్జి నిష్కళంకమైన దేశ భక్తుడు. ప్రజల పక్షాన ఉండి పోరాటం చేయడంతోనే జీవితంలో ఎక్కువ కాలం గడిపారు.

-చలసాని నరేంద్ర

ఉత్తరాయణం

ఆర్థిక సంక్షోభం తప్పదు!

దేశ సత్వర అభివృద్ధికి పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ వుండడం ఎంతో అవసరం. ప్రభుత్వం తీసుకునే ఆర్థికపరమైన నిర్ణయాలు ప్రజలందరికీ లబ్ధికలిగించే విధంగా వుండాల్సిన ఆవశ్యకతను ఆర్థిక నిపుణులు, మేధావులు పదేపదే చెబుతూవచ్చారు. ఆర్థికపరమైన విధానాలు లోపభూయిష్టంగావున్నా లేక తొందరపాటు నిర్ణయాలు ప్రభుత్వాలు తీసుకున్నా మొత్తం దేశ ఆర్థికవ్యవస్థ ప్రమాదంలో పడే అవకాశం వుంది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 2016, నవంబర్ 8న తీసుకున్న పెద్దనోట్ల రద్దు నిర్ణయం, ఆ తరువాత హడావుడిగా అమలుచేసిన వస్తుసేవల పన్ను (జీఎస్టీ) దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయడమేకాక, సామాన్య మధ్యతరగతి ప్రజల బతుకులను ఛిద్రం చేశాయి. లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు తగ్గిపోగా, వేలాది సూక్ష్మ, మధ్యతరగతి పరిశ్రమలు ఆర్థిక సంక్షోభం కారణంగా మూతబడ్డాయి. కేంద్ర ప్రభుత్వం అధిక వస్తుసేవ పన్నులను తగ్గించే ప్రయత్నంలో దాదాపు పద్దెనిమిది నెలల కాలం పాటు మధ్యతరగతి ప్రజలు ఎన్నో బాధలను ఎదుర్కోవలసి వచ్చిందనేది జగమెరిగిన సత్యం. ఈ ఆర్థిక సంవత్సరం నుండి రెవెన్యూలోటు లక్ష్యాలను తొలగించాలని మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ విధంగా నిర్ణయం తీసుకున్నందుకు కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, రెవెన్యూ లోటు లక్ష్యాల భర్తీతో నిమిత్తంలేకుండా లక్ష కోట్ల రూపాయల తాయిలాలతో కూడిన పథకాలను కూడా మోదీ ప్రభుత్వం ప్రకటించింది. రైతుల ఖాతాల్లోకి నిధులు, వడ్డీలేని రుణాలుసహా రకరకాల పథకాలకు లక్ష కోట్లు ఖర్చుచేస్తారు. రెవెన్యూలోటు లక్ష్యాలను నిర్మూలించడం వల్ల దేశంలో ద్రవ్యలోటు జీడీపీలో 3.4 శాతానికి పెరగవచ్చని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ తెలియజేసింది. ఎన్నికలను దృష్టిలోపెట్టుకొని చేపట్టే పథకాల అమలుకు- భవిష్యత్‌లో ప్రజల నుండి ముక్కుపిండి పన్నులు వసూలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోక తప్పదు. వచ్చే రెండు నెలల్లో మూడు లక్షల కోట్ల ప్రజాసంక్షేమ పథకాలను ప్రవేశపెడతామని కేంద్ర ప్రభుత్వం ఘనంగా ప్రకటించడంపై ఆర్థిక నిపుణులు అభ్యంతరాలు వ్యక్తం చేసారు. ప్రభుత్వ నిర్ణయం స్థూల ఆర్థిక స్థిరత్వానికి, ద్రవ్య పరిస్థితికి దోహదం చేయదని, సబ్సిడీ పథకాలకు అధిక వడ్డీలకు ఓపెన్ మార్కెట్ నుండి ఋణాలు తీసుకోవడం అంతే ఆర్థిక దుబారాయేనని కాగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. భవిష్యత్ రుణసేవల అవసరాలను తీర్చడానికి తగిన ఆదాయాన్ని సృష్టించలేని రంగాలలో అప్పుచేసిన నిధులను గుమ్మరించడంవల్ల తీవ్ర ప్రమాదం ఏర్పడగలదని కాగ్ అభిప్రాయపడింది. లక్షల కోట్ల రూపాయలను ఓట్లకోసం తాయిలాల రూపంలో గుమ్మరించడం అపసవ్య విధానం. అది కూడా రెండుమూడు నెలల్లో ఖర్చుచేయడమంటే నాణ్యతకు, పటిష్టమైన పర్యవేక్షణకు తిలోదకాలిచ్చి అవినీతికి పెద్దపీట వేయడమేనని కాగ్ అభిప్రాయపడింది. ఉచిత పథకాలు ఇంత పెద్దఎత్తున అమలుచేయడంకంటే ప్రజలకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించి వారికి ఆర్జించే అవకాశాలను మెరుగుపరచడమే మంచిదన్న కాగ్ సూచనలను విస్మరించలేం.

- సిహెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

'ఓట్' ఆన్ అకౌంట్ బడ్జెట్!

ప్రధాని మోదీ 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' మంచివని చెప్తారు. భాజపా అధ్యక్షుడు అమిత్ షా మాత్రం 'స్థిరమైన పార్టీని ఎన్నుకోండి, సంకీర్ణ ప్రభుత్వాలు వద్దు, రోజుకో ప్రధాని వుంటే కష్టం' అంటారు. కానీ ఆలోచిస్తే ఏటేటా ఎన్నికలొస్తేనే మంచిదేమోనని అనిపిస్తుంది ఈసారి బడ్జెట్ చూశాక. విధానాలూ, ప్రణాళికలూ, నిధులూ అంటూ పూర్తిస్థాయి బడ్జెట్ కన్నా, ఎన్నికల ముందొచ్చే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కే మెరుపులెక్కువ. అంతోఇంతో ప్రజలు ఊరట పొందే ఊసులు, ఊరింపులు ఎక్కువ. ఎన్డీయే హయాంలోని నాలుగేళ్ల పూర్తి బడ్జెట్లు ఇచ్చిన అభయం కన్నా, నాలుగు నెలల ఖర్చులనుద్దేశిస్తూ వచ్చిన తాత్కాలిక బడ్జెట్ ఎక్కువ ఆశలు రేపుతోంది. ముఖ్యంగా వేతన జీవులు 2014 నుండి ఎదురుచూస్తూ వచ్చిన పన్ను మినహాయింపులు ఈసారి రెట్టింపుచేశారు. పన్ను మినహాయింపు పరిమితిని ఐదు లక్షల రూపాయలకు పెంచడం మంచి నిర్ణయం. పెరుగుతున్న జీవన వ్యయం నేపథ్యంలో ఇది అవసరం. అసంఘటిత కార్మికులకు పింఛను సదుపాయం కల్పించడం మరో మంచి నిర్ణయం. మన దేశంలో అసంఘటిత కార్మికులే ఎక్కువ కనుక. ఐదెకరాల లోబడి భూమి కలిగిన చిన్న రైతులకు ఏటేటా ఆరువేల రూపాయల నగదు ప్రత్యక్షంగా చేతికే అందిస్తామన్నది సానుకూల చర్య. దీనిని భూమిలేని వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు కూడా అందించాల్సిన అవసరం ఉంది. అంతకుమించి చేయాల్సినవి కనీస మద్దతుధర పెట్టుబడికన్నా యాభై శాతం ఎక్కువగా నిర్ణయించడం, మార్కెట్ అనుసంధానం, గోదాముల నిర్మాణం ఇంకా ఎన్నో. అయితే ఇది తాత్కాలిక బడ్జెట్ కనుక ప్రభుత్వం ఈ మాత్రమైనా రైతుల గురించి ఆలోచించడమే మహద్భాగ్యం అనుకొందాం. దేశంలో నిరుద్యోగిత గత నలభై ఐదేళ్ల రికార్డుని అధిగమించి ఆరుశాతంగా నమోదైందని అధికారిక గణాంకాలే చెప్తున్నాయి. యువత ఎక్కువగా ఉన్న దేశం నిరుద్యోగ దేశంగా మిగిలితే సామాజిక, ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తుంది. ఉద్యోగ కల్పనలో పరాజయాన్ని అంగీకరించి ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టిసారించాల్సింది. నిర్మాణ రంగానికి చేయూత నివ్వాల్సింది. ఆ దిశగా చర్యలులేవు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీల అమలులో ఐదేళ్ల పిమ్మట కేంద్రం ఏ స్థానంలో వుందో ఈ ఆఖరు బడ్జెట్లోనైనా తెలియజెప్తే బాగుండేది. ఏది ఏమైనా ఎన్నికల హామీల పూర్తి సినిమాకు ముందు ఈ బడ్జెట్ అధికారిక ట్రైలర్ ఆకర్షించింది. అందుకే - అసలు బడ్జెట్‌కి వడ్డింపులెక్కువ- కొసరు బడ్జెట్‌కి ఊరింపులెక్కువ.

- డా. డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

అగ్రవర్ణ పేదలు మనుషులు కాదా?

సమాజంలో మానవులంతా సమానమే. కులాల ప్రకారం మానవుల శరీరాల్లో మార్పులుండవు. ప్రతి మానవునికి తిండి, గుడ్డ కావాలి. కులాల ప్రకారం కనీస అవసరాలు వేరుగా వుండవు. కుల విభజనను రాజకీయ ప్రయోజనాలకు నేతలు వాడుకొంటున్నారు. ఉన్నవి రెండే కులాలు.. అవి పేద, ధనిక అనేవి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తమ రాజకీయ ప్రయోజనాలకై ప్రజలను యస్.సి, యస్.టి, బి.సి, ఒ.సి, మైనారిటీలుగా నేతలు విభజించుకున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల్లో వారు పబ్బం గడుపుకుంటున్నారు. కులాలను, మతాల చేర్చి మన రాజ్యాంగాన్ని భ్రష్టుపట్టించారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇలాంటి లోపాల మయమైన రాజ్యాంగం లేదు. మన దేశంలో చాలా రాష్ట్రాలలో 80 శాతానికి మించి రిజర్వేషన్లు ఉన్నాయి. ఇలా చెల్లుబాటయ్యే రిజర్వేషన్లు అగ్రవర్ణ పేదలకు వచ్చేసరికి చెల్లుబాటు కాకుండాపోతాయా? కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వటం సబబే. అయినప్పటికీ రిజర్వేషన్లు పూర్తిగా రద్దుకావటమే దేశానికి క్షేమకరం. కులం, మతం అనేవి మన రాజ్యాంగంలో ప్రమాదకరమైన పదాలు. ప్రజలు, పాలకులు దేశ క్షేమానికై పోరాడాలి.

-జి.శ్రీనివాసులు, అనంతపురము

ఇ.పి.ఎస్ పెన్షనర్ల మొర వినరా?

2002, 2003 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుండి బలవంతంగా తొలగింపబడిన ఉద్యోగులకు ఇ.పి.ఎస్-95 పెన్షన్‌ను వర్తింపచేశారు. దీంతో వారికి ఈనాటికి ఇంకా ఏ ఎదుగుదల లేని విధంగా వెయ్యి రూపాయల లోపు పెన్షన్ వస్తున్నది. దీనికి కారణం- 1992, 1997లో జరుపవలసిన వేతన సవరణలను నిలిపివేయడం. గత దశాబ్దన్నర కాలంగా ఉద్యోగులు తమ తమ రాష్ట్రాలలో, ఢిల్లీలో ఎన్ని ధర్నాలు, నిరాహారదీక్షలు, అర్ధనగ్న ప్రదర్శనలు చేసినా ఫలితం లేదు. అప్పటి ప్రధానులు వాజపేయి, మన్మోహన్‌సింగ్, ఇప్పటి ప్రధాని మోదీకి వందలసార్లు విన్నపాలు చేసుకున్నా, కోర్టుతీర్పులు ఉద్యోగుల తరపున వచ్చినా కేంద్ర ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం లేదు. వితంతువులకు, వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు ఇబ్బడిముబ్బడిగా పెంచుతున్నారు. వీరిపాటి కూడా చేయలేదా ఇ.పి.ఎస్-95 పెన్షనర్లు?

- డా. ఎన్.ఎస్.ఆర్.మూర్తి, సికిందరాబాద్

మోదీప్యమానంగా నిధులు

మొత్తం కేటాయింపులు రూ.3, 36, 292 కోట్లు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: లోక్‌సభలో రూ. 3,36,292 కోట్ల వ్యయంతో కూడిన 2019-20 సంవత్సరం వార్షిక ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆర్థిక శాఖ తాత్కాలిక మంత్రి పియూష్ గోయల్ శుక్రవారం ప్రతిపాదించారు. రానున్న ఐదు సంవత్సరాల్లో భారత్ ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని ఆయన వెల్లడించారు. రానున్న ఎనిమిది సంవత్సరాల్లో ఇది ఎనిమిది ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారటం ఖాయమని గోయల్ ధీమా వ్యక్తం చేశారు. పన్ను చెల్లింపుదారుల సంఖ్య మూడు కోట్ల నుంచి ఆరున్నర కోట్లకు పెరిగిందని, ఇది శుభ సూచకమని ఆయన చెప్పారు. రక్షణ శాఖ కేటాయింపులు ఈ సంవత్సరం మూడు లక్షల కోట్లు దాటుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు. రక్షణ శాఖకు అవసరమైతే మరిన్ని నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సభాముఖంగా ఆయన ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత పథకాలకు రూ. 3,67,679 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం కేటాయింపులతో పోలిస్తే ఇది 23 వేల కోట్లు అధికం. జాతీయ విద్యా మిషన్ కార్యక్రమానికి రూ. 38, 572 కోట్లు కేటాయించారు. ఐసీడీసీ పథకాలకు రూ. 27,584 కోట్లు కేటాయించారు. షెడ్యూల్డు కులాల, తెగల పథకాల కేటాయింపులను గణనీయంగా పెంచారు. షెడ్యూల్డ్ కులాల వారికి గత సంవత్సరం రూ. 56,619 కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ. 62, 474 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం కేటాయింపులతో పోలిస్తే ఇది 35.6 శాతం అధికం. షెడ్యూల్డు తెగల వారికి గత సంవత్సరం రూ. 39,135 కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం 28 శాతం పెంచి రూ. 50, 086 కోట్లు కేటాయించడం గమనార్హం. 2019-20 సంవత్సరం ద్రవ్య లోటు 3.4 శాతమని ఆయన చెప్పారు. రైతుల నగదు బదిలీ పథకానికి మొత్తం 95 కోట్ల రూపాయలు కేటాయించినందున ద్రవ్య లోటు 3.4 శాతం ఉంది. లేకపోతే ఇది 2018-19 సంవత్సరానికి 3.3 శాతం లేదా అంతకంటే తక్కువ ఉండేది. 2019-20 సంవత్సరానికి 3.1 శాతం కంటే తక్కువ ఉండేదని ఆయన తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

రైల్వే బడ్జెట్ కేటాయింపులు

రైల్వే శాఖ కేటాయింపులను 2019-20 సంవత్సరానికి గాను 64,587 కోట్లుగా నిర్ధారించారు. 'రైల్వేల్లో భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాం. బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్లపై గార్డు రహిత రైల్వే క్రాసింగ్‌లను పూర్తిగా తొలగించాం'అని ఆయన వెల్లడించారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో కూడిన 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'ను త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు.

గ్రామీణ ఉపాధికి బాసట

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) కింద గ్రామీణ ఉపాధికి పెద్దపీట వేసింది. ఈ పథకం కింద 2019-20 సంవత్సరానికి 60 వేల కోట్ల రూపాయలను కేటాయించింది. ఇది గత ఏడాది కేటాయించిన 55 వేల కోట్ల రూపాయలతో పోలిస్తే 11 శాతం ఎక్కువ. 2019-20 ఆర్థిక సంవత్సరానికి ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ కింద 60 వేల కోట్లను కేటాయించామని, దీనిని మరింత పెంచుతామని బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన పీయూష్ గోయల్ స్పష్టం చేశారు.

విద్యారంగానికి మరింత దన్ను

దేశంలోని విద్యారంగానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించారు. 2019-20 సంవత్సరానికి 93,874.64 కోట్లను ఈ రంగానికి ఇవ్వాలని నిర్ణయించారు. ఇది గత ఏడాది బడ్జెట్ కన్నా పది శాతం ఎక్కువ. ఈ మొత్తంలో 37,461 కోట్లు ఉన్నత విద్యకు, 56,386.63 కోట్లు పాఠశాల విద్యకు కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఈ రంగానికి 85,010 కోట్లను కేటాయించగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి పది శాతం అధికంగా కేటాయింపు జరిగింది.

అభివృద్ధి-సంక్షేమానికి ప్రాధాన్యత

ఇది ప్రజాకర్షక బడ్జెట్: మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: రక్షణ రంగానికి శుక్రవారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో పెద్దమొత్తాన్ని కేటాయించారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ రంగానికి 3.05 లక్షల కోట్లను కేటాయిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ఇది గత బడ్జెట్ కన్నా 20 వేల కోట్లు అధికం. సరిహద్దు భద్రత, బలగాల పటిష్టానికి ఈ రంగానికి పెద్దమొత్తంలో నిధుల కేటాయింపు చేశామని, దేశంలో మొదటిసారిగా ఈ రంగానికి కేటాయించిన నిధులు మూడు లక్షల కోట్లు దాటాయని ఆయన చెప్పారు. అవసరమైతే ఈ రంగానికి మరిన్ని నిధులు కేటాయిస్తామని ఆయన తెలిపారు. దేశరక్షణ, జాతి భద్రత గురించి ఆయన ప్రస్తావిస్తూ సైనికులు సరిహద్దుల్లో సంక్లిష్ట పరిస్థితుల్లో సైతం విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. వారి సంక్షేమాన్ని కాంక్షించాల్సిన అవసరం ఉందన్నారు. గత 40 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న వన్ ర్యాంక్ వన్ పెన్షన్ (ఓఆర్‌ఓపీ) అంశాన్ని తాము పరిష్కరించినట్టు ఆయన చెప్పారు. గత ప్రభుత్వాలు 2014-15లో దీని నిమిత్తం 500 కోట్లను కేటాయించిందని, అయితే తమ ప్రభుత్వం 35 వేల కోట్లను ఇప్పటికే దీని నిమిత్తం ఇచ్చి దీని అమలులో తమ చిత్తశుద్ధిని నిరూపించుకున్నామని చెప్పారు. అలాగే మిలటరీ సర్వీస్ పే (ఎంఎస్‌పీ)ని ఎక్కువ చేస్తున్నామని, నేవీ, ఎయిర్‌ఫోర్సు, ఇతర క్లిష్టతరమైన విధులు నిర్వహించే వారికి ప్రత్యేక అలవెన్స్‌లు ఇస్తామని మంత్రి తెలిపారు.

న్యాయ మంత్రిత్వ శాఖకు రూ.666 కోట్లు విడుదల

ఎన్నికల నిర్వహణకు అదనంగా నిధులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: వచ్చే లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు వీలుగా న్యాయ మంత్రిత్వ శాఖకు అదనంగా రూ. 666 కోట్లను ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయించారు. ఎన్నికల సంఘంలో పాలనాపరమైన శాఖ విధులను న్యాయ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. ఇందులో కొన్ని నిధులను హోంశాఖకు కేటాయిస్తారు. రవాణా, భద్రతాసిబ్బంది, ఇతర లాజిస్టిక్స్ ఖర్చుల కింద నిధులు కేటాయిస్తారు. ఓటర్లను చైతన్యపరిచేందుకు రూ.16.67 కోట్లు, రెవెన్యూ కింద రూ. 12.14 కోట్లు కేటాయించారు. ఈ సారి లోక్‌సభ ఎన్నికలతో పాటు ఏపి, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ ఎన్నికలు జరగనున్నాయి. అసెంబ్లీ రద్దయిన నేపథ్యంలో జమ్ముకాశ్మీర్‌లో కూడా ఎన్నికలను నిర్వహిస్తారు. సిక్కిం అసెంబ్లీకి పదవీ కాల పరిమితి మే 27, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల అసెంబ్లీ కాలపరిమితి జూన్ 18వ తేదీలోగా ముగుస్తాయి. 2004లో ఫిబ్రవరి 29వ తేదీన, 2009లో మార్చి 2వ తేదీన, 2014లో మార్చి 5వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన విషయం విదితమే.

అద్దెల ఆదాయంపై పన్ను మినహాయింపు పెంపు


అద్దెల ద్వారా వచ్చే ఆదాయంపై వచ్చే పన్ను మినహాయింపు మొత్తాన్ని ప్రస్తుతం ఉన్న 1.80 లక్షల నుంచి 2.4 లక్షలకు పెంచారు. అలాగే బ్యాంకు, పోస్టు ఆఫీసుల డిపాజిట్లపై ప్రస్తుతం ఇచ్చే మినహాయింపును 10 వేల నుంచి 40 వేలకు పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి ప్రకటించారు. గత రెండేళ్లుగా అమ్ముడు కాకుండా ఉన్న ఇళ్ల అద్దెకు సంబంధించి పన్నును మినహాయిస్తున్నామన్నారు. అలాగే సెక్షన్ 80 (ఐ) బిఎ కింద పొందే లాభాలను 2019-20 వరకు అనుమతి పొందిన హౌసింగ్ ప్రాజెక్టులకు మరో సంవత్సరం పొడిగిస్తున్నామని తెలిపారు. 80 వేల కోట్ల డిజిన్విస్ట్‌మెంట్ లక్ష్యాన్ని ఈ ఏడాది సాధిస్తామన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. 2030 లక్ష్యంగా గ్రామీణ పారిశ్రామికీకరణను సాధిస్తామని, జడీపీ వృద్ధి రేటు పెంచుతామని ఆయన చెప్పారు. ఆటోమొబైల్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్ తదితర రంగాల్లో ప్రపంచస్థాయిలో అగ్రగామిగా నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా తెరచిన 34 కోట్ల జనధన ఖాతాల వల్ల పేదలకు లబ్ధి చేకూరిందని, సంక్షేమ పథకాల ఫలాలు వారి ఖాతాల్లోకి నేరుగా జమవుతున్నాయని చెప్పారు. ఒక్కచోటే లెవీ స్టాంప్ డ్యూటీని వసూలు చేయాలన్న యోచనలో ఉన్నామని, ప్రస్తుత విధానాన్ని సవరించాల్సి ఉందని అన్నారు.

ఐఐటీ, ఐఐఎంలకు మొండిచేయి

దేశంలోని ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్ఇఆర్, స్వతంత్ర సంస్థలైన యూజీసీ, ఏఐసీటీఈలకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు గణనీయంగా తగ్గిపోయాయి. ఒక పక్క దేశంలో ఈబీసీలకు రిజర్వేషన్లు అమలుపరిచే క్రమంలో ఐఐటీలు, ఐఐఎంలు ఇతర సంస్థల్లో సీట్లను పది శాతం పెంచాలని కేంద్రం ఇటీవల ఆదేశాలు జారీ చేస్తూనే అదే సమయంలో బడ్జెట్‌లో వీటికి కేటాయింపులు తగ్గించడం పట్ల విద్యావేత్తలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఐఐఎంలకు 1,036 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో 59.9 శాతం కోత విధిస్తూ కేవలం 415.41 కోట్లు మాత్రమే కేటాయించారు. అలాగే ఐఐటీలకు గత ఏడాది 8,337.21 కోట్లు కాగా, ఈ ఏడాది 6,326 కోట్లు మాత్రమే ఇచ్చారు. యూజీసీకి గతేడాది గత బడ్జెట్‌లో 4,722.75 కోట్లు కాగా, ఈ ఏడాది 4.600.66 కోట్లు, ఏఐసీటీఇకి గతేడాది 485 కోట్లు కాగా, ఈ ఏడాది 466 కోట్లు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి (ఐఐఎస్ఈఆర్ఎస్)కు గత ఏడాది 689 కోట్లు, ఈ ఏడాది 660 కోట్లను కేటాయించారు.

రక్షణకు లక్ష కోట్లు

భారతదేశంలో మొదటిసారిగా హోంమంత్రిత్వ శాఖకు లక్ష కోట్లకు పైగా బడ్జెట్‌ను కేటాయించారు. సరిహద్దును మరింత పటిష్టం చేసేందుకు, పోలీసులకు మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం 1,03,000 కోట్లను కేంద్రం కేటాయించింది. గత ఏడాది ఈ శాఖకు 99,034 కోట్లను కేటాయించగా, ఈ ఏడాది 4.9 శాతం అధికంగా 1,03,927 కోట్లను కేటాయిస్తున్నట్టు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. వీటిలో నిరంతరం దేశరాజధానిలో శాంతిభద్రతలు పర్యవేక్షించే ఢిల్లీ పోలీసులకు 7,496.91 కోట్లు, సరిహద్దులో మౌలిక అభివృద్ధికి రెండు వేల కోట్లను కేటాయించారు. అలాగే జమ్మూకాశ్మీర్, ఇతర ఈశాన్య రాష్ట్రాలతో పాటు దేశమంతటా విధులు నిర్వసిస్తున్న సీఆర్‌పీఎఫ్ దళాలకు 23,472.04 కోట్లు, బిఎస్‌ఎఫ్‌కు 19,647.59 కోట్లు కేటాయించారు. సీఆర్‌పిఎఫ్, బీఎస్ఎఫ్ తదితర కేంద్ర ఆర్మ్‌డ్ పోలీస్ బలగాలకు మొత్తం 71,618.70 కోట్లు కేటాయించారు. గత ఏడాది వీరికి 67,779.75 కోట్ల కేటాయింపు జరిగింది. అలాగే ఇంటిలిజెన్స్ బ్యూరోకు 2,198.35 కోట్లు, స్పెషల్ ప్రొటక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ)కి 530.75 కోట్లు కేటాయించారు. పోలీసులకు బేరక్‌ల అభివృద్ధి, రెసిడెన్షియల్ క్వార్టర్ల నిర్మాణం, మరమ్మతులు, ఆయుధాలు, మందుగుండు, వాహనాల కొనుగోలు వంటి మౌలిక అవసరాల నిమిత్తం 5,117 కోట్లను కేటాయించారు.



లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ను చరిత్రలో నిలిచిపోతుందని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. సమాజంలోని అన్నివర్గాల ప్రజలతోపాటు ఆర్థికంగా బలపడేందుకు ఈ బడ్జెట్ దోహదం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని ఆయన అన్నారు. మధ్యతరగతి ప్రజలకు ఊరటనిచ్చే ఎన్నో ప్రయోజనాలు ఈ బడ్జెట్‌లో రూపొందించామని, అందులో భాగంగా ఇపుడున్న ఆదాయపు పన్ను పరిమితిని పెంచి 5 లక్షల రూపాయల వరకు మినహాయింపు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా బ్యాంకు డిపాజిట్లు, అద్దెలపై వచ్చే వడ్డీపై కూడా మినహాయింపు ఇచ్చినట్టు ఆయన తెలిపారు. 'దేశ ఆర్థిక పరిస్థితిని మరింత బలోపేతం చేయడానికి వీలుగా సరికొత్త బడ్జెట్‌ను రూపొందించాలని మా ప్రభుత్వం ఆ దిశగా నిర్ణయం తీసుకుంది. ఈసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ తప్పకుండా చరిత్రాత్మకమే. ఇది ఎంతోమంది సమాజంలోని అన్నివర్గాలకు ప్రయోజనం చేకూరుస్తుంది' అని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పార్లమెంటు వెలుపల మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అభివర్ణించారు. కాగా, ప్రతిపక్షంపై సర్జికల్ స్ట్రయిక్‌గా మధ్యంతర బడ్జెట్‌ను కేంద్ర మంత్రులు రామ్ విలాస్ పాశ్వాన్, ఆర్.కే.సింగ్ అభివర్ణించారు. ఈ బడ్జెట్ రెండో సర్జికల్ స్ట్రయిక్ అని, తొలిసారి జరిగిన సర్జికల్ స్ట్రయిక్ మన సైనికులు సరిహద్దులో బుల్లెట్లతో చేసిన పోరాటమని వారు పేర్కొన్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి మహేష్ శర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని సాధారణ వ్యక్తులతోపాటు అన్నివర్గాలకు మేలు చేకూర్చే బడ్జెట్ అని అన్నారు. చాలాకాలం తర్వాత ఇలాంటి బడ్జెట్‌ను చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఇది సరికొత్త చరిత్ర

కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

రోజుకు 17 రూపాయలా?


- ❖ ఇది రైతును అవమానించడం కాదా?
- ❖ కేంద్రంపై కాంగ్రెస్ చీఫ్ రాహుల్ విసుర్లు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: సాలీనా ఆరు వేల రూపాయల ఆర్థిక సహాయం చేస్తామని చెప్పటం ద్వారా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశంలోని కోట్లాది మంది రైతులను అవమానించారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ శుక్రవారం మహాకూటమి సమావేశం తరువాత విలేఖరులతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రోజుకు 17 రూపాయలు ఇస్తామనడం రైతులను అవమానించటం కాదా? అని ప్రశ్నించారు. యువతకు ఉపాధి కల్పించడం, రైతుల ప్రయోజనాలను కాపాడడంలో నరేంద్ర మోదీ ఘోరంగా విఫలమయ్యారని రాహుల్ ఆరోపించారు. శుక్రవారం నాటి అఖిల పక్ష సమావేశంలో యువతకు ఉపాధి కల్పన, వ్యవసాయం, రాజ్యాంగ సంస్థలపై జరుగుతున్న దాడులు, ఈవీఎంలపై ప్రజలకు ఉన్న అనుమానాల గురించి చర్చించినట్లు కాంగ్రెస్ అధినేత స్పష్టం చేశారు. ఈ అంశాల గురించి చర్చించేందుకు మహా కూటమి తరచు సమావేశం అవుతుందన్నారు. ఈవీఎంలపై తమకున్న అనుమానాలను వివరిస్తూ ఒక వినతిపత్రాన్ని సోమవారం కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పిస్తామని ఆయన ప్రకటించారు. మహా కూటమి సమావేశం జరిగిన తీరు పట్ల అందరు సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. ఈవీఎంల వ్యవహారంపై తాము కొన్ని ప్రతిపాదనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పత్రాలను ప్రవేశపెట్టే ప్రసక్తే లేదని ఈసీ స్పష్టం చేసింది కదా? అని ఒక విలేఖరి అనగా 'ఈవీఎంలపై ప్రజల విశ్వాసం పెంచేందుకు ఏం చేయాలనేది మేం సూచిస్తాం'అని ఆయన బదులిచ్చారు. ప్రతి రైతు కుటుంబానికి 17 రూపాయలు ఇవ్వడం వల్ల వారి అన్ని సమస్యలు పరిష్కారం కావు, వాస్తవానికి మోదీ ప్రభుత్వం రైతులను అవమానించిందని ఆయన దుయ్యబట్టారు.



రూ.5లక్షల వరకు ఐటీ మినహాయింపు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పియూష్ గోయల్ శుక్రవారం పార్లమెంటులో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సాధారణంగా మధ్యంతర బడ్జెట్‌లో ఎలాంటి కొత్త పథకాలను, విధాన నిర్ణయాలను ప్రతిపాదించరు. ప్రభుత్వం రానున్న నాలుగయిదు నెలలకు ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టడం సంప్రదాయం. సార్వత్రిక ఎన్నికల తరువాత కొలువు దీరే కొత్త సభలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరుగుతుంది. అయితే, సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న తరుణంలో ప్రవేశపెట్టిన ఈ మధ్యంతర బడ్జెట్‌లో పలు జనాకర్షక పథకాలను ప్రతిపాదించడం జరిగింది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన ముఖ్య అంశాలు ఇలా ఉన్నాయి.

మధ్యంతర బడ్జెట్‌లో పలు జనాకర్షక ప్రతిపాదనలు

- సంవత్సరానికి రూ. అయిదు లక్షల వరకు ఆదాయం గల వారికి ఆదాయపు పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు
- ప్రావిడెంట్ ఫండ్‌లు, నిర్దిష్ట ఈక్విటీలలో పెట్టుబడులు పెట్టిన వ్యక్తులు వాటి ద్వారా ఆర్జించే రూ. 6.5 లక్షల వరకు ఆదాయంపై ఎలాంటి పన్ను చెల్లించవలసిన అవసరం లేదు.
- వేతన ఉద్యోగులకు స్టాండర్డ్ ట్యాక్స్ డెడక్షన్ రూ. 40వేల నుంచి రూ. 50వేలకు పెంపు
- బ్యాంకులు, పోస్టాఫీసుల్లో చేసిన డిపాజిట్లపై వచ్చే వడ్డీపై టీడీఎస్ (ట్యాక్స్ డెడక్షన్ ఎట్ సోర్స్) విధింపు ప్రారంభ పరిమితి రూ. పది వేల నుంచి రూ. 40వేలకు పెంపు
- అద్దె ఆదాయంపై టీడీఎస్ విధింపు ప్రారంభ పరిమితి రూ. 1.8 లక్షల నుంచి రూ. 2.4 లక్షలకు పెంపు
- వచ్చే రెండేళ్లలో రిటర్న్‌ల ఐటీ ప్రాసెసింగ్‌ను 24 గంటల్లోగా పూర్తి చేస్తారు
- పన్ను చెల్లింపుదారులు వ్యక్తిగతంగా రాకుండానే పన్ను చెల్లింపులకు సంబంధించిన అన్ని తనిఖీలను ఎలక్ట్రానిక్ పద్ధతిలోనే నిర్వహిస్తారు
- రెండు హెక్టార్ల కన్నా తక్కువ వ్యవసాయ భూమి కలిగి ఉన్న రైతులకు సంవత్సరానికి రూ. 6000 చొప్పున ప్యాకేజీని ఇస్తారు. ఈ పథకాన్ని ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి అని పిలుస్తారు
- దేశీయంగా తయారు చేయనున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ అనే సెమీ హైస్పీడ్ రైలును ప్రారంభిస్తారు
- వచ్చే అయిదేళ్లలో ఒక లక్ష గ్రామాలను డిజిటల్ విలేజ్‌లుగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందిస్తారు
- దేశంలోని ఈశాన్య ప్రాంతంలో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి నిధుల కేటాయింపు గత సంవత్సరం 21 శాతం వృద్ధి రేటుతో రూ. 58,166 కోట్లకు పెరిగింది
- పైరసీని నిరోధించడానికి ఇండియన్ సినిమాటోగ్రాఫ్ చట్టంలో యాంటీ-కామ్‌కోర్డ్ నిబంధనలనుప్రవేశపెడతారు
- త్వరలోనే నేషనల్ ఆర్టిఫీషియల్ ఇంటెల్లిజెన్స్ పోర్టల్ ప్రారంభం
- ఈఎస్ఐ వర్తింపు పరిమితి రూ. 21వేలకు పెంపు
- కనీస పింఛను రూ. వెయ్యికి పెంపు
- సంఘటిత రంగంలో రూ. 15వేల లోపు ఆదాయం గల కార్మికులకు మెగా పింఛను పథకం
- మొత్తం 22 పంటలకు కనీస మద్దతు ధరను వాటి ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు పెంచుతూ నిర్ణయం
- హర్యానాలో 22వ ఎయిమ్స్ ఏర్పాటు.

మా దౌత్య సిబ్బంది కలిసే అవకాశమివ్వండి

విద్యార్థుల అరెస్టుపై అమెరికాను కోరిన భారత్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: అమెరికాలో అక్కడి భద్రతా విభాగం అధికారులు అదుపులోకి తీసుకున్న తమ దేశ విద్యార్థులను తమ కాన్సులేట్ సిబ్బంది కలుసుకోవడానికి అవకాశం ఇవ్వాలని భారత్ కోరింది. అలాగే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలనా యంత్రాంగం ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పిందని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. అమెరికాలో భారతీయ విద్యార్థుల అరెస్టుతో తలెత్తిన పరిస్థితిపై ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ పేర్కొన్నారు. నకిలీ విశ్వవిద్యాలయంలో విద్యార్థులను చేర్పించిన వారికి, ఈ ప్రక్రియలో మోసపోయిన విద్యార్థులకు మధ్య వ్యత్యాసాన్ని గమనించవలసిన అవసరాన్ని కూడా భారత్ అమెరికా అధికారుల దృష్టికి తీసుకెళ్లిందని ఆయన తెలిపారు. కేవలం అమెరికాలో నివసించాలనే ఉద్దేశంతో అక్కడి నకిలీ విశ్వవిద్యాలయంలో చేరిన 130 మంది విదేశీ విద్యార్థులను అమెరికా అధికారులు అరెస్టు చేశారు. వారిలో అధిక సంఖ్యలో భారతీయ విద్యార్థులు ఉన్నారు. ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) ఏజెంట్లు బుధవారం వారిని అరెస్టు చేశారు. 'విద్యార్థులను అరెస్టు చేసిన సమాచారం అందుకున్న వెంటనే మా మిషన్ అమెరికా విదేశాంగ శాఖను, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటి అధికారులను సంప్రదించడం జరిగింది. అరెస్టు అయిన మొత్తం మంది విద్యార్థుల జాబితాను, వారి గుర్తింపు వివరాలు, వారిని నిర్బంధంలో ఉంచిన స్థలం వంటి వివరాలను తమకు అందజేయాల్సిందిగా వారిని కోరడం జరిగింది' అని రవీశ్ కుమార్ తెలిపారు. అమెరికాలో భారతీయ విద్యార్థుల అరెస్టుతో తలెత్తిన పరిస్థితిపై భారత ప్రభుత్వం వాషింగ్టన్‌లోని ఇండియన్ మిషన్, అమెరికాలోని ఇండియన్ కాన్సులేట్లతో కలిసి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.

మోదీ నినాదాలతో మార్మోగిన లోక్‌సభ


ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: లోక్‌సభ శుక్రవారం మోదీ నినాదాలతో మారుమోగిపోయింది. ఆర్థిక శాఖ తాత్కాలిక మంత్రి పియూష్ గోయల్ 2019-20 వార్షక ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను సభలో ప్రతిపాదిస్తూ సంవత్సరాదాయం ఐదు లక్షల రూపాయలున్న వారు ఆదాయం పన్ను చెల్లించవలసిన అవసరం లేదని ప్రకటించగానే అధికారపక్ష సభ్యులు మూకుమ్మడిగా లేచి మోదీ.మోదీ..మోదీ.. అంటూ నినాదాలు చేశారు. రెండు నిమిషాలపాటు సభ దద్దరిల్లింది. దీంతో మంత్రి గోయల్ ప్రసంగాన్ని కాసేపు ఆపాల్సి వచ్చింది. అధికార పక్షం సభ్యులు మోదీ నినాదాలు ఇస్తుంటే ప్రతిపక్షం మౌనంగా కూర్చున్నారు.

ప్రావిడెంట్ ఫండ్, నిర్దేశిత ఈక్విటీల్లో లక్షన్నర రూపాయలను పొదుపు చేయగలిగితే సంవత్సరాదాయం 6.5 లక్షల రూపాయలున్నప్పటికీ ఐటీ చెల్లించవలసిన అవసరం లేదని గోయల్ ప్రకటించినప్పుడు కూడా అధికారపక్ష సభ్యులు మోదీకి అనుకూలంగా నినాదాలు ఇచ్చారు. అధికార పక్షం సభ్యులు నినాదాలు ఇస్తుంటే ప్రధాని నరేంద్ర మోదీ చిరునవ్వులు చిందించటంతోపాటు విజయ సూచికంగా ఒక చేయితో బల్లపై కొతుతూ ఆనందించారు.



ఓటుకు నోటు కేసులో వేం నరేందర్‌రెడ్డికి ఈడీ సమన్లు



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు నోటు కేసులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వేం నరేందర్‌రెడ్డికి ఈడీ అధికారులు సమన్లు జారీ చేశారు. శుక్రవారం నాడు గచ్చిబౌలి రోలింగ్ హిల్స్‌లోని ఆయన ఇంటికి వెళ్ళి ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. వారం రోజుల్లో ఈడీ ఎదుట హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలో వేం నరేందర్‌రెడ్డి తెలుగు దేశం పార్టీలో క్రియాశీలకంగా పని చేశారు. టీడీపీ నుంచి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో ఆయనతో పాటు వేం నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఓటుకు నోటు కేసు మళ్ళీ తెరపైకి రావడంతో ఏమి జరుగుతుందోనని రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది.

సీబీఐ డైరెక్టర్ ఎంపికపై కుదరని ఏకాభిప్రాయం

కొనసాగుతున్న సస్పెన్స్ ❖ అధికార వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: సీబీఐ కొత్త డైరెక్టర్ ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతోంది. సీబీఐ డైరెక్టర్‌గా కొత్త అధికారి ఎంపిక కోసం శుక్రవారం ఇక్కడ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన ఉన్నత కమిటీ సమావేశం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ ఎంపికపై జరిగిన రెండు సమావేశాల్లో కూడా ఉన్నత కమిటీ ఏకాభిప్రాయానికి రాలేకపోయిందని అధికార వర్గాలు తెలిపాయి. తాత్కాలిక డైరెక్టర్ పదవిలో అధికారిని ఎక్కువ కాలం కొనసాగనివ్వడానికి సుప్రీంకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పులో నిరాకరించింది. వెంటనే రెగ్యులర్ డైరెక్టర్‌ను నియమించాలని కోర్టు ఆదేశించింది. తాత్కాలిక డైరెక్టర్ పదవిలో ఉన్న అధికారిని ఎక్కువ కాలంలో కొనసాగనివ్వరాదని కోర్టు పేర్కొంది. ఇంతవరకు ఈ నియామకం ఎందుకు చేపట్టలేదని కూడా కోర్టు ప్రశ్నించింది. శుక్రవారం రాత్రి జరిగిన ఉన్నత కమిటీ సమావేశం ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా వాయిదా పడిందని అధికార వర్గాలు తెలిపాయి. జనవరి 10వ తేదీ నుంచి సీబీఐ డైరెక్టర్ పదవి ఖాళీగా ఉంది. డైరెక్టర్ పదవికి అధికారిని ఎంపిక చేసేందుకు గత నెల 24వ తేదీన ఉన్నత స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వం 70 నుంచి 80 మంది అధికారుల పేర్లను కమిటీ ముందుంచిందని, కాని ప్రొఫైల్ లేదని అప్పట్లో ప్రతిపక్ష నేత, కమిటీ సభ్యుడు మల్లికార్జునఖర్గే చెప్పారు.

ఏపీ ట్రాన్స్‌కో వినూత్న ప్రయోగం

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, ఫిబ్రవరి 1: రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు ఫైబర్ కనెక్షన్ నెట్‌వర్క్ ప్రక్రియను విస్తృతం చేసేందుకు ఏపీ ట్రాన్స్‌కో ప్రణాళిక సిద్ధం చేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఫైబర్ కనెక్షన్‌కు వినియోగించే ఆప్టికల్ గ్రౌండ్ వైర్ నెట్‌వర్క్‌ను బీఎస్‌ఎన్‌ఎల్, ఇతర సర్వీస్ ప్రొవైడర్లకు లీజుకు ఇవ్వటం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవటంతో పాటు సమాచార వ్యవస్థను మరింతగా ప్రజలకు చేరువ చేయనుంది. ఇందులో భాగంగా బీఎస్‌ఎన్‌ఎల్, బ్రాడ్ బ్యాండ్, ఇతర నెట్‌వర్క్ సంస్థలతో ట్రాన్స్‌కో సీఎండీ, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి విజయానంద్ చర్చలు జరుపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 24 ఫైబర్ నెట్ కనెక్షన్ కేంద్రాలను ట్రాన్స్‌కో ఏర్పాటు చేస్తోంది. వీటిలో 12 కేంద్రాలను ప్రభుత్వరంగ, ప్రైవేట్ కమ్యూనికేషన్ సంస్థలకు లీజుకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఇంధనశాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సీఎం పలు సూచనలు చేశారు. మొత్తం 2వేల 765 కిలోమీటర్ల మేర 12 ట్రాన్స్‌కో ఫైబర్ కేబుల్ కేంద్రాల ద్వారా నెట్‌వర్క్ సంస్థలకు లీజుకు ఇస్తారు. కిలోమీటర్‌కు రూ 2250 అద్దె చెల్లించాల్సి ఉంటుంది. మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు బలపడటంతో పాటు ట్రాన్స్‌కోకు రెవెన్యూ పెరుగుతుందని మంత్రి కళా వెంకట్రావు తెలిపారు.

ఇష్టపడి చదివితే ఉన్నతస్థాయి తథ్యం

మంచిర్యాల కలెక్టర్ భారతీ హోళీకేరి



విద్యార్థులతో కలిసి కేట్‌వాక్ చేస్తున్న కలెక్టర్ భారతీ హోళీకేరి

మంచిర్యాల, ఫిబ్రవరి 1: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నతస్థాయిలో నిలువవచ్చని కలెక్టర్ భారతీ హోళీకేరి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వళన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విజయానికి చిరునామాగా మారిందన్నా రు. పేద,మధ్య తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం రెసిడెన్సియల్ గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. అవకాశాలు అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. మార్కుల కోసం కాకుండా జ్ఞానాన్ని పెంచుకునేలా చదవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని, అర్హత కలిగి ఓటు హక్కు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యూకేషనల్ ఇనిస్ట్యూషన్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్నాయని ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తూ స్థిర పడుతున్నారని అన్నారు. అనంతరం కళాశాలలో చదువుతూ వివిధ జిల్లా రాష్ట్ర, జాతీయ స్థాయిలో సంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, చదువు, వ్యాస రచన, ఉపన్యాస పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సీల్డ్‌లు అందజేశారు. అనంతరం విద్యార్థినీలు ప్రదర్శించిన నృత్యాలు అందరిని అకట్టుకున్నారు. ఇందులో భాగంగా కలెక్టర్ హోళీకేరి విద్యార్థినులతో కలిసి క్యాట్‌వాక్ చేయడం అందరినీ అలరించింది. కార్యక్రమంలో జిల్లా ఖజానా అధికారి సరోజ, జిల్లా కన్వీనర్ చంద్రమోహన్ గౌడ్, జిల్లా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమిషానికో రంగు.. పూటకో మాట



అసెంబ్లీలో మాట్లాడుతున్న బీజేపీ ఫ్లోర్‌లీడర్ విష్ణుకుమార్‌రాజు

❖ చంద్రబాబుపై శాసనసభలో బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు
❖ అడుగడుగునా అడ్డుపడిన మంత్రులు, టీడీపీ సభ్యులు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 1: నిమిషానికో రంగు... నిమిషానికో మాట మార్చేతత్వం తెలుగుదేశం పార్టీది...ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని శాసనసభ సమావేశాల్లో శుక్రవారం 'ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టం అమలు'పై జరిగిన చర్చలో భారతీయ జనతా పార్టీ ఫ్లోర్‌లీడర్ పెన్మెత్స విష్ణుకుమార్ రాజు తూర్పారబట్టారు. కాంగ్రెస్ పార్టీకి వ్యితిరేకంగా దివంగత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపిస్తే నేడు చంద్రబాబు అదే పార్టీతో చేతులు కలపటమేగాక, శుభప్రదమైన పసుపురంగును పక్కనబెట్టి తనతోపాటు తన వారితో కూడా నల్ల దుస్తులను ధరింపచేసారంటూ ఎద్దేవా చేశారు. అయితే ఈ రాష్ట్రాభివృద్ధికి దేశంలో ఏ రాష్ట్రానికీ చేయని విధంగా ప్రధాని మోదీ చేయూతనిస్తుండటం వల్లనే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు నల్ల దుస్తులు ధరించలేదన్నారు.

శాసన సభాపతి ముగ్గురి రాజీనామాలను ఆమోదించారు... 23 మంది ఫిరాయంపు ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వ వైఖరి ఏమిటో అంతుబట్టటంలేదన్నారు. అయితే విష్ణుకుమార్ రాజు ప్రసంగిస్తున్నంత సేపు టీడీపీ సభ్యులు పాయింట్ ఆఫ్ ఆర్డర్ అంటూ అడుగడుగునా అవరోధం కల్పిస్తూనే వచ్చారు. మధ్యలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బీజేపీ సభ్యుడు ఆకుల సత్యనారాయణ ఎందుకు రాజీనామా చేశారో ముందు చెప్పాలన్నారు. ఈ రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతున్నదనే ఆయన రాజీనామా చేశారని చెబుతుండగా విష్ణుకుమార్ రాజు కల్పించుకుంటూ టీడీపీ సభ్యులు మేడా మల్లిఖార్జునరావు, రావెల కిషోర్‌బాబు ఎందుకు రాజీనామా చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన తప్పిదాన్ని తమపై మోపవద్దంటూ, ఆనాడు చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతం అంటూనే విభజనకు అనుకూలంగా లేఖ ఇచ్చారుకదా అని ప్రశ్నించారు. 'ప్రత్యేక హోదా వద్దు.. ప్యాకేజీ ముద్దు' అంటూ ఇదే సభలో ప్రధాని మోదీని పొగుడుతూ తీర్మానం చేసిన చంద్రబాబు ఎందుకు యూటర్న్ తీసుకోవాల్సి వచ్చిందో ఈ రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. హోదా పేరిట జగన్ ప్రజల్లోకి దూసుకువెళుతుండటమే దీనికి కారణమన్నారు. అసలు ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యేలలో బాబు వెంట మున్ముందు ఎంత మంది నిలుస్తారో చూడాల్సి ఉందన్నారు. తెలంగాణ ఎన్నికల్లో బాబు కారణంగా కాంగ్రెస్సే కాదు, తాము కూడా నిండా మునిగిపోయామన్నారు. టీడీపీతో చెలిమే దీనికి కారణమన్నారు. ముందుగా విశాఖ రైల్వేజోన్ గురించి మాట్లాడాలంటూ గోరంట్ల బుచ్చయ్య చౌదరి మరి కొందరు పదేపదే ప్రశ్నించగా తప్పక వస్తుందని విష్ణుకుమార్ రాజు అన్నారు. ప్రత్యేక ప్యాకేజీ కింద వివిధ పద్దుల కింద రూ. 15వేల కోట్లు ఇవ్వడానికి కేంద్రం సిద్ధమైనా బాబు ఉద్దేశపూర్వకంగా రాజకీయ లబ్ధి కోసమే తిరస్కరించారని అన్నారు. విభజన చట్టంలోని అంశాలన్నింటినీ దాదాపు కేంద్రం నెరవేర్చిందని, పైగా సంబంధంలేని ప్రాజెక్టులను కూడా మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి కేంద్రం అత్యంత ప్రాధాన్యత నిచ్చిందన్నారు. సమాచార శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఏమయిందన్నారు. దీనికి రూ. 25వేల కోట్లు అవసరం కాగా ఏడాదికి రూ. 350 కోట్లు చొప్పున కేవలం రూ. 1050 కోట్లు ఇచ్చి నాలుగో సంవత్సరంలో రూ. 350 కోట్లను వెనక్కి తీసుకోటం దారుణం కాదా అని ప్రశ్నించారు. ఈ దఫా బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తే ఎక్కడా డిపాజిట్లు కూడా దక్కబోవని హెచ్చరించారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ పోలవరానికి కాంగ్రెస్ హయాంలోనే జాతీయ హోదా లభించిందని, తమ నేత చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయబోనని చెప్పినందు వల్లనే తెలంగాణలోని ఏడు ముంపు మండలాలను ఏపీలో విలీనం చేశారన్నారు. రూ. 50వేల కోట్ల అంచనా వ్యయంతో తాము పంపించిన రివైజ్డ్ ఎస్టిమెట్ అంచనాలను, రెండో డీపీఆర్‌ను ఆమోదించకపోవడంలో ఆంతర్యం ఏమిటని దేవినేని ప్రశ్నించారు. విష్ణుకుమార్ రాజు తన ప్రసంగంలో మధ్యమధ్య పలు మార్లు మంచినీరు తాగుతుండగా టీడీపీ సభ్యులు కల్పించుకుని అబద్ధాలు మాట్లాడుతున్నారని అందుకే నీరు తాగుతున్నారంటూ ఎద్దేవా చేయగా దీనికి ఆయన అసలు ఏమీ మాట్లాడకుండానే లోకేష్ నీరు తాగుతున్నారు కదా అంటూ బదులిచ్చారు.


ఎక్స్‌ప్రెస్ టీవీ అధినేత చిగురుపాటి దారుణ హత్య



నందిగామ, ఫిబ్రవరి 1: కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్, ఎక్స్‌ప్రెస్ టీవీ వ్యవస్థాపకుడు చిగురుపాటి జయరామ్ గురువారం కృష్ణాజిల్లా నందిగామ సమీపంలో కారులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. జాతీయ రహదారిపై ఐతవరం సమీపంలో కారులో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు హైదరాబాదులో స్థిరపడ్డ చిగురుపాటి జయరాంగా గుర్తించారు. ఈయన కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్‌గా, ఎక్స్‌ప్రెస్ టివి చైర్మన్‌గా, హెమారన్ ఫార్మా కంపెనీ ఎండిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అమెరికాలోనూ ఒక బ్యాంక్‌కు డైరెక్టర్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. జయరాం మృతదేహంపై రక్తపు గాయాలు ఉండటంతో ఎవరో హత్య చేసి కారులో పడేసి వెళ్లి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని నందిగామ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్, రూరల్ సిఐ, నందిగామ ఇన్స్‌పెక్టర్ పివి రమణ, ఎస్‌ఐలు సిబ్బందితో సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గురువారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు భావిస్తున్నారు. జయరాం కుటుంబ సభ్యులు ప్రస్తుతం అమెరికాలోని ఫ్లోరిడాలో నివాసం ఉంటుండగా, అతని తల్లిదండ్రులు విజయవాడ సమీపంలోని కానూరులో ఉంటున్నారు. రెండు రోజుల క్రితం జయరామ్ హైదరాబాదు నుండి విజయవాడ బయలుదేరినట్లు, ఆయనతో పాటు మరో వ్యక్తి కూడా కారులో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. కారులో మద్యం సీసాలను పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జయరాం హత్యకు ఆర్థికపరమైన వివాదాల కారణం అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

నల్లచొక్కాతో చంద్రబాబు

ఏపీ మంత్రులు, సభ్యులు కూడా..



ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, ఫిబ్రవరి 1: ప్రత్యేక హోదా డిమాండ్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పాటు రాష్ట్ర మంత్రులు, తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు శుక్రవారం నల్లచొక్కాలు, నల్ల బ్యాడ్జీలు ధరించి సమావేశాలకు హాజరయ్యారు. కొందరు మంత్రులు అప్పటికప్పుడు చొక్కాలు తెప్పించుకుని మరీ నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ ఫ్లోర్‌లీడర్ విష్ణుకుమార్‌రాజు, మాజీ మంత్రి పైడికొండ మాణిక్యాలరావు మాత్రం సాధారణ దుస్తులతో సమావేశాలకు హాజరయ్యారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నల్లచొక్కా తెల్లప్యాంట్ ధరించి ఉండవల్లిలోని తన నివాసం నుంచి శాసనసభకు చేరుకున్నారు. హోదా, విభజన అంశాల అమలుపై శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టే ముందు రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సభలో కేంద్రాన్ని నిలదీశారు.

1వ పేజీ తరువాయి

ఓటెత్తిన పద్దు

మినహాయిపు, రుణాలను సకాలంలో చెల్లించే పక్షంలో మరో 3 శాతం పన్ను మినహాయింపు లభిస్తుంది. గోవుల సంరక్షణకు రూ. 750 కోట్లతో జాతీయ గోకుల్ మిషన్ కింద జాతీయ స్థాయిలో కామధేను సంస్థను ఏర్పాటు చేస్తున్నారు. అసంఘటిత రంగంలో ఉన్న 10 కోట్ల మందికి పెన్షన్ పథకాన్ని ప్రకటించారు. ప్రధాన మంత్రి శ్రమయోగి మాన్‌ధన్ పేరుతో ప్రారంభిస్తున్న ఈ పథకం కింద పదిహేను వేల రూపాయల నెల వేతనం పొందుతున్న వారికి 60 ఏళ్ల వయస్సు తరువాత ప్రతినెలా రూ. 3000 రూపాయల పెన్షన్ చెల్లిస్తారు. ప్రతినెల వంద లేదా 55 రూపాయలు చెల్లించే వారికి ప్రభుత్వం అంతే మొత్తంలో తన వైపు నుంచి జమ చేస్తుంది. ఈ పథకం వల్ల దాదాపు పదికోట్ల మందికి ప్రయోజనం కలుగుతుందని పియూష్ గోయల్ ప్రకటించారు.

పన్ను మినహాయింపులు

ఐదు లక్షల రూపాయలు వార్షిక ఆదాయం ఉన్న ఉద్యోగస్తులు ఇక మీదట ఆదాయం పన్ను చెల్లించవలసిన అవసరం లేదు. ఉద్యోగస్తులు ప్రావిడెంట్ ఫండ్, నిర్ధారిత పొదుపు పథకాలు, బీమా పథకాల్లో కొంత డబ్బు పొదుపు చేసే పక్షంలో ఆరున్నర లక్షల రూపాయల ఆదాయం వరకూ ఎలాంటి పన్ను భారం పడదని గోయల్ ప్రకటించారు. దీంతో పాటు రెండు లక్షల రూపాయల వరకు వడ్డీ, రెండు లక్షల రూపాయల విద్యా రుణాలపై వడ్డీ, మెడికల్ బీమా, వైద్య ఖర్చులపై అదనపు మినహాయింపులు లభిస్తాయని మంత్రి తెలిపారు. ఉద్యోగుల స్టాండర్డ్ మినహాయింపును 40 వేల నుంచి 50 వేల రూపాయలకు పెంచటం వలన మూడు కోట్ల మందికి రూ. 4,700 కోట్ల పన్ను ప్రయోజనం కలుగుతుందని మంత్రి వివరించారు. రెండో ఇంటిపై ఇంత కాలం విధిస్తూ వచ్చిన నోషనల్ ఆదాయం పన్నును తొలగిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇంత వరకు స్వయంగా ఉంటున్న రెండో ఇంటిపై కూడా కొంత ఆదాయం పన్ను విధించే వారు ఇక మీదట ఇది అమలు కాదు. బ్యాంకు, పోస్టు ఆఫీస్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయంపై టీడీఎస్ (టాక్స్ డిడెక్టెడ్ ఎట్ సోర్స్)ను లక్ష రూపాయల నుంచి లక్షా నలభై వేల రూపాయలకు పెంచారు. దీని వలన ఇక మీదట డిపాజిట్లపై ఒక లక్షా నలభై వేల వరకు ఆదాయ పన్ను చెల్లించవలసిన అవసరం ఉండదు. అద్దె ఆదాయంపై టీడీఎస్ చెల్లింపు పరిమితిని కూడా పెంచారు. ఇంత వరకు అద్దె ఆదాయం ఒక లక్షా ఎనభై వేల కంటే అధికంగా ఉంటే టీడీఎస్ చెల్లించవలసి వచ్చేది. ఇక మీదట అద్దె ఆదాయం రెండు లక్షల నలభై వేల రూపాయల పరిమితిని దాటితేనే టీడీఎస్ రూపంలో పన్ను చెల్లించవలసి ఉంటుంది. ఇళ్లు, ఫ్లాట్ల ఖరీదుపై విధిస్తున్న జీఎస్టీని కూడా తగ్గించనున్నట్లు పియూష్ గోయల్ ప్రకటించారు. జీఎస్టీ సమాఖ్య పరిధిలోని మంత్రుల కమిటీ ఇందుకు సంబంధించిన సిఫార్సులు చేస్తుందని మంత్రి ప్రకటించారు. ఒక ఇల్లు విక్రయించే దానితో వచ్చే నగదుతో ఇంత వరకు మరో ఒక ఇల్లు మాత్రమే కొనేందుకు వీలుండేది. ఇక మీదట రెండు ఇళ్లను కొనుగోలు చేసేందుకు వీలు కల్పించారు. రెండు కోట్ల రూపాయల వరకూ లాంగ్ టర్మ్ గెయిన్స్ పన్ను చెల్లించే బదులు రెండు ఇళ్లు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. ఉజ్వల పథకం కింద మరో ఎనిమిది కోట్ల మందికి ఎల్‌పీజీ గ్యాస్ కనెషన్లు ఇస్తామని మంత్రి తెలిపారు. ఇంతవరకు ఆరు కోట్ల మందికి ఎల్‌పీజీ కనెక్షన్లు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. 'దేశం ప్రతిష్ట, ఆత్మవిశ్వాసం పెంచాం. దేశం ఇప్పుడు అభివృద్ధి పథంపై ముందుకు సాగుతూ 2020 నాటికి నూతన భారత దేశ నిర్మాణం దిశగా ముందుకు సాగుతున్నాం' అని మంత్రి పియూష్ గోయల్ వెల్లడించారు. 'మన దేశం త్వరలోనే ఆరో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది' అని ఆయన స్పష్టం చేశారు. దేశం సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం స్పష్టమైన ఆలోచన, పారదర్శక విధానం, పటిష్టమైన సమగ్రతతో ముందుకు సాగుతోందని ఆయన ఉద్ఘాటించారు.

రైతుబంధును కాపీ చేశారు

అంశాలను ఈ బడ్జెట్‌లో పొందుపరిచారని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ మరికొద్దిరోజుల్లో రాబోతున్నదని ఈ పరిస్థితుల్లో ఈ బడ్జెట్‌లో పేర్కొన్న అంశాలను అమలు చేయడం సాధ్యం కాదని భావనను ఆయన వ్యక్తం చేశారు. కాగా విభజన చట్టంలో తెలంగాణకు ఎయిమ్స్ లేకపోయినప్పటికీ రాష్ట్రానికి ఎయిమ్స్ సాధించుకున్నామని వెల్లడించారు. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలకు సంబంధించి కేంద్రం నుంచి గెజిట్ విడుదల కావల్సివుందని వినోద్‌కుమార్ పేర్కొన్నారు.

గుడి కట్టేవరకూ విశ్రమించం

రామాలయం నిర్మాణంపై ఆర్‌ఎస్‌ఎస్ తీర్మానం



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

అలహాబాద్, ఫిబ్రవరి 1: అయోధ్యలో రామాలయాన్ని నిర్మించేవరకు హిందువులు విశ్రమించరని విశ్వహిందూ పరిషత్ శుక్రవారం ఇక్కడ ఒక తీర్మానాన్ని చేపట్టింది. అయోధ్యలో శ్రీరాముడి జన్మస్థలంలో ఆలయాన్ని నిర్మించి తీరాలని, అంతవరకు తాము విశ్రమించమని, అలాగే ఇతరులను ప్రశాంతంగా ఉండనివ్వమని ఈ తీర్మానంలో వీహెచ్‌పీ ధర్మ సంసథ్ తేల్చిచెప్పింది. కుంభమేళా జరుగుతున్న ప్రదేశంలోనే ఈ ధర్మ సభను నిర్వహించిన వీహెచ్‌పీ రామజన్మభూమి-బాబరీ మసీదు భూవివాదాన్ని తేల్చడంలో సుప్రీంకోర్టులో జరుగుతున్న జాప్యాన్ని దుయ్యబట్టింది. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వ తీరును కూడా విమర్శించారు. రెండురోజుల ఈ సభ ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంతంలోని వివాద రహిత మిగులు భూమిని తిరిగి ఇచ్చేయడానికి అనుమతించాలంటూ సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం పిటిషన్ వేయడాన్ని ప్రశంసించింది. రామాలయం విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందన్న నమ్మకం సాధువుల్లో ఉందని, ఈ పిటిషన్‌ను దాఖలు చేయడం ద్వారా కేంద్రం తన చిత్తశుద్ధిని చాటుకుందని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. ఇప్పటికే రామాలయం నిర్మాణం విషయంలో తీవ్ర జాప్యం జరిగిందని, అయితే, హిందువు ఆత్మాభిమానానికి సంబంధించిన అంశాలు, అలాగే రామాలయం నిర్మాణం విషయంలో కేంద్రం అర్థవంతమైన నిర్ణయం తీసుకోగలదన్న ఆశాభావాన్ని ఈ సదస్సు వ్యక్తం చేసింది. ఇంతకుముందు ఈ సదస్సును ఉద్దేశించిన మాట్లాడిన ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ 'రామాలయ నిర్మాణాంశం నిర్ణయాత్మక దశకు చేరుకుంది' అని పేర్కొన్నారు.

ఇప్పటివరకు చేపట్టిన అనేక కార్యక్రమాల ఫలితంగా ఆలయ నిర్మాణానికి చేరువయ్యామని, ఈ దశలో ఆచితూచి అడుగువేయాల్సిన అవసరం ఎంతో ఉందని ఈ సందర్భంగా ఆయన ఉద్ఘాటించారు. ఆలయం కోసం ఉద్యమిస్తున్న సంస్థలు, వ్యక్తులు లక్ష్యానికి దూరం కాకూడదని పిలుపునిచ్చిన ఆయన ఎప్పటికప్పుడు ప్రజలకు వాస్తవాలను తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అవసరమైతే తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడానికి కూడా వెనుకాడకూడదని హిందూ శ్రేణులకు ఆయన సూచించారు. మరో ఆరు నెలల పాటు ఇందుకు సంబంధించి వేచిచూడడం మంచిదేనని పేర్కొన్న ఆయన ఆ తర్వాత మాత్రం ఆలయ నిర్మాణం సాగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పొరుగు దేశాలకు చెందిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం పొందే అవకాశాన్ని కల్పిస్తూ కేంద్రం పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టడం మంచి పరిణామమని ఆయన అన్నారు. శబరిమల విషయంలో సుప్రీంకోర్టు తొందరపాటుతో వ్యవహరించిందని కేంద్ర మాజీ మంత్రి స్వామి చిన్మయానంద్ విమర్శించారు.

అయోధ్య విషయంలో మాత్రం ప్రాధాన్యతాపూర్వకంగా వ్యవహరించడం లేదని అన్నారు. కాగా, ఈ ధోరణి వల్ల మెజారిటీ హిందువుల్లో సుప్రీంకోర్టు పట్ల నమ్మకం సడలిందని మహంత్ రామ్‌జీదాస్ వ్యాఖ్యానించారు. అభివృద్ధి పేరుతోనే మళ్లీ అధికారంలోకి రావడం అన్నది మోదీ ప్రభుత్వానికి ఎంతమాత్రం సాధ్యం కాదని శ్యామ్ దేవ చార్య మహారాజ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. 'రామభక్తులు వారి జీవితాలను త్యాగం చేస్తున్నారు. అలాంటపుడు అధికారంలోనున్న వ్యక్తులు తమ కుర్చీలను ఒదులుకోలేరా?' అని ఆయన ప్రశ్నించారు.

హక్కులడిగితే అవహేళనా?

ఏపీ శాసనసభలో తీర్మానం

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, ఫిబ్రవరి 1: ఏపీకి ప్రత్యేక హోదా.. విభజన చట్టం అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వ వివక్షను వ్యతిరేకిస్తూ శాసన సభ, మండలిలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మెజారిటీ సభ్యులు ఆమోదించారు. శాసనసభలో మంత్రి అచ్చెన్నాయుడు, మండలిలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తీర్మానాలను ప్రవేశపెట్టారు. సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహా పలువురు మంత్రులు, 16 మంది శాసనసభ సభ్యులు తీర్మానంపై చర్చ జరిపారు. తీర్మానంపై ముఖ్యమంత్రి ఉద్విగ్నభరిత ప్రసంగం చేసి ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. అధికార పార్టీ సభ్యులు తీర్మానాన్ని ఆమోదించగా బీజేపీ ఫ్లోర్‌లీడర్ విష్ణుకుమార్‌రాజు, మాజీమంత్రి పైడికొండల మాణిక్యాలరావు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తీర్మానం పూర్తి సారాంశం ఇలా ఉంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం -2014లోని అంశాలు నాటి ప్రదానమంత్రి ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, రాష్ట్రం పట్ల కేంద్రం అనుసరిస్తున్న వివక్షపూరిత తీరు పట్ల రాష్ట్ర శాసనసభ తీవ్ర ఆందోళన, నిరసన వ్యక్తం చేసింది. విభజన చట్టం ప్రకారం రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సాయం చేయాలి. రాష్ట్రానికి ప్రత్యేక రైల్వేజోన్ రావాలి. ఉక్కు కర్మాగారాన్ని స్థాపించాలి. ఓడరేవు ఏర్పాటు కావాలి. పెట్రో కెమికల్ పరిశ్రమల కారిడార్‌ను మంజూరు చేయాలి. అనేక జాతీయ విద్యా, పరిశోధన సంస్థలను నెలకొల్పాల్సి ఉంది. దీంతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో సంస్థల విభజన పూర్తి చేయాలి. విభజన బిల్లు రాజ్యసభలో ఆమోదింప చేయటానికి నాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఆరు హామీలతో కూడిన ప్రకటన చేశారు. అందులో ముఖ్యమైనవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా.. 2014-15 సంవత్సరానికి రెవెన్యూలోటు భర్తీ.. బుందేల్‌ఖండ్, కోరాపుట్, భోలాంగర్, కలహండి తరహాలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం ప్రకటించి అమలు చేయాలి. వీటిలో రైల్వేజోన్ ఇవ్వటం కుదరదని కేంద్రం చెప్తోంది. ఉక్కు కర్మాగారం లాభసాటి కాదంటోంది. ఓడరేవుకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. పెట్రో కెమికల్ పరిశ్రమకు సుమారు 5వేల కోట్ల రూపాయలు వయబులిటీ ఫండింగ్ భారాన్ని రాష్ట్రం భరించాలంటోంది. విద్యా సంస్థల శాశ్వత భవన నిర్మాణాల కోసం అరకొర నిధులు మాత్రమే కేటాయించింది. దీంతో వచ్చే 20 ఏళ్లకైనా అవి పూర్తవుతాయో లేదో అనే సందేహాలను శాసనసభ వ్యక్తం చేసింది. ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన నత్తనడకన సాగుతోంది. విజయవాడ, గుంటూరు పట్టణాలకు డ్రైయినేజ్ కోసం ఇచ్చిన డబ్బు కూడా రాజధాని అమరావతికి ఇచ్చినట్లు చెప్పడం శోచనీయమని శాసనసభ ఖండించింది.

క్రీడాభూమి

క్రీడలకు ఊతం

• బడ్జెట్ కేటాయింపుల్లో రూ.200 కోట్లు అదనం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: గతంతో పోలిస్తే క్రికెట్‌కు కేంద్రం మరింత ఊతమివ్వనుంది. అనారోగ్యంతో బాధపడుతూ, వైద్య పరీక్షలకు వెళ్లిన అరుణ్ జైట్లీ స్థానంలో కేంద్ర ఆర్థిక శాఖను తాత్కాలికంగా నిర్వహిస్తున్న పీయూష్ గోయల్ శుక్రవారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడలకు సముచిత స్థానం లభించింది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఈ బడ్జెట్‌లో క్రీడలకు ప్రస్తుతంతో పోలిస్తే 214.20 కోట్ల రూపాయలను అధికంగా కేటాయించారు. ఇంతకుముందు 2,002.72 కోట్ల రూపాయలుగా ఉన్న క్రీడా బడ్జెట్‌ను 2,216.92 కోట్ల రూపాయలకు పెంచారు. ఈ కేటాయింపుల్లో భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్), జాతీయ క్రీడాభివృద్ధి నిధి (ఎన్‌ఎస్‌డీఎఫ్)కు అధిక ప్రాధాన్యం దక్కింది. సాయ్‌కి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన మొత్తం 395 కోట్ల రూపాయలుకాగా, దానిని మరో 55 కోట్ల రూపాయలు పెంచి, 450 కోట్ల రూపాయలకు ఖరారు చేశారు. అదే విధంగా ఎన్‌ఎస్‌డీఎఫ్ మొత్తాన్ని రెండు కోట్ల నుంచి 70 కోట్ల రూపాయలకు పెంచారు. కాగా, జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్‌ఎస్‌ఎఫ్)లకు కేటాయింపుల్లో స్వల్పంగా కోత పడింది. ప్రస్తుతం 245.13 కోట్ల రూపాయలుకాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి 0.13 శాతం తగ్గించి, 245 కోట్ల రూపాయలుగా నిర్ధారించారు.

డేవిస్ కప్ ఆరంభం

• ఆతిథ్య భారత్‌కు కలసిరాని అదృష్టం • తొలిరోజు 2-0తో ఇటలీ ఆధిక్యం



ప్రజ్ఞేష్ గుణ్ణేశ్వరణ్‌పై విజయం సాధించిన ఇటలీకి చెందిన మట్టెయెవో బెర్రెట్టి



ప్రజ్ఞేష్ గుణ్ణేశ్వరణ్

కోల్‌కతా, ఫిబ్రవరి 1: ప్రతిష్టాత్మక డేవిస్ కప్‌కు ఆతిథ్యమిచ్చిన భారత్‌కు అదృష్టం తొలిరోజు కలసిరాలేదు. శుక్రవారం కోల్‌కతా సౌత్ క్లబ్‌లో ప్రారంభమైన డేవిస్ కప్ క్వాలిఫయర్స్ సింగిల్స్‌లో భారత్‌కు నిరాశే ఎదురైంది. రెండు విభాగాల్లో జరిగిన క్వాలిఫయర్స్ సింగిల్స్‌లో ఇటలీ ఆధిపత్యం చెలాయించింది. ఇటలీకి చెందిన టెన్నిస్‌లో అపార అనుభవం కలిగిన ఆండ్రెయాస్ సెప్పి భారత్‌కు చెందిన రామ్‌కుమార్ రామ్‌నాథన్‌పై 6-4, 6-2తో గెలుపు సాధించాడు. అదేవిధంగా తొలిసారిగా డేవిస్ కప్‌లో టోర్నమెంట్‌లో చోటుదక్కించుకున్న ఇటలీకి చెందిన 22 ఏళ్ల యువ ఆటగాడు మట్టెయెవో బెర్రెట్టి భారత నెంబర్ వన్ స్టార్ ఆటగాడు ప్రజ్ఞేష్ గుణ్ణేశ్వరణ్‌ను 6-4, 6-3 తేడాతో ఓడించాడు. డేవిస్ కప్ క్వాలిఫయర్‌లోనే ఇద్దరు భారత ఆటగాడు వెనుకంజ వేయడంతో ఇక ఈ టోర్నమెంట్‌లో శనివారం జరిగే డబుల్స్ విభాగంలో పాల్గొనే రోహన్ బోపన్న, దివిజ్ శరణ్‌పై భారత్ ఆశలు పెట్టుకుంది. సింగిల్స్‌లో జరిగిన రెండు మ్యాచ్‌లలో భారత ఆటగాళ్లు ఓటమి చెందడంతో బోపన్న శరణ్ తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలావుండగా, ఇటలీకి చెందిన సింగిల్స్‌లో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్న ఆటగాడు మార్కో సెచ్చినాటో 2015 ఆస్ట్రేలియా ఓపెన్ విజేత సిమోన్ బోలెల్లీతో కలసి శనివారం భారత జోడీ రోహన్ బోపన్న, దివిజ్ శరణ్‌తో తలపడనున్నారు. 'డబుల్స్‌లో శనివారం ఎదురయ్యే పోటీ కాస్త కష్టతరమైనది. అయినా పోటీలో ప్రత్యర్థులను ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు. మ్యాచ్‌ను జారవిడుచుకునేందుకు మేం సిద్ధంగా లేం' అని నాన్‌ప్లేయింగ్ కెప్టెన్ మహేష్ భూపతి తొలిరోజు సింగిల్స్ మ్యాచ్ అనంతరం ఇక్కడి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అన్నాడు. గత ఏడాది డబుల్స్‌లో ఇలాంటి పరిస్థితులు ఎదురైనపుడు మహేష్ భూపతి స్ఫూర్తితో ఆడిన భారత జోడీ ఆసియా/ఓసియానా గ్రూప్-1లో చైనాపై 3-2 తేడాతో పైచేయి సాధించింది. శనివారం కూడా అలాంటి క్లిష్ట పరిస్థితు లు ఎదురయ్యే అవకాశం ఉండడంతో భారత ఆటగాళ్లపై వత్తిడి పెరగవచ్చునని, అయినా చైనాపై ఎదురైన ఫలితం మళ్లీ ఇపుడు పునరావృతం కావొచ్చునని మహేష్ భూపతి అభిప్రాయపడ్డాడు. అయితే, చైనా ఆటగాళ్ల కంటే ఇటలీ ఆటగాళ్లు చాలా బలమైనవారని, అయినా భారత జట్టు గెలుపుపై తమకు అంచనాలు ఉన్నాయని పేర్కొన్నాడు.

అమ్మాయిలూ ఓడారు!

• న్యూజిలాండ్‌తో చివరి వనే్డలో మిథాలీ సేన పరాజయం

• 2-1తో సిరీస్ భారత్ వశం • మంధానకు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్



మిథాలీ రాజ్

హామిల్టన్, ఫిబ్రవరి 1: వరుసగా రెండు వనే్డల్లో రాణించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకున్న టీమిండియా మహిళా జట్టు, శుక్రవారం జరిగిన నామమాత్రపు మ్యాచ్‌లో పరాజయం పాలైంది. అంతకుముందు టాస్ గెలిచిన న్యూజిలాండ్ మహిళల జట్టు భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. భారత ఓపెనర్లు జెమీమా, స్మృతి మంధాన నెమ్మదిగా ఇన్నింగ్స్ ప్రారంభించినా, స్మృతి మంధాన (1)ని అన్నా పీటర్‌సన్ సింగిల్ డిజిట్‌కే పెవిలియన్‌కు పంపింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన దీప్తి శర్మతో కలిసి మరో ఓపెనర్ జెమీమా (12) స్కోరు బోర్డును పరుగెత్తించే క్రమంలో తహుహు బౌలింగ్‌లో అమేలియాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత దీప్తి శర్మకు తోడైన కెప్టెన్ మిథాలీ రాజ్ 28 బంతులాడి కేవలం 9 పరుగులు మాత్రమే చేసి కాస్పర్క్ బౌలింగ్‌లో పర్కిన్స్‌కు క్యాచ్ ఇచ్చింది. 39 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయినా మరోవైపు దీప్తి శర్మ స్కోరు బోర్డును పరుగెత్తించే బాధ్యత తీసుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్‌తో కలిసి చూడచక్కని బౌండరీలతో అలరించింది. కొద్దిసేపటికే హర్మన్‌ప్రీత్ (24) అన్నా పీటర్‌సన్ బౌలింగ్ వికెట్ల ముందు దొరికిపోయింది. ఈ క్రమంలో దీప్తీ శర్మ (52) రైండా అన్నా పీటర్‌సన్ బౌలింగ్‌లోనే అవుటయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ధనియా భటియా (0), షికా పాండే (8), ఏక్తా బిష్ట్ (3), పూనమ్ పాండే (1), జులన్ గోస్వామి (12) నాటౌట్ పెద్దగా రాణించకపోవడంతో 44 ఓవర్లలో 149 పరుగులకే భారత్ కుప్పకూలింది. న్యూజిలాండ్ బౌలర్లలో అన్నా పీటర్‌సన్ నాలుగు, లియా తహుహు మూడు, అమేలియా కెర్ 2, లిఘా కాస్పర్క్ 1 వికెట్ తీసుకున్నారు. 150 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ మొదటి నుంచి ధాటిగా ఆడేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో లారెన్ డాన్ (10)ని గోస్వామి రనౌట్ చేయడంతో కివీస్ మొదటి వికెట్‌ను కోల్పోయింది. ఆ క్రీజులోకి వచ్చిన అమీ సట్టేర్త్‌వైట్‌తో కలిసి మరో ఓపెనర్ సుజీ బేట్స్ వేగంగా పరుగులు రాబట్టింది. ఈ క్రమంలో వీరిద్దరూ అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం బేట్స్ (57)ను పూనమ్ పాండే బౌల్ చేసింది. దీంతో క్రీజులోకి వచ్చిన సోఫీ డివైన్ (17)తో కలిసి అమీ సట్టేర్త్‌వైట్ (66) మరో వికెట్ పడకుండా కేవలం 29.2 ఓవర్లలోనే జట్టును గెలిపించారు. భారత బౌలర్లలో పూనమ్ పాండేకు మాత్రమే వికెట్ లభించింది. సిరీస్‌ను భారత్ 2-1తో గెలుచుకుంది. సిరీస్‌లో రాణించిన స్మృతీ మంధానకు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ దక్కింది.

మిథాలీ @ 200

చిన్న వయసులోనే క్రికెట్‌లో ఆరంగేట్రం చేసి ఎన్నో ఘనతలు అందుకున్న టీమిండియా ఉమెన్స్ కెప్టెన్ మిథాలీ రాజ్ మరో రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ప్రపంచ మహిళా క్రికెట్‌లో 200వ వనే్డ ఆడి ఈ ఘనత సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. న్యూజిలాండ్‌తో శుక్రవారం జరిగిన మూడో వనే్డలో ఈ మార్క్‌ను చేరుకుంది. 36 ఏళ్ల మిథాలీ రాజ్ వనే్డల్లో 51.33 సగటుతో 6622 పరుగులు చేసింది. భారత్ ఇప్పటివరకు 263 వనే్డలు ఆడగా, 200 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించింది. 200వ మ్యాచ్ సందర్భంగా పలువురు మిథాలీని అభినందించారు. కాగా, చివరి వనే్డలో మిథాలీరాజ్ 28 బంతులు ఎదుర్కొని 9 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచింది.

ఆస్ట్రేలియా భారీ స్కోరు

• సెంచరీలతో రాణించిన జో బర్న్స్, హెడ్

• శ్రీలంకతో రెండో టెస్టు

కాన్‌బెర్రా, ఫిబ్రవరి 1: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు మొదటిరోజు ఆస్ట్రేలియా భారీ స్కోరు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నాలుగో ఓవర్‌లోనే ఓపెనర్ మార్కస్ హారిస్ (11) వికెట్‌ను కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఉస్మాన్ ఖాజా (0), మమ్నస్ లాబుస్‌చెంజ్ (6) తక్కువ పరుగులకే పెవిలియన్‌కు చేరడంతో మూడు వికెట్లు కోల్పోయి, 28 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ట్రావిస్ హెడ్‌తో కలిసి మరో ఓపెనర్ జో బర్న్స్ స్కోరు బోర్డును పరుగులెత్తించారు. ఈ క్రమంలోనే సెంచరీ సాధించారు. ఆ తర్వాత హెడ్ (161) విశ్వఫెమండో బౌలింగ్ ఎల్బీగా అవుటవడంతో వీరి భాగస్వామ్యానికి తెరపడింది. వీరిద్దరూ కలిసి 308 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. మరోవైపు క్రీజులోకి వచ్చిన కర్టిస్ ప్యాటర్‌సన్ (25)తో కలిసి జో బర్న్స్ (172) క్రీజులోనే ఉండడంతో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా నాలుగు వికెట్లు కోల్పోయి 383 భారీ స్కోరును సాధించింది. శ్రీలంక బౌలర్లలో విశ్వఫెమండో మూడు, చమిక కరుణరత్నేకు ఒక వికెట్ దక్కింది.

113 రోజుల తర్వాత సెంచరీ

113 రోజుల తర్వాత ఆస్ట్రేలియా తరపున సెంచరీ నమోదు కావడం విశేషం. ఇటీవల భారత్‌తో టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్లు ఒక్క సెంచరీ కూడా నమోదు చేయకపోవడం విశేషం. చివరిగా గతేడాది అక్టోబర్‌లో దుబాయి వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఉస్మాన్ ఖాజా (141) సెంచరీ సాధించాడు. జట్టు తరపున ఒక్క సెంచరీ నమోదు చేయడానికి మూడు నెలల సమయం పట్టడం ఆస్ట్రేలియాకు ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

స్కోరు బోర్డు..

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మార్కస్ హారిస్ (సీ) కరుణరత్నే (బీ) విశ్వఫెమండో 11, జో బర్న్స్ (బ్యాటింగ్) 172, ఉస్మాన్ ఖాజా (సీ) కుశల్ మెండీస్ (బీ) విశ్వఫెమండో 0, మమ్నస్ లాబుస్‌చెంజ్ (సీ) డిక్వెల్లా (బీ) కరుణరత్నే 6, ట్రావిస్ హెడ్ (ఎల్‌బీ) (బీ) విశ్వఫెమండో 161, కర్టిస్ ప్యాటర్‌సన్ (బ్యాటింగ్) 25.

ఎక్స్‌ట్రాలు: 9, **మొత్తం:** 384 (87 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి..)

బౌలింగ్: కసున్ రజిత 20-5-67-0, విశ్వఫెమండో 20-2-99-3, చమిక కరుణరత్నే 14-0-87-1, దిల్‌రువాన్ పెరేరా 19-0-90-0, ధనుంజయ డిసిల్వా 14-2-40-0.

బులియన్

ముంబయిలో		హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)		**బంగారం (22 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,249.00	1 గ్రాము:	రూ. 3,168.00
8 గ్రాములు:	రూ.25,992.00	8 గ్రాములు:	రూ. 25,344.00
10 గ్రాములు:	రూ. 32,490.00	10 గ్రాములు:	రూ. 31,680.00
100 గ్రాములు:	రూ.3,24,900.00	100 గ్రాములు:	రూ. 3,16,800.00
బంగారం (24 క్యారెట్స్)		**బంగారం (24 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,409.00	1 గ్రాము:	రూ. 3,380.00
8 గ్రాములు:	రూ. 27,272.00	8 గ్రాములు:	రూ. 27,040.00
10 గ్రాములు:	రూ. 34,090.00	10 గ్రాములు:	రూ. 33,800.00
100 గ్రాములు:	రూ. 3,40,900.00	100 గ్రాములు:	రూ. 3,38,000.00
వెండి		**వెండి**	
8 గ్రాములు:	రూ. 331.60	8 గ్రాములు:	రూ. 331.60
10 గ్రాములు:	రూ. 414.50	10 గ్రాములు:	రూ. 414.50
100 గ్రాములు:	రూ. 4,145.00	100 గ్రాములు:	రూ. 4,145.00
ఒక కిలో:	రూ. 41,450.00	ఒక కేజీ:	రూ. 41,450.00

రెడ్డీ ల్యాబ్స్ త్రైమాసిక లాభాలు రూ.485 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 1: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ శుక్రవారం త్రైమాసిక లాభాలను వెల్లడించింది. పన్నుల చెల్లింపుల అనంతరం దాదాపు 45 శాతం వృద్ధితో గత డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలంలో 485 కోట్ల రూపాయల లాభాలను ఆర్జించినట్టు సంస్థ వెల్లడించింది. గత యేడాది ఇదే కాలంలో రూ.334 కోట్ల రూపాయలు లాభాలు వచ్చాయని తెలిపింది. అలాగే ఈ త్రైమాసికంలో సంస్థకు రూ.3,850 కోట్ల ఆదాయం వచ్చిందని, గత ఇదే త్రైమాసికంలో రూ.3.806 కోట్ల ఆదాయం వచ్చినట్లు కంపెనీ సీఈఓ, కో చైర్మన్ జీవీ ప్రసాద్ తెలిపారు. భారతీయ మార్కెట్లలో వస్తున్న సానుకూల వైఖరి తోబాటు, కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలకు ఊతం లభించడం, ధరల విషయంలోప్రోత్సాహం తమ కంపెనీ స్థిరమైన వృద్ధికి, ఆర్థికాభివృద్ధికి దోహదం చేశాయని ఆయన చెప్పారు. అంతర్జాతీయ జనరిక్ విభాగాల నుంచి ఈ త్రైమాసికంలో ఆదాయం రూ.3,135 కోట్లు వచ్చిందని, ఇయర్ ఆన్ ఇయర్ పద్ధతిలో ఈ ఆదాయం 4 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. అయితే తమ కంపెనీకి ఉత్తర అమెరికా నుంచి వచ్చే ఆదాయంలో మాత్రం 8 శాతం తగ్గిందని గతంలో ఇదే త్రైమాసికంలో రూ.1,607 కోట్ల ఆదాయం రాగా తాజా త్రైమాసికంలో 1,480 కోట్లకు తగ్గిందని ప్రసాద్ వివరించారు. పార్మాస్యూటికల్ సర్వీసెస్, ఆక్టివ్ ఇన్‌గ్రిడియంట్స్ నుంచి రూ.594 కోట్లు వచ్చిందని ఇది గత ఇదే త్రైమాసికంతో పోలిస్తే 9శాతం అధికమని తెలిపారు.



'ది కాఫీ చైన్'లో భాగంగా లెగో పాప్-అప్ కేఫ్‌ను లండన్‌లో ప్రారంభిస్తున్న హాలీవుడ్ స్టార్లు క్రిస్ ప్రాట్, టిఫానీ హాడిష్. 'ది లెగో మూవీ-2' సినిమాను పాప్ అప్ కఫే స్పాన్సర్ చేస్తున్నది. అదే విధంగా యూనిసెఫ్‌తో కలిసి వివిధ సమస్యలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నది.

ఆర్బీఐ నుంచి రూ.28 వేల కోట్ల మధ్యంతర డివిడెండ్

• కేంద్ర ప్రభుత్వ అంచనా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిజర్వు బ్యాంకు నుంచి 28వేల కోట్ల మధ్యంతర డివిడెండ్ కేంద్ర ప్రభుత్వానికి వస్తుందని ఆశిస్తున్నట్టు ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి ఎస్‌సీ గార్గ్ శుక్రవారం నాడిక్కడ వెల్లడించారు. ఇప్పటికే 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 40 వేల కోట్ల రూపాయలు ఆర్బీఐ నుంచి కేంద్రం అందుకోవడం జరిగిందని కేంద్ర మధ్యంతర బడ్జెట్ సమావేశాల అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ గార్గ్ తెలిపారు. కాగా తదుపరి మధ్యంతర డివిడెండ్‌పై వచ్చే బోర్డు సమావేశంలో రిజర్వు బ్యాంకు అధికారులు నిర్ణయం తీసుకుంటారని ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు.

బీఎస్‌ఈ సరికొత్త యాప్

• ప్రభుత్వ సెక్యూరిటీల వేలాల్లో పెట్టుబడిదారులు
• నేరుగా పాల్గొనేందుకు దోహదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ప్రభుత్వం నిర్వహించే వేలం పాటల్లో రీటైల్ ఇన్వెస్టర్లు నేరుగా పాల్గొనేందుకు వీలుగా భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) నిర్వహించే ప్రభుత్వ సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్లుల విషయంలో సహాయకారిగా ఉండేందుకు బీఎస్‌ఈ సరికొత్త యాప్‌ను శుక్రవారం ఆవిష్కరించింది. ఇప్పటి వరకు బీఎస్‌ఈ రిజిస్ట్రర్ట్ వ్యాపార సభ్యుడి సహాయంతోనే రీటైల్ ఇన్వెస్టర్లు ఈ వేలంలో పాల్గొనే అవకాశం ఉండేది. ఇకపై బీఎస్‌ఈ యాప్ సాయంతో వీరు నేరుగా వేలంలో పాల్గొన వచ్చని ఆ స్టాక్ ఎక్ఛేంజ్ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే మూలధన మార్కెట్‌లోట్రెజరీ బిల్లుల ట్రేడింగ్ (టీ-బిల్స్)ను ఎక్ఛేంజ్ పర్యవేక్షిస్తుంది. సెంకడరీ మార్కెట్‌లో టీ బిల్లుల ట్రేడింగ్ వల్ల తమకు లాభదాయకంగా లేని ఫార్మేట్ల నుంచి ఇన్వెస్టర్లు వైదొలిగేందుకు వీలుకలుగుతుందని బీఎస్‌ఈ తెలిపింది. కాగా గత నెలలో బీఎస్‌ఈ-డైరెక్ట్‌ను బీఎస్‌ఈ ఆవిష్కరించింది. ఇది ఇన్వెస్టర్లకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో(జీ-సెక్‌లు) ఆన్‌లైన్ బిడ్డింగ్, బిల్లులకు అనువుగా ఉంది. ఈ వేదిక ద్వారా వినియోగదారుడికి స్నేహపూర్వక వాతావరణంతోబాటు 24 ఇంటు 7 బిడ్డింగ్‌కు వీలవుతుంది. అలాగే పెట్టుబడిదారుల నుంచి బిడ్డింగులను తీసుకునేందుకు సైతం దోహదం చేస్తోంది. అలాగే ఇన్వెస్టర్లు తమ బ్యాంకు ఖాతాల నుంచి నేరుగా ఎక్స్ఛేంజికి ఎలక్ట్రానిక్ విధానం ద్వారా చెల్లింపులు చేసి, సెక్యూరిటీలను తమకు నష్టం కలిగించే అకౌంట్ల ముందస్తు కేటాయింపుల నుంచి తీసుకునేందుకు వీలుంటుంది. సాధారణంగా ప్రభుత్వ సెక్యూరిటీలు రిస్క్ లేని పెట్టుబడులకు, స్వల్ప, దీర్ఘకాల ఆదాయాలకు వీలుకల్పిస్తాయి.

వాణిజ్యభూమి

స్టాక్ మార్కెట్‌లో సానుకూలత

212 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబయి, ఫిబ్రవరి 1: కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ప్రభావం స్టాక్ మార్కట్‌లో సానుకూల వాతావరణాన్ని సృష్టించింది. నష్టాలు తప్పవేమోనన్న అనుమానాలతో మొదలైన ట్రేడింగ్ చివరికి 212.74 పాయింట్లు పెరిగి, 36,469.43 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 62.70 పాయింట్లు పెరగడంతో 10,893.65 పాయింట్లకు చేరింది. మార్కెట్‌లో లావాదేవీలు మొదలైప్పుడు వివిధ కంపెనీల షేర్లకు భారీగా డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా సెనె్సక్స్ 500 పాయింట్లకుపైగా ర్యాలీని కొనసాగించింది. కానీ, మధ్యంతర బడ్జెట్‌లోని అంశాలు తెలుస్తున్న కొద్దీ అమ్మకాల జోరు పెరిగింది. దీనితో సాయంత్రానికి స్టాక్ మార్కెట్ పతనం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమైంది. కానీ, క్రమంగా కోలుకున్న మార్కెట్ లాభాలతో ముగిసింది. ఆటోమొబైల్‌తోపాటు వినియోగ వస్తువుల కంపెనీలకు చెందిన వాటాలు లాభాల్లో ట్రేడయ్యాయి. పన్ను ఆదాయ పరిమితిని గోయల్ రెట్టింపు చేస్తూ, ఐదు లక్షల రూపాయలుగా ప్రకటించడంతో, స్టాండర్డ్ డిడక్షన్ 40,000 నుంచి 50,000 రూపాయలకు పెరిగింది. ఈ ప్రతిపాదన 2019-20 ఆర్థిక సంవత్సరంలో, దేశ వ్యాప్తంగా కనీసం మూడు కోట్ల మంది మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు లబ్ధి చేకూర్చనుంది. ముందుగా ఊహించిన విధంగానే రైతులకు గోయల్ పెద్దపీట వేశారు. ప్రధాన మంత్రి కిసార్ సమ్మాన్ నిధి కింద ఏటా 6,000 రూపాయల మొత్తాన్ని రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుందని ప్రకటించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్రం పలు పలు సంక్షేప పథాలను ప్రకటిస్తుందని తెలిసినప్పటికీ, మధ్యంతర బడ్జెట్ వల్ల మార్కెట్‌లో ప్రతికూల ప్రభావం కనిపించకపోవడం విశేషం. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 3.3 శాతంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సర ద్రవ్యలోటు ఉంటుందని గోయల్ తన ప్రసంగంలో స్పష్టం చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇది కొంత వరకూ తగ్గి, 3.3 శాతంగా నమోదవుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం తీసుకుంటున్న చర్యల వల్ల ద్రవ్య లభ్ధత పెరుగుతుందని అన్నారు. కాగా, మధ్యంతర బడ్జెట్ పట్ల వ్యాపార, పారిశ్రామిక వర్గాల్లో ఎక్కువ శాతం మంది సానుకూలంగా స్పందించడం విశేషం. మొత్తం మీద మధ్యంతర బడ్జెట్ నేపథ్యంలోనూ స్టాక్ మార్కెట్‌లో ప్రతికూల ధోరణులు కనిపించలేదు. ముంబయి స్టాక్ ఎక్ఛేంజ్ (బీఎస్‌ఈ)లో జరిగిన లావాదేవీల్లో హీరో మోటార్స్ (7.48 శాతం), మారుతీ సుజికీ (4.96 శాతం), హెచ్‌సీఎల్ టెక్ (3.86 శాతం), ఏషియన్ పెయింట్స్ (3.14 శాతం), బజాజ్ ఫైనాన్స్ (2.23 శాతం) వాటాలు లాభపడ్డాయి. వేదాంత దారుణంగా నష్టపోయింది. ఈ కంపెనీ షేర్లు 17.82 శాతం నష్టాలను ఎదుర్కొన్నాయి. ఎస్ బ్యాంక్ 4.45 శాతం, ఎస్‌బీఐ 3.08, ఐసీఐసీఐ బ్యాంక్ 2.68 శాతం, యాక్సిస్ బ్యాంక్ 0.91 శాతం చొప్పున నష్టాలను చవిచూశాయి. అదేవిధంగా నిఫ్టీ పెరుగుదలలో హీరో మోటార్స్ 7.54, మారుతీ సుజికీ 4.35 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 3.62 శాతం, ఇచర్ మోటార్స్ 3.60 శాతం, డాక్టర్ రెడ్డీస్ 3.32 శాతం లాభాలను సంపాదించాయి. కాగా, వేదాంత షేర్ల జాతీయ స్టాక్ ఎక్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ)లోనూ పతనం తప్పలేదు. ఈ కంపెనీ వాటాలు 18.12 శాతం నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. జీ ఎంటర్‌టైన్‌మెంట్ 7.26 శాతం, ఎస్ బ్యాంక్ 4.53 శాతం, ఎస్‌బీఐ 3.76 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 3.05 శాతం నష్టాలను ఎదుర్కొన్నాయి.

ఆసియన్ మార్కెట్లకు మిశ్రమ ఫలితాలు

• ఎలాంటి ఒప్పందాల్లేకుండా ముగిసిన అమెరికా-చైనా వాణిజ్య చర్చలు

హాంగ్‌కాంగ్, ఫిబ్రవరి 1: అమెరికా-చైనా మధ్య సాగుతున్న వాణిజ్య యుద్ధానికి స్వస్థి పలికేందుకు ఇరు దేశాలూ సాగిస్తున్న చర్చలు శుక్రవారం సైతం ఓ కొలిక్కి రాలేదు. ఎలాంటి ఒప్పందాలూ జరకుండానే ఈ చర్చలు ముగిశాయి. ఈ శిఖరాగ్ర చర్చలు తదుపరి కూడా కొనసాగించాలని ఇరుదేశాలూ తీర్మానించాయి. ఈక్రమంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించడంతో ఆసియన్ మార్కెట్లు శుక్రవారం మిశ్రమ ఫలితాలనే అందుకున్నాయి. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఈ చర్చలు ముగిసిన అనంతరం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ చర్చల్లో 'అద్భుత ప్రగతి జరిగింద'ని వ్యాఖ్యానించారు. ఐతే ఈ రెండు అతిపెద్ద ఆర్థిక శక్తుల మధ్య చర్చలకు మార్చి 1 మాత్రమే డెడ్‌లైన్ అన్న విషయాన్ని మరువరాదన్నారు. అమెరికాలో అమ్మకాలు జరిగే చైనాకు చెందిన అనేక వస్తువులపై బిలియన్ల డాలర్ల కొద్దీ సుంకాన్ని విధించేందుకు అప్పటి వరకు గడువుఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే చైనా రాజధాని బీజింగ్ సైతం దీనిపై స్పందిస్తూ 'చర్చలు విస్పష్టంగా, ఫలవంతంగా సాగుతున్నాయ'ని వ్యాఖ్యానించింది. మేధోసంపత్తి (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ) విషయంలో పరస్పర సహకారానికి అంగీకారం కుదిరిందని పేర్కొంది. అలాగే అమెరికా వస్తువుల దిగుమతికి సైతం ఒప్పందం కుదిరిందని స్పష్టం చేసింది. ఈ అంశాలపైనే ట్రంప్ ప్రధానంగా చైనాపై గుర్రుగా ఉన్నారు. ఈనెలలో త్వరలో అమెరికా ఆర్థిక శాఖకు చెందిన ఇద్దరు ఉన్నతాధికారులు బీజింగ్‌ను సందర్శిస్తారని, తదుపరి ఈ చర్చలకు ముగింపుగా తాను చైనా అధ్యక్షుడు గ్జి జింగ్‌పింగ్‌ను కలుస్తానని ట్రంప్ చెప్పారు. ఇలావుండగా శుక్రవారం చర్చలు ముగిసిన అనంతరం ఒయాండాకు చెందిన సీనియర్ మార్కెట్ విశ్లేషకుడు జఫ్రీ హేల్లీ మాట్లాడుతూ ఈ చర్చలపై ఎలాంటి తుదినిర్ణయాలూ జరగలేదన్న అంశం మార్కెట్ సెంటిమెంటుపై ప్రభావం చూపుతోందన్నారు. తొలుత సానుకూలంగా మొదలైన ఆసియన్ మార్కెట్లు వృద్ధిని నమోదు చేసినప్పటికీ తదుపరి మిశ్రమ ఫలితాలతోనే ముగిశాయన్నారు. టోక్యో మార్కెట్లు 0.1 శాతం అదనపులాభాలు సంతరించుకోగా హాంగ్‌కాంగ్ మార్కెట్లు స్వల్పంగా నష్టపోయాయి. షాంఘాయ్ మార్కెట్లు మాత్రం సంతృప్తికరమైన 1.3 శాతం లాభాల వృద్ధిని నమోదు చేశాయి. పెట్టుబడులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నిబంధనలను అమెరికా-చైనా సరళతరం చేయడం పట్ల షాంఘాయ్ వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్‌ఎస్‌ఈ వస్తూత్పత్తి విభాగంలో కొత్తగా మూడు సరఫరా కేంద్రాలు


• ముంబయి, చెన్నై, ఢిల్లీల్లో ఆరంభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: వస్తూత్పత్తి విభాగంలో దేశంలో మూడు సరికొత్త సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జాతీయ స్టాక్ ఎక్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) తెలిపింది. ముంబయి, చెన్నై, ఢిల్లీల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. పాన్ ఇండియా సరఫరా వ్యవస్థను మరింత సౌకర్యవంతం చేయడంలో భాగంగా ఈ సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎన్‌ఎస్‌ఈ ఓ ప్రకటనలో తెలిపింది. గతంలో బులియన్ కాంట్రాక్టులకు సంబంధించిన సెటిల్మెంట్ విభాగంలో అహ్మదాబాద్‌ను మాత్రమే ప్రధాన సరఫరా కేంద్రంగా పరిగణించేవారు. కాగా కొత్తగా మూడు సరఫరా కేంద్రాలను జనవరి 25న ప్రారంభించినట్టు ఎన్‌ఎస్‌ఈ తెలిపింది. సరఫరాకు, వినిమయానికి మధ్య ఉన్న దూరాన్ని భర్తీచేసే వారధిలా పనిచేసే ఈ కేంద్రాల ఏర్పాటు చుంతోషంగా ఉందని, ఆయా ప్రాంతాల్లోని నియంత్రిత ధరను కల్పిస్తాయని తెలిపింది.

వెనక్కి వెళ్లం

• ఈవీఎంలతోనే ఓటింగ్

• తేల్చిచెప్పిన కేంద్ర ఎన్నికల సంఘం



కోల్‌కొతా, ఫిబ్రవరి 1: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంల ద్వారానే ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని, ఎటువంటి పరిస్థితుల్లో బ్యాలెట్ పత్రాల విధానానికి వెళ్లే ప్రసక్తిలేదని కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ సునీల్ ఆరోరా చెప్పారు. ఈవీఎంల పనితీరుపై ప్రతిపక్ష పార్టీలు సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. బ్యాలెట్ పత్రం విధానానికి వెళ్లే అవకాశం లేదన్నారు. రెండు దశాబ్ధాలుగా ఈవీఎంలు పనితీరు సంతృప్తిగా ఉందన్నారు. ఈవీఎంల విధానమే కొనసాగుతుందన్నారు.రాజకీయ పార్టీలకు తమ అభిప్రాయాలను తెలియచేసే హక్కు ఉంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీలే భాగస్వాములని, అందుకే వారికి అనుమానాలను తెలియచేసే హక్కు ఉంటుందన్నారు. బ్యాలెట్ పేపర్ రోజులకు ఎన్నికల సంఘం వెళ్లడం లేదన్నారు. బ్యాలెట్ పత్రాల రోజుల్లో వాటిని ఎత్తుకుని వెళ్లేవారని, బాక్స్‌లను కండ బలంతో దొంగిలించుకుని తీసుకెళ్లేవారన్నారు. కౌంటింగ్‌లో అసాధారణజాప్యం జరిగేదన్నారు. వచ్చే ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావశానికి ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా, డిప్యూటీ ఎన్నికల సంఘం కమిషనర్ ఉమేష్ సిన్హా, సందీప్ సక్సేనా, సుదీప్ జైన్, చంద్రభూషణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ గత నెలలో జరిగిన విపక్ష నేతల సమావేశంలో అన్ని ప్రతిపక్ష పార్టీలనేతలు ఈవీఎంల స్థానంలో పాత పద్ధతిలో బ్యాలెట్ పత్రాల విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు.

ఈవీఎంల పనితీరులో ఎటువంటి లోపాలు లేవని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని సునీల్ ఆరోరా చెప్పారు. టాంపరింగ్ వేరు, పనిచేయకపోవడం వేరు అని ఆయన చెప్పారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడం అనేది ఒక తప్పుడు ఆరోపణ అన్నారు. ఉన్నత స్థాయి భద్రత మధ్య ఈవీఎంలను తయారు చేస్తారన్నారు. వోటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్‌ను కూడా విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. పశ్చిమబెంగాల్‌లోని మూడు ఉప ఎన్నికల్లో వీవీప్యాట్‌లను ఉపయోగించినట్లు ఆయన చెప్పారు.

సందేహాలు తీర్చండి

ఈవీఎంల పనితీరుపై విపక్షాల అనుమానం

• సోమవారం ఈసీని కలవాలని నిర్ణయం

• ప్రధాని మోదీ అవినీతిపై సర్జికల్ స్ట్రైక్స్ చేస్తాం

• ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల పనితీరుపై తమకు ఉన్న అనుమానాలను, సందేహాలను నివృత్తి చేయాలని ఎన్నికల సంఘాన్ని కలిసి కోరాలని ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. వచ్చే సోమవారం విపక్ష పార్టీల నేతలు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలవనున్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ విపక్ష పార్టీల సమావేశంలో ఈవీఎంల పనితీరుపై కూలంకషంగా చర్చించినట్లు చెప్పారు. మొత్తం మూడు అంశాలను ఈ సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. ఉద్యోగాలు, వ్యవసాయం, వ్యవస్థలను నిర్వీర్యం చేసే విధంగా చర్యలు తీసుకోనడంపై చర్చించినట్లు చెప్పారు. రాఫెల్ డీల్ కొనుగోళ్లపై ప్రధాన మంత్రి కార్యాలయం అవినీతిని ఎండగట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. రాఫెల్ కొనుగోళ్ళ, నిరుద్యోగం రేటు పెరుగుదల, పెద్ద నోట్ల రద్దుపై కేంద్రప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ సర్జికల్ స్ట్రైక్స్ చేస్తామన్నారు. ప్రపంచంలో రెండు, మూడు దేశాల్లో మాత్రమే ఈవీఎంలను ఎన్నికల్లో ఉపయోగిస్తున్నారన్నారు. చాలా దేశాలు బ్యాలెట్ పత్రాల వ్యవస్థ వైపు మొగ్గుచూపాయన్నారు. చాలా చోట్ల ఈవీఎంల పనితీరులో లోపాలు తలెత్తుతున్నాయన్నారు. పేపర్ ట్రైల్‌కు సంబంధించి ఓట్లను కనీసం 50 శాతం బూత్‌స్‌లో లెక్కించేటట్లు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరనున్నట్లు రాహుల్ గాంధీ చెప్పారు. ఈ సమావేశంలో ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఓమర్ అబ్దుల్లా, సమాజ్‌వాదీ పార్టీ ప్రతినిధి రామ్ గోపాల్ యాదవ్, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి సతీష్ చంద్ర మిశ్రా, డీఎంకే అధ్యక్షుడు కనిమోజీ, తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధి డీరక్ బ్రైన్, సీపీఐ నుంచి డీ రాజా, సీపీఎం నుంచి టీకే రంగరాజన్, రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ నుంచి మనోజ్ ఝా, కాంగ్రెస్ నుంచి అహ్మద్ పటేల్, గులాం నబీ ఆజాద్, మల్లికార్జున్ ఖర్గే, ఏకే ఆంటోనీ, జేడీఎస్ నుంచి దానిష్ అలీ, శరద్‌పవార్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు విడుదల

• మే నెల కోటా కింద 70,786


ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, ఫిబ్రవరి 1: భక్తుల సౌకర్యార్థం ప్రతి నాలుగు నెలలకు ముందు టీటీడీ ఆన్‌లైన్లో విడుదల చేసే సేవా టికెట్లలో భాగంగా మే నెల కోటా కింద 70, 786 శ్రీవారి ఆలయంలో జరిగే వివిధ ఆర్జిత సేవా టికెట్లను విడుదల చేసినట్లు టీటీడీ ఈఓ ఏకే సింఘాల్ తెలిపారు. శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈఓ కార్యక్రమం సందర్భంగా ఈ సేవా టికెట్లు ఆన్‌లైన్లో డిప్ విధానంలో 11,486 సేవా టికెట్లును విడుదల చేశామన్నారు.

ఇందులో సుప్రభాతం 8,091, తోమాల సేవ 140, అర్చన 140, అష్టదళ పాదపద్మారాధన 240, నిజపాద దర్శనం 2,875 టికెట్లు ఉన్నాయని ప్రకటించారు. ఆన్‌లైన్ జనరల్ కేటగిరిలో 59,300 సేవా టికెట్లు ఉంటాయన్నారు. వీటిలో విశేషపూజ 2000, కల్యాణోత్సవం 14,725, ఊంజల్ సేవ 4650, ఆర్జిత బ్రహ్మోత్సవం 7,425, వసంతోత్సవం 14,300, సహస్ర దీపాలంకరణ సేవ 16,200 టికెట్లు ఉన్నాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తెలుగు విద్యార్థులపై మరో పిడుగు!

• ఆందోళనలో అమెరికా తెలుగు విద్యార్థులు • సీపీటీ పరిశీలన, కేసుల భయం



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: అండర్ కవర్ ఆపరేషన్ నిర్వహించి దేశంలో పెరిగిపోతున్న అక్రమ వలసదారులకు బ్రేక్ వేస్తూ అమెరికా అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో చిక్కుకున్న తెలుగు వారికి మరో చిక్కు వచ్చి పడింది. అమెరికాలో చాలా కాలంగా సీపీటీ, ఓపీటీలో పనిచేస్తున్న వారి డాటాను పున: సమీక్షకు పూనుకుంది. దీంతో అమెరికాలో ఉన్న వేలాది మంది భారతీయులు మరీ ముఖ్యంగా తెలుగువారు తీవ్రమైన ఆందోళనలో పడ్డారు. సీపీటీ రికార్డులు పరిశీలిస్తే తప్పనిసరి ఏదో ఒక రకమైన సమస్య ఎదురుకాకతప్పదని, దాంతో కేసులలో ఇరుక్కోవల్సి వస్తుందని రాజ్యాంగ నిపుణుడు డాక్టర్ మహమ్మద్ ఆదిల్ పేర్కొన్నారు. అమెరికా వెళ్తున్న విద్యార్థులు అక్కడి చట్టాలు, నియమనిబంధనలపై సవ్యమైన అవగాహన లేకపోవడం, కొంత మందికి అవగాహన ఉన్నా ఏం పర్వాలేదనే ఆలోచనతో దూకుడుగా వ్యవహరించడంతో లేనిపోని సమస్యలు వస్తున్నాయని ఆయన విశ్లేషించారు.

అమెరికాలో పని నిబంధనలు, విద్యా నిబంధనలను ఉల్లంఘించడంతో వేలాది మంది విద్యార్థులు జైలుపాలు కావల్సి వస్తోందని డాక్టర్ మహమ్మద్ ఆదిల్ పేర్కొన్నారు. అమెరికాలో ఉన్నత చదువులకు వెళ్లే వారు ఏడాది కాలం గడిచిన తర్వాత మాత్రమే ఏదైనా ఉపాధికి అర్హులని , వారు ఏ చదువు కొనసాగిస్తున్నారో ఆ రంగానికి సంబంధించిన ఉపాధిలో మాత్రమే పార్టు టైమ్, ఫుల్ టైమ్ ఉద్యోగాల్లో చేరవచ్చని ఇందుకోసం వారు కరిక్యులమ్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (సీపీటీ) పొందాల్సి ఉంటుందని ఆయన వివరించారు. వృత్తి, సాంకేతిక కోర్సులు లేదా ఎంబీఏ పూర్తి చేసిన వారు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)కి అర్హులవుతారని , స్టెమ్ కోర్సులు అంటే సైన్స్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, మాథ్స్‌ల్లో నిష్ణాతులు చదువు పూర్తయిన తర్వాత ఓపీటీ ద్వారా మరో 24 నెలల పాటు ఉద్యోగం చేసుకునే వెసులు బాటు ఉంటుందని, అయితే ఈ ప్రక్రియ అంతా అమెరికా ఇమిగ్రేషన్, హోం ల్యాండ్ అధికారుల కనుసన్నలలో జరగాల్సి ఉంటుందని ఆదిల్ చెప్పారు. చదువు పూర్తి చేసిన వారు భారత్ తిరిగి రాకుండా, అమెరికాలోనే ఏదైనా ఉపాధి లేదా ఉద్యోగం కోసం ప్రయత్నించడంతోనే అసలు సమస్యలు వస్తున్నాయి. కొంత మంది విద్యార్థులు చదువుకోసం అమెరికాలో అడుగుపెట్టిన మరు క్షణం నుండే ఉద్యోగ అన్వేషణలో ఉండటం, చదువులను పక్కన పెట్టడం వల్ల కూడా సమస్యలు వస్తున్నాయి. వాస్తవానికి సీపీటీ చేయాలంటే స్కూల్ అధికారి, అమెరికా సిటిజన్‌షిప్ అధికారులతో పాటు ఇమిగ్రేషన్ అధికారులు (యుఎస్‌సీఐఎస్) ఒక సర్టిఫికేట్ జారీ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం పక్కా ఆధారాలతో సవ్యమైన పత్రాలతో ఎస్ఈవీఐఎస్‌లో దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. అలాగే ఓపీటీ పొందాలంటే యుఎస్‌సీఐఎస్‌లో దరఖాస్తు చేయాలి. ఏడాది కాలం చదువు పూర్తి చేసిన వారు సీపీటీకి, చదువు మొత్తం పూర్తయిన వారు ఓపీటీకి దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో మారు చదువు పూర్తికాకపోయినా ఓపీటీకి దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తికాలిక ఉద్యోగాలు చేసిన వారు సీపీటీలో ఏడాది కాలం తర్వాత కొనసాగేందుకు వీలు లేదు, అదే పార్టు టైమ్ ఉద్యోగాలు చేసిన వారు పనిచేసిన కాలానికి లెక్కించి ఏడాది దాటకుండా అమెరికాలో కొనసాగేందుకు వీలుకల్పిస్తారు. పార్టు టైమ్ ఉద్యోగాలు సైతం వారానికి 20 గంటలు మించకుండా పనిచేయాలి, ఒక వేళ ఫుల్‌టైమ్‌లో పనిచేస్తే వారానికి 20 గంటలు మించి పనిచేయవచ్చు. చదువు పూర్తయిన తర్వాత 90 రోజుల్లోపు ఓపీటీకి దరఖాస్తు చేసుకోవాలి. 30రోజుల్లోగా ఉపాధి లేదా ఉద్యోగం సంపాదించుకోలేకపోతే వారు వెనక్కు రావల్సి ఉంటుంది. సీపీటీలో పార్టు టైమ్ ఉద్యోగం చేసినంత కాలం చదువుతో పాటు పని అనుభవం కింద క్రెడిట్ స్కోర్‌ను ఇస్తారు. అదే ఓపీటీలో అలాంటి అవకాశం ఉండదు. ఓపీటీలో కొనసాగాలంటే ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ పొందాల్సి ఉంటుంది. ఉద్యోగం, వేతనం, పనిచేయాల్సిన స్థలం తదితర అంశాలతో ఉన్న ఇబ్బందులతో భారతీయులు, మరీ ముఖ్యంగా తెలుగువారు తాము ఉన్న ప్రాంతంలోనే ఏదో ఒక ఉద్యోగం చేస్తున్నారు. వాస్తవానికి హెచ్-1బీలో ఏ ఉద్యోగం కోసం వెళ్తున్నారో ఆ సంస్థలోనే పనిచేయాల్సి ఉంటుంది. అందులో మార్పులు ఉంటే మరో మారు హెచ్-1బీ వీసాకు దరఖాస్తు చేయాలి, ఈ సమస్యలతో అక్రమ మార్గాలకు తెలుగు వారు అన్వేషిస్తున్నారని డాక్టర్ ఆదిల్ పేర్కొన్నారు.

అరెస్టయిన తెలుగు విద్యార్థులను విడిపించండి

• యూఎస్ కాన్సులేట్‌ను కోరిన కేటీఆర్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: వివిధ కారణాలతో అమెరికాలో అరెస్టు అయిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులను విడిపించేలా కృషి చేయాలని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు యూఎస్ కాన్సులేట్ జనరల్ కేథరిన్ హడ్డాను కోరారు. యూఎస్ కాన్సులేట్ జనరల్ కేథరిన్ హడ్డాను శుక్రవారం కేటీఆర్ కలిసి ఈ మేరకు కోరారు. నకిలీ యూనివర్సిటీ మోసంలో చిక్కుకున్న తెలుగు విద్యార్థుల గురించి కేటీఆర్ చెప్పారు. వెంటనే యూఎస్ ప్రభుత్వంతో చర్చించి విడిపించాలని ఆయన కోరారు. నకిలీ పత్రాలతో చదువు కోసం అమెరికాకు వెళ్ళి అక్కడ ఉద్యోగాలు చేస్తున్న విద్యార్థులను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. వారిలో తెలుగు వారు ఉండడంతో కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి

అమెరికాలో అరెస్టు అయిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులను విడిపించేందుకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కోరారు.

ద.మ. రైల్వే అభివృద్ధికి భారీగా నిధులు



సికింద్రాబాద్ రైల్ నిలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న ద.మ. రైల్వే అదనపు జీఎం జాన్ థామస్, సీపీఆర్‌వో రాకేష్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ద.మ. రైల్వేకి భారీగా నిధులు విడుదల చేయడం పట్ల అధికారులు హర్షం వెలిబుచ్చారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ద.మ. రైల్వేకి విడుదల చేసిన నిధులు సంతృప్తికరంగా ఉన్నాయని డివిజన్ అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్ అన్నారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు కేంద్రం ప్రకటించిన నిధుల వివరాలను మీడియాకు వివరించారు. 2019- 2020 ఆర్థిక సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వేలో మౌలిక వసతులకు కేంద్రం పెద్దపీట వేసిందని ప్రశంసించారు. మౌలిక వసతుల కోసం దాదాపు 5,752 కోట్ల రూపాయలు వెచ్చిస్తామని చెప్పారు. తెలుగు రాష్ట్రాలో కొత్త రైల్వే మార్గాలను అభివృద్ధి చేయడానికి 834 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామన్నారు. రైల్వే ట్రాక్ సౌకర్యాల కోసం రూ. 138 కోట్ల, డబుల్ లైనింగ్ మార్గం కోసం 1,905 కోట్ల, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కోసం 229 కోట్ల రూపాయల చొప్పున ఖర్చు చేస్తామని చెప్పారు. డివిజన్ పరిధిలో రోడ్ కమ్ బ్రిడ్జి కోసం 397 కోట్లు, బ్రిడ్జి నిర్మాణాల కోసం 52 కోట్లు, రైల్వే ట్రాక్ పునరుద్ధరణ కోసం 657 కోట్లు, రైల్వే ప్లాట్ ఫామ్‌లపై భద్రత కోసం 72.5 కోట్లు, రైల్వేలో వివిధ విభాగాల్లో ఉన్న ఉద్యోగుల శిక్షణ కోసం 17 కోట్లు చొప్పున బడ్జెట్‌ను కేటాయించడం జరిగిందన్నారు. కాగా, తెలంగాణలో మెదక్- అక్కన్నపేట్ రైల్వే లైన్ పూర్తి చేయడానికి 10 కోట్ల రూపాయలు కేటాయించారని వివరించారు. కడప జిల్లా ఓబులవారిపాలెం నుంచి కృష్ణపట్నం మధ్య కొత్తగా రైల్వే లైన్ నిర్మాణం కోసం 30 కోట్లు, మహారాష్ట్ర ముదుకోడ్- పర్భనీ మధ్య డబుల్ లైన్ నిర్మాణం కోసం 35 కోట్లు, ఆంధ్రాలో గుంటూరు- రేపల్లి మధ్య కొత్త రైల్వే మార్గం పూర్తి చేయడానికి 5 కోట్ల రూపాయలు కేటాయించిన విషయాన్ని ఆయన తెలిపారు. అయితే, ఎంఎంటీఎస్ ఫేస్-2 కోసం చాలా తక్కువగా, కేవలం 10 లక్ష రూపాయలను కేటాయించడం ఆశ్చర్యం. కాగా, హైదరాబాద్ పరిధిలో గతంలో చేపట్టిన ట్రాక్ పనులు పూర్తి అయ్యాయని జాన్ థామస్ చెప్పారు. మనోహరాబాద్- కొత్తపల్లి మధ్య పనులతో పాటు గజ్వేల్ వరకు చేపట్టే పనుల కోసం రూ. 200 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. తెలంగాణలో మునీరాబాద్- మహబూబ్‌నగర్ మధ్య పనులు పూర్తి చేయడానికి రూ. 275 కోట్లు, భద్రాచలం- సత్తుపల్లి మధ్యలో కొత్త రైల్వే మార్గం కోసం రూ. 405 కోట్లు, ఖాజీపేట- బలార్ష మధ్య మూడవ లైన్ కోసం రూ. 265 కోట్లు, నడికుడి- శ్రీకాళహస్తి మధ్య లైల్వే మార్గం కోసం రూ. 700 కోట్లు, కడప- బెంగళూరు మధ్య కొత్తగా చేపడుతున్న పనుల కోసం రూ. 210 కోట్లు కేటాయించినట్టు ఆయన పేర్కొన్నారు. గుంతకల్ -కల్లూరు మధ్య డబుల్ లైన్ మార్గం రూ. 15 కోట్లతో పూర్తి చేశామన్నారు. గుంటూరు- గుంతకల్ మధ్య డబుల్ లైన్ మార్గం కోసం రూ. 280 కోట్లు, విజయవాడ- భీమవరం- నిడదవోలు మధ్య డబుల్‌లైన్ కోసం రూ. 175 కోట్లు, కోటిపల్లి- నర్సాపూర్ మధ్య కొత్త లైన్ కోసం రూ. 200 కోట్లు, సికింద్రాబాద్- మహబూబ్‌నగర్ మధ్య డబుల్ లైన్ పూర్తి చేయడానికి రూ. 200 కోట్లు, గుత్తి- ధర్మవరం మధ్య డబుల్‌లైన్ కోసం రూ. 126 కోట్లు, ఖాజీపేట్ - విజయవాడ మధ్య మూడవలైన్ కోసం రూ. 110 కోట్లు, విజయవాడ- గూడూరు మధ్య మూడవ లైన్ కోసం రూ. 350 కోట్లు, ఘట్‌కేసర్ - యాదాద్రి మధ్య ఎంఎంటీఎస్ మూడవ లైన్ కోసం రూ. 20 కోట్ల, రద్దీగా ఉన్న రైల్వే స్టేషన్ల నుంచి బైపాస్ ట్రాక్ నిర్మాణాల కోసం రూ. 143 కోట్లు, చెర్లపల్లి, చెట్టిపల్లిలో కొత్త టెర్మినల్ కోసం రూ. 5 కోట్లు, ఖాజీపేట వర్క్‌షాప్ అభివృద్ధి కోసం రూ. 10 కోట్లు, కర్నూల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయడానకి రూ. 80 కోట్లు, తిరుపతి రైల్వే స్టేషన్ రెండవ మార్గం అభివృద్ధి చేయడానికి రూ. 13 కోట్లు, తిరుపతి సమీపంలో ఉన్న తిరుచానూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయడానికి రూ.6 కోట్లు ఖర్చు చేయనున్నట్లు జాన్ థామస్ చెప్పారు. మీడియా సమావేశంలో ఇతర సీనియర్ అధికారులతోపాటు రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ కూడా పాల్గొన్నారు.

రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న మోదీ

• ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఎన్నికల్లో ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) పనితీరుపై అనుమానాలపై వచ్చే సోమవారం విపక్ష పార్టీల నాయకులతో కలిసి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవనున్నట్టు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఢిల్లీలోని కాన్స్టిట్యూషనల్ క్లబ్‌లో 'సేవ్ డెమాక్రసీ-సేవ్ నేషన్' పేరుతో బీజేపీయేతర విపక్ష పార్టీల సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. తర్వాత ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి, చర్చలు జరిపారు. అనంతరం ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన సామూహిక చేనేత వస్త్రాల ప్రదర్శనను ఆయన సందర్శించారు. ఆతర్వాత చంద్రబాబు విలేఖరులతో మాట్లాడుతూ ఈవీఎం అంశంపై ఈసీతో చర్చలు జరిపిన తర్వాత ఏ విధంగా ముందుకు వెళ్లాలనే విషయంపై నిర్ణయం తీసుకోనున్నట్టు చెప్పారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న రైతుల సమస్యలు, నిరుద్యోగ సమస్య, ఉపాధి కల్పన తదితర అంశాలపై ఈ విపక్ష సమావేశంలో చర్చలు జరిపినట్టు తెలిపారు. కేంద్రం ప్రభుత్వం గత నాలుగేళ్ల కాలంలో రైతుల ఆదాయం ఎక్కడా పెరగలేదని అన్నారు. మోదీ సర్కారు సాధించిన వ్యవసాయ వృద్ధి రేటు కేవలం 2.4 శాతం మాత్రమేనన్నారు. రాజ్యాంగ సంస్థలైన సీబీఐ, ఈడి కూడా మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. విపక్ష పార్టీలు అన్ని కలిసి బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ఓట్ల కోసం వల

• బడ్జెట్‌పై చిదంబరం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఎన్‌డీఏ ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రతిపాదించిన 2019-20 బడ్జెట్ 'ఓట్ ఆన్ అకౌంట్ కాదు అకౌంట్ ఫర్ ఓట్స్' అని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి పీ చిదంబరం విమర్శించారు. ఇది ఓట్ల కోసం చేసిన బడ్జెట్ అని శుక్రవారం ఇక్కడ వ్యాఖ్యానించారు. శుక్రవారం సాయంత్రం ఏఐసీసీలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం బడ్జెట్‌పై విమర్శలు గుప్పించారు. ఆర్థిక శాఖ తాత్కాలిక మంత్రి పియూష్ గోయల్ ప్రతిపాదించిన ఓట్ ఆన్ అకౌంట్‌పై పార్టీ తరపున స్పందిస్తూ ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రతిపాదించవలసిన ఎన్‌డీఏ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రతిపాదించిందని ఆరోపించారు.



ఇది ఎన్నికల బడ్జెట్ : టీడీపీ

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ప్రధాని నరేంద్రమోదీ ఓటమి భయంతోనే బడ్జెట్ తీసుకొచ్చినట్టుందని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ఆరోపించింది. కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2019 మధ్యంతర బడ్జెట్‌పై టీడీపీ పార్లమెంటరీ పార్టీ అసంతృప్తిని వ్యక్తం చేసింది. పార్లమెంట్‌లో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు సుజనా చౌదరి విలేఖరులతో మాట్లాడుతూ 'ఇది కేవలం వచ్చే ఎన్నికల కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించింది'అని విరుచుకుపడ్డారు. బడ్జెట్‌లో పేర్కొన్న అంశాలు ఎన్నికల తాయిలాలుగా ఆయన అభివర్ణించారు.

Printed and Published by T. Venkateswarlu on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor T.V.Ravi Reddy,
PBX 27803930 (6Lines), Editorial: 27805056, Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60

C M Y K

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

శనివారం, 2 ఫిబ్రవరి 2019




శత దళ పరిమళ సంగీత సుమం

★ తరలిరానున్న అతిరథ మహారథులు ★ భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా ఉత్సవాలు ★ 3, 4, 5 తేదీల్లో శతజయంతి ఉత్సవాలు



విజయరామరాజు

దక్షిణ భారతదేశంలో కర్నాటక శాస్త్రీయ సంగీత సాంప్రదాయాన్ని పరిరక్షిస్తూ సంగీత సంపదను తరతరాలకు అందిస్తున్న మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల శతజయంతి వేడుకలను జరుపుకుంటుంది. 1919 ఫిబ్రవరిలో పూసపాటి విజయరామ గజపతిరాజు చేతులమీదుగా నెలకొల్పిన 'విజయరామ గాన పాఠశాల' అంచెలంచెలుగా ఎదిగి అలక్ నారాయణ గజపతిరాజు హయాంలో కళాశాలగా మార్పు చెందింది. దక్షిణ భారతదేశంలోనే తొలి సంగీత, నృత్య కళాశాలగా పేరుగాంచిన ఈ పాఠశాలను కేవలం ఒక అంధ విద్యార్థి కోసం నెలకొల్పారంటే ఆశ్చర్యం కలుగకమానదు. ఆనాడు పూసపాటి విజయరామ గజపతిరాజు తన స్నేహితుడు చాగంటి గంగరాజు కుమారుడు చాగంటి జోగరావు కోసం ఈ పాఠశాలను నెలకొల్పారు. జోగారావు పుట్టుకతో అంధుడు కావడంతో ఆయనకు సంగీతం పట్ల మక్కువ ఉండటాన్ని తండ్రి గంగరాజు గుర్తించి తన స్నేహితుడైన మహారాజు విజయరామరాజును వేడుకోగా అప్పట్లో టౌన్‌హాలుగా ఉన్న దీనిని గాన పాఠశాలగా మార్పు చేశారు.



నేదునూరి కృష్ణమూర్తి

గురువులను మించిన శిష్యులు

విజయనగరం మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఓనమాలు దిద్దిన ఎందరో మహానుభావులు సంగీత ప్రపంచంలో దేశ, విదేశాల్లో కీర్తి శిఖరాలను అందుకున్నారు. ఈ కళాశాలలో సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి, నూకల చినసత్యనారాయణ, ప్రముఖ గాయకులు ఘంటసాల వేంకటేశ్వరరావు, ప్రముఖ గాయని పి. సుశీల, ప్రముఖ దర్శకులు సాలూరు రాజేశ్వరరావు, బి.ఎ. నారాయణ, పవన్, సంతోష్, సాయికుమార్ వంటి వారెందరో ఈ కళాశాలలో విద్య నేర్చుకుని దేశ విదేశాల్లో విజయనగరం ఖ్యాతిని ఇనుమడింపచేసారు. ఈ కళాశాల ఎందరో సినీ సంగీత దర్శకులను, గాయకులకు బతుకునిచ్చింది. సినీ సంగీత సామ్రాజ్యాన్ని ఏలిన ఘంటసాల వెంకటేశ్వరరావు, గాన సరస్వతి పులపాక సుశీల (పి. సుశీల)వంటి ఉద్ధండులు ఈ నేలపై నడిచినవారే. ద్వారం వెంకటస్వామినాయుడు వద్ద శిష్యరికం చేసిన సుశీల 1950 నుంచి 1990 వరకు ఆరు దశాబ్దాల పాటు తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ, మలయాలం, బెంగాలీ, ఒడిషా, సంస్కృతం, తులు, బడగ, సింహాళీ భాషలలో 50వేలకు పైగా గీతాలను ఆలపించారు. 2004లో కన్నడ ప్రభుత్వంచే గాన సరస్వతి అవార్డు, 2008లో భారత్ ప్రభుత్వంచే పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. ప్రముఖ కర్ణాటక విద్వాంసులు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత నూకల చిన సత్యనారాయణ వంటి వారెందరో ఇక్కడ విద్యాభ్యాసం చేసిన వారే.

ఉద్దండులైన ప్రధానాపోచార్యులు

ఇదిలా ఉండగా ఈ కళాశాలకు ప్రధానాపోచార్యులుగా పనిచేసిన ఉద్దండులెందరో ఉన్నారు. ఈ కళాశాలకు తొలి ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు భూపాలరాగం పాడితే నిద్రపోయే పక్షులు కూడా మేల్కొంటాయని ప్రతీతి. ఆటపాటల మేటిగా, పుంభావ సరస్వతిగా, సర్వకళావిదుడిగా విశిష్టఖ్యాతినార్జించిన ఆదిభట్ల నారాయణ దాసు ఆజన్మ ప్రతిభాసిద్ధుడు. హరికథా పితామహుడైన ఆయన 1864 ఆగస్టు 31న బలిజిపేట మండలం అజ్జాడలో జన్మించారు. పుట్టింది అజ్జాడలోనైనా కలం పట్టింది, కాలికి గజ్జెకట్టింది, హరికథా ప్రక్రియ వికాసానికి విశేష కృషి చేసింది విజయనగరంలోనే.. ఈ గాన పాఠశాలకు మొట్టమొదటి ప్రిన్సిపల్‌గా 1919లో బాధ్యతలు చేపట్టిన ఆయన 1936 వరకు కొనసాగారు. ఆ తరువాత ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ప్రొఫెసర్ ద్వారం వెంకటస్వామినాయుడు 1936-1953 వరకు ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ఆయన 26 ఏళ్ల ప్రాయంలోనే ఈ కళాశాలకు ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన హయాంలోనే ఈ గాన పాఠశాలను 'శ్రీ విజయరామ సంగీత - నృత్య కళాశాల'గా మార్పు చేశారు. ఆయన 1941లో మద్రాసు మ్యూజిక్ అకాడమీ నుంచి సంగీత కళానిధి, 1950లో ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ, 1953లో సంగీత నాటక అకాడమీ, 1967లో పద్మశ్రీ అవార్డును అందుకున్నారు.

ఆ తరువాత ద్వారం నరసింగరావు 1953-60 వరకు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఆ తరువాత ఆయన కుమారుడు ద్వారం భావనారాయణరావు 1962-73 వరకు ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ఈయన ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కళాప్రపూర్ణ బిరుదును పొందారు. ఈయన మద్రాసు మ్యూజిక్ అకాడమికి సలహా మండలి సభ్యునిగా పనిచేశారు. సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి 1977-79 వరకు ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ఈయన 1940లో ఇదే కళాశాలలో ద్వారం నరసింగరావునాయుడు వద్ద వయోలిన్, గాత్రం నేర్చుకున్నారు. ఈయన 54 సంస్థల నుంచి అవార్డులను కైవశం చేసుకున్నారు. 1976లో చెన్నైకి చెందిన శ్రీకృష్ణ గాన సభ నుంచి సంగీత చూడామణి బిరుదును పొందారు. 1986లో సంగీత నాటక అకడమీ అవార్డు బిరుదాంకితులయ్యారు.


ఈయన విజయనగరంతోపాటు తిరుపతి ఎస్వీ సంగీత కళాశాల, సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల, విజయవాడలోని జి.వి.ఆర్. ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. టి.టి.డి. రూపొందించిన అన్నమాచార్య కీర్తనలకు ఈయన సంగీతాన్ని అందించారు. ఈయన టి.టి.డి. ఆస్థాన్ విద్వాన్‌గాను, కంచికామకోటి పీఠం ఆస్థాన్ విద్వాన్‌గా పనిచేశారు.

శ్రీరంగం గోపాలరత్నం 1979-80 వరకు పనిచేశారు. ఈమె కూచిపూడి, యక్షగానం, జవేలి, ఎంకి పాటలులో ప్రసిద్ధి చెందారు. ఈమె చిన్ననాటి నుంచే హరికథాగానం చేస్తుండేది. మధురగాయనిగా పేరుగాంచారు. తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఈమె 1992లో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. ఆ తరువాత ద్వారం దుర్గాప్రసాదరావు 1982-2000 వరకు, పి.వి.ఎస్. శేషయ్య శాస్త్రి 2000-2006 వరకు పనిచేశారు. ఆ తరువాత బురిడి అనురాధ పరశురాం 2007 నుంచి ఇప్పటి వరకు ప్రిన్సిపల్‌గా కొనసాగుతున్నారు.

ఏడు రకాల కోర్సులు

ఈ కళాశాల 1955 ఆగస్టు 15న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా చేర్చారు. అప్పటి నుంచి ప్రతీ ఏటా తెలుగు విశ్వవిద్యాలయం వార్షిక పరీక్షలు నిర్వహించడంతో పాటు రెండేళ్ల డిప్లమో, నాలుగేళ్ల సర్టిఫికేట్ కోర్సులను నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఈ కళాశాలలో గాత్రం, భరతనాట్యం, వయోలిన్, వీణా, మృదంగం, నాదస్వరం, డోలు కోర్సులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ కళశాలలో 450 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

"నేను ఎక్కడ, ఎప్పుడు, ఏ పరిస్థితుల్లో ఉన్నా గురువుగారి పవిత్రాత్మ నా వెన్నంటి ఉంటుందని నమ్ముతాను" అన్న ఘంటసాల పలుకుల్లో విద్యనేర్పిన గురువుగారిని ఆత్మీయానురాగాలతో, ఆత్మబంధువుగా ఆరాధించడం కనిపిస్తుంది. సంగీతానికి, సాహిత్యానికి సమన్వయం ఉండాలని, సాహిత్య పోషకంగా సంగీతం ఉండాలని భావించే వారు ఘంటసాలగారు. భాషలోని సాహిత్య భావానికి తగిన సంగీతకల్పన చేయడంలో, తెలుగు పాటలోని మాట.. తెలుగుమాటగా వినిపించాలన్న తన గురువు సీతారామ శాస్త్రిగారి ఆదర్శాన్ని ఘంటసాల గారు అక్షరాలా ఆచరించే వారు.





కలెక్టర్ హరి జవహర్‌లాల్

కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు

ఆదిభట్ల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఈ కళాశాలలో హరికథావిభాగం లేకపోవడం శోచనీయం. 1936నుండి 1953వరకు ద్వారం వెంకటస్వామినాయుడు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ కళాశాలలో హరికథ, చిత్రలేఖనం, నటన విభాగాలను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కేవలం కాగితాలకే పరిమితమైంది. ఏళ్ల తరబడి ఆ ప్రతిపాదనకు మోక్షం లభించలేదు.

అలనాటి వైభవం ఏది?

శాస్త్రీయ సంగీతంలో ప్రఖ్యాతి చెందాలన్న తపన విద్యార్థుల్లో కరువవుతుంది. ప్రతి ఒక్కరూ డాక్టర్ కావాలనో, ఇంజనీరు కావాలనో ఆలోచించడం వల్ల ఎక్కువ మంది వాటిపై దృష్టి సారిస్తున్నారు. చదువులు, ర్యాంకులు కోసం ఆరాటమే తప్ప, కళలపై ఆసక్తి సన్నగిల్లుతుంది. ఉమ్మడి కుటుంబాలు చిన్నాభిన్నం కావడంతో నేడు బిజీలైఫ్‌లో మహిళలు కూడా బతుకు బండిని ఈడ్చడానికి పరుగులు తీయాల్సిన పరిస్థితులు తలెత్తాయి. అందువల్లనే పెళ్లిళ్లలో ఒకప్పుడు మీ అమ్మాయి పాటలు పాడగలదా? నాట్యం చేయగలదా? అని ప్రశ్నించే ధోరణి నుంచి ఇపుడు మీ అమ్మాయి ఎంత వరకు చదువుకుంది? నెలకు ఎంత సంపాదిస్తుందని ప్రశ్నించే మగపెళ్లివారు తయారయ్యారు. దీంతో మహిళల ఆలోచనాధోరణిలో కూడా మార్పు వచ్చింది. అందువల్లనే సంగీతం నేర్చుకుంటే తిండి పెట్టదని, అదే ఏ కంప్యూటరో, ఇంజనీరింగ్, డాక్టర్ కోర్సు చేసుకుంటే ఎంచక్కా నెలకు లక్షలాది రూపాయలు ఆదాయం సంపాదించవచ్చనే భావన అందరిలో నెలకొంది. దీంతో మహిళలు కూడా ఆదాయం వైపు పరుగులు తీస్తున్నారే తప్పా, మానసిక ప్రశాంతతను, ఉల్లాసాన్ని కలిగించే కళల పట్ల పెద్దగా ఆసక్తి కనబరచడం లేదు.



ఉమ్మడి కుటుంబాలుగా కలిసిమెలసి ఉన్న రోజుల్లో ప్రతీ ఇంట్లో ఒకరో, ఇద్దరో మహిళలు సంగీతం, నృత్యం నేర్చుకునేవారు. అప్పట్లో కాలక్షేపానికి సంగీతం, నృత్యం మినహా వేరొక సాధనం ఉండేది కాదు. అందువల్లనే విద్యార్థులు కూడా ఏకాగ్రతతో విద్యను అభ్యాసించి ఆయా రంగాల్లో పేరు ప్రఖ్యాతులు గడించారు. ఆ తరువాత కొంత కాలం వీటిపట్ల ఆసక్తి తగ్గినప్పటికీ, శంకరాభరణం సినిమా విడుదలైన తరువాత వీణ పట్ల ఎక్కువ మంది మహిళలు మొగ్గు చూపారు. ఆ తరువాత ఆ కోర్సుకు డిమాండ్ కూడా బాగా పెరిగింది. ఆ తరువాత ఇటీవల కొంత కాలంగా ఆ కోర్సులపై మక్కువ తగ్గింది. అయితే కేవలం శాస్త్రీయ సంగీతం, నృత్యం, వయోలిన్, నాధస్వరం, డోలు, గాత్రం, మృదంగం వంటి అనేక అంశాలను బోధిస్తున్న విజయనగరం మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో అంకితభావం గల విద్యార్థులను తీర్చిదిద్దడంలో విఫలమవుతున్నారు.

ఇదే ధోరణి కొనసాగితే భవిష్యత్‌లో కళలు కేవలం చెప్పుకోడానికే తప్ప వాటిని ఆలకించే అదృష్టం కరువయ్యే ప్రమాదం ఉంది. సంగీతం, నృత్యం వంటి వాటికి దూరంగా ఉంటున్నారు. కేవలం వాటిని తిలకిస్తూ ఆనందం పొందడం మినహా, ఆయా రంగాల్లో ప్రావీణ్యం సంపాదించడానికి ఆసక్తి కనబరచడం లేదు. కర్ణాటక శాస్త్రీయ సంగీతం, వీణా, భరతనాట్యం, నాధస్వరం, వయోలిన్ వంటి విద్యను అందించే పాఠశాలలు అందుబాటులో ఉన్నప్పటికీ అవి కేవలం మొక్కుబడిగానే జరుగుతున్నాయి. ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల్లోనే ఉన్న సమయమంతా వెచ్చిస్తున్నారు. ఉన్న కొద్ది మంది విద్యార్థినులు తీరిగ్గా ఉన్న సమయంలో సంగీతం, నృత్యం నేర్చుకోవాలని ఆసక్తి కనబరుస్తున్నారు. అలా రోజుకి ఏ గంట సేపో సాధన చేస్తే వచ్చే విద్య కాదు. అందువల్లనే సంగీతం, నాట్యం వంటి అంశాల్లో అంకితభావం గల విద్యార్థులను తీర్చిదిద్దడంలో నేటి గురువులు విఫలమవుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే.. వయోజన విద్యలాగే సంగీతం మారిపోయే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది.

వైభవంగా ఉత్సవాలు

మహారాజా ప్రభుత్వ సంగీత - నృత్య కళాశాల వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లను చేసింది. ఫిబ్రవరి 3, 4, 5 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు, మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, మంత్రి అఖిలప్రియ, ఎంపీ అశోక్‌గజపతి రాజు, ఎమ్మెల్యే మీసాల గీత, జిల్లా కలెక్టర్ హరి జవహర్‌లాల్ , భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ విజయభాస్కర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఉత్సవం మొదటి రోజున ఆరు వేల మంది విద్యార్థులతో శకట ప్రదర్శన ఉంటుంది. గాత్రం, వీణా, వయోలిన్, మృదంగం, నాధస్వరం, డోలు, భరతనాట్యం, హరికథ శకటాలతో ప్రదర్శించనున్నారు. తొలిరోజున మాండలిన్ విద్వాంసురాలు యుపి రాజు, నాగమణితో కచేరి ఉంటుంది. అదే రోజున హరికథా భాగవతార్ కోట సచ్చిదానంద శాస్త్రికి హరికథా పితామహుడు ఆదిభట్ల పురస్కారాన్ని అందజేయనున్నారు.

రెండో రోజున తనికెళ్ల భరణి, గొల్లపూడి మారుతీరావులతో చర్చాగోష్టి నిర్వహిస్తారు. సంగీత విద్వాంసులు కమలాకరరావు, అన్నవరపు రామస్వామి, కొమండూరి శేషాద్రి, పి.వి.ఎస్. శేషయ శాస్త్రి, ద్వారం లక్ష్మి, ద్వారం దుర్గాప్రసాద్ తదితరులతో సంగీతం భావితరాలకు ఎలా ఉపయోగపడుతుందనే అంశంపై ప్రసంగిస్తారు. ద్వారం వెంకటస్వామినాయుడు పేరిట శతజయంతి పురస్కారాన్ని ద్వారం మంగతాయార్‌కు అందజేయనున్నారు. శాస్త్రీయ కర్ణాటక సంగీతాన్ని ప్రియా సిస్టర్స్ ఆలపించనున్నారు. ఉత్సవాల చివరి రోజున ప్రముఖ గాయని పి. సుశీల ఉత్సవాలలో పాల్గొని ఆహుతులను కనువిందు చేయనున్నారు. ప్రముఖ నటి మంజుభార్గవి నృత్యం ప్రదర్శించనున్నారు. చివరి రోజున పి. సుశీలకు, ఘంటసాల రత్నకుమార్ (చెన్నై) అతిథుల చేతుల మీదుగా శతజయంతి పురస్కారాలను అందజేయనున్నారు.

- బొండా రామకృష్ణ



సాలూరు రాజేశ్వరరావు





నూకల చినసత్యనారాయణ


భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా..




భావితరాలకు స్ఫూర్తిగా ఉండాలి అన్న ఉద్దేశ్యంతో భారీ స్థాయిలో ఉత్సవాలను నిర్వహిస్తున్నాము. ఇందుకు సహకరిస్తున్న జిల్లా యంత్రాంగం, మంత్రులు గంటా శ్రీనివాసరావు, సుజయ్‌కృష్ణ రంగారావు, అఖిల ప్రియ, డైరెక్టర్ విజయభాస్కర్ తదితరులు సూచనల మేరకు ఏర్పాట్లు చేస్తున్నాము.

- బి. అనురాధ పరశురాం

ప్రిన్సిపాల్, మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల



లోగో స్ఫూర్తిదాయకం



మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల వందేళ్ల ఉత్సవాలకు లోగోను రూపొందించడం ఆనందంగా ఉంది. రాజావారు కళాశాల స్థాపించినపుడు ఏ వైభవం జరిగిందో చూడలేదు గాని.. ఇపుడు శతజయంతి ఉత్సవాలలో కీలక భూమిక వ్యవహరించడం ఆనందంగా ఉంది. ఇటువంటి మహోత్తర ఘట్టంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ ఉత్సవాలకు లోగోను రూపొందించడం ఎంతో సంతృప్తినిచ్చింది. లోగోలో విజయరామరాజు ఫొటోతోపాటు ఇప్పటి వరకు పనిచేసిన ప్రిన్సిపాళ్ల ఫోటోలు, ఉద్దండుల ఫోటోలను లోగోలో పొందుపరిచాము.

- బూరాడ శ్రీనివాసరావు

ప్రధాన కార్యదర్శి, పూర్వ విద్యార్థి సంఘం

కళాశాల ప్రతిష్టకు కృషి

ఆనాటి పూర్వ విద్యార్థి సంఘాన్ని బలోపేతం చేయడం ఆనందాన్నిచ్చింది. కళాశాలను అభివృద్ధి చేయాలన్న ఆకాంక్ష మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జిల్లా కలెక్టర్ హరి జవహర్‌లాల్, యంత్రాంగం సహకారం అందించడం ఆనందాన్నిచ్చింది. భవిష్యత్ తరాల విద్యార్థులకు వసతి గృహం ఏర్పాటు చేయగలిగితే విద్యార్థులు అంకితభావంతో విద్యను నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ ఉత్సవాల ద్వారా కళాశాల ప్రతిష్ట మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తున్నాము.

-బి.ఎ. నారాయణ

పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు

శ్రీనరసింహ శతకము

సీ॥ తాపసార్చిత! నేను పాపకర్ముఁడనంచు
నాకు వంకలు పెట్టఁబోకు సుమ్మి
నాటికి శిక్షలు నన్నుఁజేయుటకంటె
నేడు సేయము నీవు నేస్తమనక
అతిభయంకరులైన యమదూతలకు నన్ను
నొప్పగింపకుమయ్య యురగశయన!
నీ దాసులను బట్టి నీవు దండింపంగ
వద్దు వద్దనరెంత పెద్దలైన
తే॥ తండ్రివై నీవు పరపీడఁ దగులఁజేయ
వాసిగల పేరు కపకీర్తి వచ్చునయ్య!
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్ట సంహార! నరసింహ! దురితదూర!

తా॥ మునిజన వందితుడవైన ఓ నరసింహ ప్రభూ! నేను పాపాలు చేసేవాణ్ణని ముద్రవేయవద్దు. నన్ను శిక్షించాలని వుంటే, మరణ సమయంలో ఎందుకు? ఇప్పుడే శిక్షించు. యమదూతలు చాలా కఠినాత్ములు. వారికి నన్నప్పగించకు. నీ భక్తుల్ని నీవు శిక్షిస్తే, ఎంతవారైనా అడ్డుపెట్టరు. నీవు తండ్రివంటివాడవు. నీవు ఇతరుల్ని పీడిస్తే నీ కీర్తికే మచ్చ.



అనంతం

51 -గోపరాజు నాగేశ్వరరావు

"నగ్గూరాంని సంపినాడంట గరుడాశలంఁవ్! సూత్తారే..

అడవి పుత్రులు రెచ్చిపోయారు.

విధ్వంసం మొదలైంది!

క్షణాలమీద గుడారాలు తగులబడిపోయాయి. గుడారాల్లోవున్న సామాన్లను కూడా విడిచిపెట్టలేదు. అడవి పుత్రులు-గుట్టవేసి కాల్చేశారు.

మంటలపైకి లేస్తున్నాయి..

మరణమృదంగం మ్రోగుతున్నది.

బాణాకర్రలతో, సాంప్రదాయక ఆయుధాలతో పోలీసు సిబ్బందిని ఎదుర్కొన్నారు అడవి పుత్రులు.. వాళ్ళని చితకబాదుతున్నారు.

పోలీసు అధికారులకు పరిస్థితి అర్థమైపోయింది!

ఇక ఆలస్యంచేస్తే వాళ్ళు పోలీసుల్నికూడా విడిచిపెట్టరు!

"ఫైర్"అంటూ అప్పుడు వినిపించింది అధికారి ఆజ్ఞ!

అతని ఆజ్ఞ పోలీసు సిబ్బందిలో ఉత్సాహం నింపింది.

అంతవరకూ విధ్వంసం జరుగుతున్నా అధికారి ఆదేశాలు అందనందువల్ల లాఠీఛార్జికి పరిమితమయ్యారు వాళ్ళు.

ఇప్పుడు ఆదేశాలు అందాయి!

ప్రతీకారవాంఛతో రగిలిపోతూ, అదే అవకాశంగా భావించి అడవిపుత్రుల గుండెలకు గురిచూసి కాల్పులు జరిపారు పోలీసు సిబ్బంది!

కళ్ళముందే బాణావతు నేలకు వొరిగిపోయాడు.

కాళీచరణ్ విగత జీవుడయ్యాడు.

నెత్తురు వరదలు కట్టింది.

జనం పరుగులూ..ఆర్తనాదాలూ..

అడవి తల్లి జడలు విరబోసుకొని ఏడుస్తున్నట్టుంది!

అడవి పుత్రులు చెల్లాచెదురై దూరంగా పారిపోయారు.

అక్కడ పోలీసులూ, శవాలూ మిగిలాయి.

లా అండ్ ఆర్డర్ యీజ్ టెన్స్.. బట్ అండర్ కంట్రోల్!?

⁂ ⁂ ⁂

తుపాకి కాల్పులకు చెల్లాచెదురైన అడవిపుత్రులు వివిధ మార్గాలనుంచి నడిచి వెళ్ళి, నల్లకొండ వెనుక మళ్ళీ గుమికూడారు.

అదనపు పోలీసు బలగాలు వచ్చిపడ్డాయన్న వార్తకూడా అందింది!

వాళ్ళంతా బాగా ఆలోచించారు!

అలాంటి పరిస్థితుల్లో మళ్ళీ గుడారాల దగ్గరికి వెళ్ళటం, పోలీసులతో తలపట్టం చాలా ప్రమాదం.

గుడారాల మీద జరిగిన దాడిలో ప్రధానపాత్ర వహించింది రెడ్డియానాయక్ తండావాళ్ళే అని పోలీసులు గ్రహించే ఉంటారు.

పైగా, వాళ్ళ దృష్టంతా ఆ తండామీదనే వుంది. దాన్ని ఖాళీ చేయించాలన్నదే వాళ్ళ ధ్యేయం!

అందువల్ల తండా వాళ్ళు గుడారాల దగ్గరికి వెళ్ళటం ఎంత ప్రమాదమో, తండాకి వెళ్ళటం కూడా అంతే ప్రమాదం!


"ఏఁవి శాద్దాఁవూ?"అని, రాగ్యా గోపీనాయక్‌ని అడిగాడు.

కొని, రాగ్యా అడిగాడు.

"ఆడికి బోతే మనల్ని కాల్సిపారేత్తారు."

"పీనిగెల్ని గూడా ఇయ్యరా మనకి"

"సూద్దాఁ వేటి జరుగుద్దో! ముందుగాల మనఁవీడ్నించి బోవాల. పోలీసోళ్ళు ఎతుకుతుండొచ్చు. కనిపిత్తే సంపుతారు"అన్నాడు గోపీనాయక్.



"అడవి అతకార్లు సూసినా మనకి ప్రైఁవాదఁవే! యంటనే గొలుసుకొండల కాడికి ఎల్లిపోదాఁవు. ఆడ కూకొని ఆలోశిద్దాఁవు"అని చెప్పాడు గోపీనాయక్.

"శాందినీ పీనిగె ఆడ్నే వుంది. గుడారాల కాడ మా అయ్య, బాణావతు, నగ్గూరాం పీనిగెలుండయ్యి.. ఆట్నేఁవి సెయ్యాల?"కన్నీళ్ళు తుడుచుకొని, రాగ్యా అడిగాడు.

రాగ్యా, గోపీనాయక్ దారి చూపిస్తుంటే, వాళ్ళందరూ రహస్య మార్గాలగుండా బయల్దేరారు.

లాఠీఛార్జిలో గాయపడ్డవాళ్ళూ, తుపాకి తూటాల రవ్వలు తగిలిన వాళ్ళూ... కొంతమంది నడవలేని స్థితిలో వుంటే, వాళ్ళని భుజాల ఆసరాయిచ్చి అడవిపుత్రులు నడిపిస్తున్నారు.

గుట్టలు తుప్పలు పొదల మార్గంలో వాళ్ళు ఎవ్వరికంటా పడకండా జాగ్రత్తగా నడుస్తూ గొలుసు కొండల వైపుకు సాగిపోతోన్నారు.

అడివి పుత్రులకు అయోమయంగా ఉంది!

లోతట్టు దుర్గమారణ్యంలోకి వెళ్ళే ఆ రహస్య మార్గాలను గురించి రాగ్యాకీ, గోపీనాయక్‌కీ తప్ప మిగతా వాళ్ళెవ్వరికీ తెలియదు.

ఎన్ని రహస్యాల్ని కడుపులో దాచుకుందో, అడవి తల్లి!

సంభ్రమాశ్చర్యాలతో దారులుచూస్తూ వాళ్ళు నడుస్తున్నారు.

"గొలుసుకొండల కాడ పసరుపోసే ఆకులుంటయ్యా"అని ఎవ్వరో గోపీనాయక్‌ని దార్లో అడిగారు.

"అన్నీ ఉంటయ్యి"అని "ఏంటికి"అని గోపీ అడిగాడు.

"రగతఁవ్ గట్టుకోవాల్నన్నా గాయాలు మానాల్నన్నా ఆకుపసర్లు పిండాలి. కట్లు గిట్టాలి."

"అయ్యన్నీ ఉండయ్యిలే ఆడ"అన్నాడు గోపీనాయక్.

మౌనంగా నడుస్తున్నారు వాళ్ళు.

దూరంగా ఏదో పక్షి వికృతంగా అరిచింది!

అందరూ తలలు పైకెత్తి, ఆకాశంలోకి చూసారు.

శవాల వాసన పసిగట్టి కాబోలు! రాబందుల గుంపు గుడారాలవైపుకు సాగిపోతోంది...

"రాంబందులా" అడిగాడతను.

"అయ్యేలే"అన్నాడు రాగ్యా బాధగా.

అతనిక మాట్లడలేదు.

రాగ్యా, గోపీనాయక్ ముందు నడుస్తున్నారు. వాళ్ళ వెంటే మిగతా అడవి పుత్రులందరూ ఆపసోపాలు పడుతూ, బాధతో మూలుగుతూ, ఒకళ్ళ గాయాలనొకళ్ళుచూస్తూ ధైర్యంచెప్తూ ముందుకు సాగిపోతోన్నారు.

గంట గడిచింది. కొండల దగ్గరికి చేరారు.

రాగ్యా, గోపీనాయక్ తప్ప మిగతా వాళ్ళెవ్వరూ ఆ గొలుసు కొండల్ని గతంలో ఎప్పుడూ చూళ్ళేదు.

అక్కడి అడవి, వాతావరణం భీకరంగా వుంది!

ఆకాశాన్ని తాకుతున్నట్టున్న చెట్లు, కాండాల మధ్య స్థలంలేకుండా పెరిగిన బలమైన మానులూ, అక్కడక్కడా గుబురు పొదాలూ.. చీకట్లు ముసిరి అగమ్యగోచరంగా వుంది.

"జల్మలో సూళేదు ఇసుఁవంటి అడివి" అన్నారెవ్వరో. "ఇదే మన తావరఁవ్! యీడ దాంకున్నాఁవంటే భగఁవంతుడు గూడా పట్టుకోలేడు.. అందుకే తెచ్చానీడికి" అన్నాడు గోపీనాయక్.

(ఇంకా ఉంది)



రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
విదేశయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనవసర వ్యయప్రయాసలుంటాయి. ప్రయాణాలెక్కువచేస్తారు.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. ఆకస్మిక కలహాలకు అవకాశముంటుంది. ధననష్టాన్ని అధిగమించుటకు ఋణప్రయత్నం చేస్తారు. కుటుంబ విషయాల్లో మార్పులు వుంటాయి.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. బంధు, మిత్రులతో సరదాగా గడుపుతారు. ప్రయాణాలవల్ల లాభం చేకూరును. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. అన్నివిధాలా సుఖాన్ని పొందుతారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించుట అన్ని విధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అనవసర ధనవ్యయంతో ఋణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది. అనారోగ్య బాధలకు ఔషధసేవ అవసరం.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలు ఖరీదు చేస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. అన్ని రంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తారు. నూతన కార్యాలను ప్రారంభిస్తారు. ఋణ విముక్తి లభిస్తుంది. మానసికానందం పొందుతారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, ఉద్యోగ రంగంలో అభివృద్ధి వుంటుంది. మానసికాందోళనతో కాలం గడుపుతారు. ప్రయత్న లోపం లేకున్నా పనులు పూర్తిచేసుకోలేకపోతారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
కుటుంబ విషయాలపై అనాసక్తితో వుంటారు. గృహంలో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. తలచిన కార్యాలు ఆలస్యంగా నెరవేరతాయి. కొన్ని కార్యాలు విధిగా రేపటికి వాయిదా వేసుకుంటారు. స్త్రీలతో జాగ్రత్తగా నుండుట మంచిది.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అధికారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. అనవసర భయం ఆవహిస్తుంది.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
మానసిక ఆందోళన తొలగుతుంది. ఆరోగ్యం గూర్చి జాగ్రత్త వహించాలి. ఆకస్మిక భయం దూరమవుతుంది. ప్రయాణాల్లో మెలకువ అవసరం. విదేశయాన ప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి.


● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ప్రయత్న కార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. ఋణబాధలు తొలగిపోతాయి. ధైర్యసాహసాలతో ముందుకు వెళతారు.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
ప్రయత్న కార్యాలందు దిగ్విజయాన్ని పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తిచేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్య బాధలుండవు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. మీ ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా ఉంటాయి. అనుకూల పరిస్థితులేర్పడతాయి.

మాటాట

నిర్వహణ: సుధామ 1861



అడ్డం **ఆధారాలు** నిలువు

అడ్డం	నిలువు
1. శ్రీ వేంకటేశ్వరునికి ప్రియమైన వారంట!	2. గరుడుడు విష్ణుమూర్తికి
5. షిర్డీ లేక, పుట్టపర్తి మహాత్మునికి వ్యవహారం	3. గోమాత రావము
7. అనుమానము	4. చీర వంటి వస్త్రం
8. సన్నము కాదు	6. ఉత్తరాదిన వేంకటేశ్వర నామం
9. గీత	7. చక్రం కాదు. విష్ణు హస్తగతమైన మరొకటి
10. సమాధానపడిపోవడం 12. యతి	10. రహదారియే!
14. సప్తగిరులు	11. భగవంతుడు
	13. సంపదలు, గుప్తమైనవే కానక్కర్లేదు

అడ్డం **మాటాట-1860 సమాధానాలు** నిలువు

2. జలగీతం	10. తోక	1. ఒకటి	7. మెంతులు
5. టితే 7. మెండు	12. తోలు	3. లహరి	10. తోడి
8. లిమ్కా	14. ముద్దుకృష్ణ	4. రెండు	11. శిరాకృ
9. రైతు	★	6. తేలిక	13. తోయము

హనుమ - శీలము

లక్కరాజు వెంకట పూర్ణచంద్రరావు

శ్రీ హనుమ శీలసంపదతో రూపుదిద్దుకున్న వజ్రకాయుడు. 'ది ఎంబోడిమెంట్ ఆఫ్ సిన్సియారిటీ అండ్ ఇండివిద్యుయాలిటీ ఈజ్ ఆఫ్ హనుమ'(యాన్ ఐకాన్)- శీల సంపద అంటే వ్యక్తిత్వము, నిజాయితీతత్వం కలిగి వుండటమే. అన్యులతో పోల్చుటకు అలవికాని వ్యక్తిత్వమే ఆంజనేయ తత్త్వం. ఎంత విద్యాధికులైనా శీలం కొరవడితే అనామకులౌతారు. శీలసంపద కలవారి ఆలోచనలు నిర్మలంగా వుండటమేగాక, విచాక్షణా జ్ఞాన సంపన్నులై వుంటారు. జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలకు కృంగిపోవడం గాని లేక చిన్న సంతోషానికి పొంగిపోవడం గాని వుండదు.

శ్రీ హనుమ వినయశీలి, నిరహంగారి. అందుచేతనే సుఖ దుఃఖాలను సమాన దృష్టిలో వీక్షిస్తాడు. స్వామి మితభాషి కనుక ఆయన వ్యక్తిత్వానికి మరింత శోభ కలిగింది. స్వామికి బాహ్యాలంకరణ కంటే తన నడత, అంతరంగ హృదయ శోభ శీలమును ఇనుమడింపజేశాయి. మనిషి తన జీవితకాలమందు ధననష్టం జరిగినా తిరిగి పొందగలడు కానీ శీలమును నష్టపోతే తిరిగి పొందజాలడు.

ఎంతటి విద్యావంతులకైనా తమ శీలమే తమ విద్యకు శోభనిచ్చును. 'శీలేన శోభతే విద్య' అను వాక్యము తెలియనివారుండరు.

స్వామి కేసరి రాజ్యానికి యువరాజు. స్వామికి ఆభరణాలు, అలంకరణలు అవసరం లేదు. కేవలం కిరీటమే ఆయన ధరించునది, చేతిలో గదాయుధము ధరించుట- దుష్టశిక్షణ శిష్టరక్షణకు మాత్రమే. వజ్రకాయుడు గనుక ఏ రకమైన కవచములు అవసరంలేదు. స్వామి లక్ష్య సాధకుడు. తాను ఏ కార్యము తలపెడతారో ఆ కార్యము కొరకు నిరంతరం శ్రమించును. కర్తవ్య నిష్ఠ, అకుంఠిత దీక్ష, పట్టుదలలే లక్ష్యసాధనకు సోపానాలు. స్వామికి మడమత్రిప్పి వెనుదిరిగే స్వభావమే లేదు. స్వామి భక్తులకు కూడా అవే దీక్షాదక్షతలు కార్యసాధకులను చేస్తాయి.

పాలకులు శీలవంతులైతే తమ దేశంలో గౌరవించబడతారు. ప్రతిక్షణము ఉద్రిక్తత, ఉద్రిక్తతోపాటు తొట్రుపాటు, భయము, నిర్వీర్యతకు గురి అవుతున్నాము.

శ్లో॥ **మనోజవం మారుత తుల్యవేగం**
జితేంద్రియం బుద్ధి మతాం వరిష్టవ్
వాతాత్మజం వానరయూథ ముఖ్యం
శ్రీరామ దూతం శిరసా నమామి

అస్థిరతతో కొండగుహలలో తలదాచుకున్న సుగ్రీవునకు రామ మైత్రి కలిగించి, భయాందోళనల నుంచి విముక్తిగావించాడు. ఇచట రామమైత్రి అంటే ప్రతి మానవునియందున్న పరమాత్మ భావనతో ఆత్మబలం పెంపొందించుకొని, ప్రశాంతతను పొందటమే. దీనికి ప్రేరణ, సంధానకర్త మన స్వామియే.మానవునికి అంతఃశత్రువులైన కామ, క్రోధ, లోభ, మోహ మద మాత్సర్యములను దహించి రాక్షస భావనలను అంతమొందించుకొని జితేంద్రియులై మహనీయ తత్త్వాన్ని పెంపొందించుకొని ప్రతి మానవుని కార్యోన్ముఖులను చేయుటయే సుందరాకాండలో స్వామి తెలియజేసినది.

శ్రీరామతత్త్వాన్ని జీర్ణించుకున్న స్వామి ఆత్మబలంతో మంచి బుద్ధిగలవాడై జితేంద్రియుడైనాడు. రావణాసురుని అంతఃపురంలో సీతాన్వేషణకై అడుగిడి బంగరు వన్నెతో వజ్రవైఢూర్యములు పొదగబడిన ద్వారములు, కిటికీలు పరికిస్తాడు. ఆ మహాగృహంలో శోభాయమానమైన మణిమయ ఖచితమౌ పుష్పక విమానమును చూచి, అంతటి భోగవంతమైన భవనమును తిలకించి 'ఇది స్వర్గమా లేక ఇంద్రభవనమా? ముక్తిప్రదమైన బ్రహ్మలోకమా' అని మహాత్ముడైన మారుతి ఆశ్చర్యానందములతో తిలకిస్తాడు. కాని సీతమ్మ జాడ కానరాక వెదుకుతూ అపురూప సౌందర్య లావణ్యములతో విరాజిల్లు అందమైన స్త్రీలను చూశాడు కాని ఎచ్చటనూ మనస్సు చలించలేదు. వాటిమీద వ్యామోహము గాని, ఈర్ష్యగాని పొందక, తన బుద్ధిబలంతో జితేంద్రియత్వంతో, కార్యోన్ముఖుడై సీతాదేవి అన్వేషణే ధ్యేయంగా తన శీల శోభను చాటుతూ స్వామి ముందుకు నడుస్తాడు. కపీంద్రుడు రావణాంతపురమును పూర్తిగా పరికించి జానకీమాత జాడ కానరాకుండుటచే విచారముగా వెదకుచూ నడుమ పరకాంతలను చూచి, పరకాంతలను చూచుట యను కార్యము మహాపాపము కదా అని తలచి దుఃఖించి ఒకింత ఆలోచనతో ఇట్లు తలపోసెను.

- సశేషం

మల్లాది రామకృష్ణశాస్త్రి కథలు

మల్లాది రామకృష్ణశాస్త్రి

అలా నర్సయ్య ఆగడాలెక్కువై, యిల్లు విడిచిపోయి- జతకట్టి, పిల్లల్ని కని చివరకు యింటికి తిరిగొచ్చి చూస్తే ఏముంది? పాడుపడిన కొంప!.. అందుకని మునసబుగారింటి కెడితే- అరుగుపైన ఆయన పడుకొనింటాడు. అరుగు కింద ఆయన చెప్పులు పడి ఉంటాయి. ఆ చెప్పుల చర్మం తన తల్లిది! చూసిన కన్ను అలానే గడ్డ గట్టుకుపోయింది. ఈ కనుకలి కథలోని శిల్పం అత్యద్భుతం!

ఇక భాష విషయానికొస్తే- శాస్త్రిగారికి గ్రాంథిక భాషలో ఎంత ప్రావీణ్యముందో, జానపద భాషల్లో-అంటే ప్రజల భాషలోనూ అంతే పట్టు ఉంది! ఆ రెండూ ఆయనకు రెండు కళ్లు.

డు.ము.వులు కథ పరికిద్దాం!

"కవి బ్రాహ్మలని పేరుమోశారు గందా!... ఆ మాత్రం ఎరికలేదా? గాలికి పుట్టి, ధూళికి పెరిగి నోళ్ల కూసేదయ్యా ఈ బాస!.. తాటాకు కట్టలు మేసే ఓళ్లకు- మీ బాస! తవరిలాంటోరు వెయ్యి మందిలో ఒకరుంటారు. కైతలు సేస్తారు. ఏమారాజో మెచ్చుకుంటారు. ఏనుగు నెక్కిస్తారు. ఒక్కరి కూటికి, గుడ్డకు అక్కరకొచ్చేది మీ బాస!.. మందిలో పడేది బా బాస!.. పదం, పాటా చేలో ఆవులన్నీ ఆలకిస్తాయి. లేగలన్నీ సిందేస్తాయి.." అంటే కొమ్మన్న కొడుకు తిక్కన సోమయాజి తమ్ముడు- గురునాథుడు ద్వారా, భాషా సారస్యాన్ని మనకు తెలియజేస్తారు ఈకథలో.

వినమరువైన..

సోమంచి రామం

ఛాందస భావాలంటే శాస్త్రిగారికి ఒళ్లుమంట! అలాంటి వాటిని నిరసించాలన్నదే ఆయన ధ్యేయం! అలాగే మహిళాభ్యుదయం, స్త్రీ విమోచనోద్యమం- అంటే ఆయనకు ఎంత అభిమానముందో చూద్దాం!

"ఆహా.. ఆనాడు అంతే! .. ఆడదంటే కొట్టాంలో కట్టేసిన గొడ్డుతో సమానం. అరుగుమీద పరిచే నలిగిన చాప!.. అతిథి ఎవరొచ్చినా హాయిగా పడుకోవచ్చు. అభ్యంతరం ఏమీ లేదు. లేకపోగా- అతిథి సత్కార సంభారాల్లో, అవసర నైవేద్యాల్లో అదొకటి".

ఇలాంటి పురాణకాలపు ఛాందస సంప్రదాయాల్ని ఎండగట్టడానికే రాసిన కథ కామందకి.

"వాడి పుణ్యమా అంటూ- ఆనాడు ఆ పసివాడు ఎదురుతిరిగి అలా నోరు చేసికొని ఉండకపోతే- యివాల్టివరకు- ఆడది ఓ మూలన పడుండేదే కదా!.. ఇప్పటి మహిళోద్యమాలన్నీ అంకురించడానికి ఎన్ని యుగాలు పట్టేదో" అంటూ ముగింపు చెప్తారా కథకు!

యుద్ధ సమయంలో సైనిక పటాలాలకు తన శరీరాన్నమ్ముకున్నా, ప్రతిఫలంగా వచ్చినదాన్నంతా ఊరి వాళ్లకిచ్చి-అటు యుద్ధానికి, యిటు ఊరికి పుష్కలంగా సాయంచేసి, చివరకు ప్రాణాలు వదిలిన అనామకురాలు చిట్టి వీరగాథను "బ్రతికి ఎందర్నో సుఖపెట్టింది. పోయి తాను సుఖపడుతుందంటూ" మంత్రపుష్పం కథలో హృద్యమంగా చిత్రిస్తారు. అలాగే పదేళ్ల ప్రాయంలోనే పాడైపోయి, నిర్లజ్జగా, అర్ధనగ్నంగా బజార్నపడి, అడుక్కుంటూ, తల్లిని పోషించిన, పనిమనిషి కూతురు సీతాయ్- దీనగాథను అర్ధ-నారిలో "సీతాయ్ బ్రతుకిలా అయిపోయిందా? ఎలా తెలవారుతుందో! దేశంలోఎంతమంది పడుచులు సీతాయ్‌లు అయిపోతున్నారో" అంటూ- జాలిగా చెప్తూ- స్త్రీ పతనానికి కారణభూతమైన పురుషజాతిని వ్యంగ్యంగా దుయ్యబట్టారు.

"అన్నా..! అన్నా..!! నీకు పున్నెముంటుంది. పెద్దవారి బుద్ధులు ఎసుమంటివైతేనేం? లోన పోరగాడున్నాడు- తిన్నగా- తోలుకుపో అన్నా!" అంటూ శుద్ధ అబద్ధం కథలో బ్రతిమాలిన రత్తి మానవత్వమంటే ఆయనకెంతో మక్కువ! శాస్త్రిగారు నిత్యాగ్నిహోత్రులు! ఒక చేతిలో ఊటకలం సాగిపోతూంటే- మరో చేతిలో శ్వేత కాష్ఠం కాలిపోతూంటుంది! "గీర్వాణం వెలిగించానయ్యా!.. ఈ పొగాకు ససిగాలేదు. మానివేద్దామనుకున్నాను. అదీ స్వగతంగా!.. ఆర్యోక్తిలోనే.. అసలు మనసు దాటి రానీయకుండా ఉండవలెననే మాట మర్చిపోయాను. సంకల్పం పవిత్రమైనది. గనుక కూతురు ఎందుకని తల్లినే ఆశ్రయించాను. తలదిమ్ము.. తిక్క తీరేందుకు తరుచ్ఛాయ!.. అందుకూ మా గృహిణికి యింత అలుక!.. కసి తీర్చుకున్నానుగా- ఛిక్కునీ- అని తిట్టి!.. ఏం?.. అక్షినా!.. ఇంటా విడా?" అంటూ కామకోటిలో శాస్త్రిగారు వాడిన భాష, భావన అర్థం చేసికోవాలంటే ముందు వెనుకలు చూసుకుంటూ కథ చదువుకోవాల్సిందే! ఇందులో- తల్లెవరు? .. కూతురెవరు? ఆలోచించాల్సిందే!

- సశేషం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన - శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

ఆధ్యాత్మికతకు కీలకం అందమే!

ప్రశ్న: కృష్ణుడు అర్జునుడికి ఇచ్చిన ఆధ్యాత్మిక ఉపన్యాసంలో అనేక ఇతర అంశాలలో పర్వతాలు మరియు ఏనుగులాంటి జంతువుల వంటి ప్రకృతి స్వరూపాలను ఎందుకు ఉపయోగించాడు?

అతని నుండి జన్మించిన ప్రకృతి సుందరంగా సంభ్రమాన్ని కలిగించే విధంగా ఉంటుంది. మిగిలిన విశ్వాసాలు "దేవుడు" అని వారు పిలిచే వారి దేవత గురించిన వివరణలో 'అత్యంత శక్తివంతమైన మరియు కరుణాపూరితమైన' వంటి పదాలను ఉపయోగిస్తాయి. నిజం చెప్పాలంటే అందులో లేనిది హిందూ మతానికే ప్రత్యేకమైన 'సుందరం' లేక అందం అనే పదం. ఆధ్యాత్మికతకు కీలకం అక్కడే ఉంది.

ఏకేశ్వరవాదం (ఒకే ఒక భగవంతుడు అన్న సిద్ధాంతం), నాస్తికులలో అపనమ్మకం (వేరే విశ్వాసాలపై నమ్మకం ఉన్నవారు), దయ ఆలోచనను ప్రతిబింబించేలా హిందూ దేవాలయాలు సుందరమైన కళాత్మకమైన శిల్పకళలతో అలంకరించబడినవి. తన ఉపన్యాసం నుండి పొందిన జ్ఞానము మెత్తము మరియు సంపూర్ణంఅని అర్జునుడికి కృష్ణ భగవానుడు చెప్పటం మనం గమనించవలసిన ముఖ్య అంశం. కేవలం భగవద్గీత మరియు ఈ పదాలు వ్రాయబడిన సంస్కృత భాషకే ఇవి సాధ్యము.

శ్రీకృష్ణ భగవానుని చర్యలు అర్థం చేసుకోవాలనుకుంటే విశాల దృక్పదం మరియు న్యాయం అనేవి ముఖ్యమైన లక్షణాలు ఉండాలి. కనిపించే రూపాలైన మనుషులను, జంతువులను మరియు మెక్కలను పరిగణించండి. భౌతిక లక్షణాలైన పరిమాణం, సౌందర్యం మరియు సేవలను కూడా పరిశీలిద్దాం.

హిందూమత ఔన్నత్యం



డా॥ గరికపాటి ఆనంద్
9966059562
9

(విశ్వాసులకు మాత్రమే) అనే వేరు విశ్వాసాలను పరిగణిస్తే, వేలాది సంవత్సరాలుగా యుద్ధాలకు అవే హేతువుగా ఉన్నాయి. ఈ విశ్వాసాలను చూసినదానిని బట్టి, అవి రాజకీయ లక్ష్యాలకు ఒక సమూహంలా అయ్యి ఒకరితో ఒకరు పోట్లాడుతున్నారు. ఈ నమ్మకాలను బహిరంగంగా ఒకరు ధృవపరచుతున్నా లేకపోయినా, ఇతర ఆధ్యాత్మికత విషయంలో ఈ విశ్వాసాలు అసంపూర్తిగా ఉన్నాయని చరిత్ర రుజువు చేస్తుంది.

దీనికి విరుద్ధంగా, కృష్ణ భగవానుడు అందం అనే అంశంతో ప్రారంభిస్తారు. ఒక చిన్న పువ్వులో లేక ఆకాశంలో కోట్ల తారలలోని అందం మిమ్మల్ని కొన్నిసార్లు ఆశ్చర్యచకితులను చేస్తుంది. కొన్ని సమయాల్లో విస్మయం కలిగిస్తుంది. అతని సృష్టి మరియు ఆవిర్భావాల అందంతో మెదలుపెట్టి, అతను ఆధ్యాత్మికత యెక్క నిజమైన విలువలు లేదా పునాదులు అయిన బహుత్వము, సమన్వయము, ఘనత, సార్వత్రికత్వం చూపించి అర్జునుడిని నమ్రత వైపు నడిపించి అతన్ని ఈ పదాలు అర్థం అయ్యేలా చేస్తారు.

మహావిష్ణువు దశావతారాలు, సర్పం మరియు చంద్రునితో అలంకరించబడిన శివ భగవానుని పైన పేర్కొన్న లక్షణాలకు అతి గొప్ప ఉదాహరణలు. హిందువులు దేవునికి పూలదండలు సమర్పించి నప్పుడు, ఒక సాధారణ చర్యతో భగవంతుని సౌందర్యాన్ని మరియు గొప్ప లక్షణాలను గుర్తుకు తెస్తుంది. భక్తులు వేద మంత్రాలు చదివినా, చదవక పోయినా, ఈ అతి తక్కువ శ్రమతోకూడిన ఈ చర్య వలన పొందిన అనుభవం అమూల్య మైనది. పైన పేర్కొన్న పెద్దవి, పొడవుగా, బలంగా ఉండే కొన్ని జంతువులను చూస్తాము. కొన్ని ఎగరగలవు. మిగిలిన కొన్ని ఈదగలవు. కొన్ని అద్భుతమైన వేగంతో పరుగెత్తగలవు.

సౌందర్యం విషయానికి వస్తే, జంతువులు లేదా మెక్కలు మనుషులకేమీ తీసిపోవు. ధర్మం పరంగా ఆలోచిస్తే అవి మనుషులకేమీ తీసిపోవు. కొన్ని జంతువులు చేసే సేవ కొద్దిమంది మనుషులు కలిపి చేసే సేవ కన్నా ఎక్కువే. జంతువుల కన్నా మానవులకే జీవితకాలం ఎక్కువ ఉంటుంది.

ఇప్పుడు మిమ్ములను ఉత్తేజపరిచే ఒక ప్రశ్న అడగాలి. పరిపూర్ణత ఎక్కడుంది? నిజాయితీగా సమాధానం ఇవ్వగలిగిన ఒక నిజాయితీ ఉన్న వ్యక్తిని మీకు కనబడుతున్నాడా ?

ప్రశ్న: మహాభారతం శాంతికి ఎలా తోడ్పడింది?

యుద్ధం జరగకుండా రాయబారం ఎలా చేయాలో మహాభారతం ప్రపంచానికి నేర్పుతుంది. ప్రొఫెసర్ డి.నికొలస్ మాటల్లో చెప్పాలంటే మనం వాస్తవిక జగత్తులో అరిషడ్వర్గాల మయంలో జీవిస్తున్నాం. ఏ యితర మతమైన దీనిని గురించి మాట్లాడిందా? అది వారి నిజమైన ఉద్దేశాలను తెలియజేస్తుంది.

ప్రశ్న. నేరం చేసిన వారిని శిక్షిచేటప్పుడు నీకు సబంధం ఉన్నవారికి మరియు యితరులకి మధ్య భేదాలు పాటించుతావా?

ప్రపంచంలోని అతిపెద్ద గ్రందమైన మహాభారతం దీనిని గురించి ఎంతో చక్కగా సొంపుగా ఈ ప్రశ్నకు సమాధానమిస్తుంది.

ఇంకావుంది...

కపోత లబ్ధక సంవాదము



115 మహాభారతంలో ఉపాఖ్యానాలు
డాక్టర్ ముదిగొండ ఉమాదేవి


పక్షి మాటలు విని అతను ఆ విధంగానే చేశాడు. అలా చేయడంవల్ల అతని ప్రాణం లేచివచ్చింది. పక్షిచేత ఈ విధంగా సత్కరింపబడేసరికి బోయవానికి కళ్ళవెంట ఆనందంతో నీళ్ళు వచ్చాయి. అతను పక్షితో ఇలా అన్నాడు. "ఆకలి నన్ను పీడిస్తోంది. నీవు ఏదైనా ఆహారం ఇస్తే తింటాను".

అప్పుడు పక్షి ఇలా అంది. "నా దగ్గర సంపద లేదు. ఏ రోజుకారోజు దొరికిన దానితో జీవించే వాళ్ళము. మేము వనవాసులం. మహర్షుల ఆశ్రమాలలాగ మా దగ్గర భోజనాన్నికై కూడ బెట్టినదేదీ లేదు" ఆ మాట విని అతను బాధపడ్డాడు. తన వృత్తిని నిందించుకున్నాడు. ఇంతలో పక్షిమరల ఇలా అంది. "క్షణమాగు. నిన్ను తృప్తి పరుస్తాను" అలా అని ఆ ఎండుటాకుల మంటను పెద్దది చేసి అతనితో అలా అంది - "ఋషుల ద్వారా, దేవతల ద్వారా, పితరుల ద్వారా నేను విన్నది నేర్చుకున్న అతిథి పూజ గొప్పతనము. కనుక ఈ పూజలో నాది తిరుగులేని బుద్ధి. ఈ విధంగా ప్రతిజ్ఞ చేసి ఆ పక్షి నవ్వుతూ, అగ్నికి ముమ్మారు ప్రదక్షిణం చేసి అగ్నిలోకి దూకింది. అలా ప్రవేశిస్తున్న పక్షిని చూసి బోయవాడు "అయ్యో నేనెంత క్రూరమైన పని చేసాను. నేను చేసిన క్రూరకర్మలు అన్నింటిలోను ఇది అత్యంత క్రూరకర్మ" అని ఎంతో విలపించసాగాడు. ఆకలితో అలమటిస్తూ కూడా బోయవాడు అగ్నిలో పడ్డ కపోతాన్ని చూసి ఇల్లా దుఃఖించాడు- "అయ్యో నేను ఎంత క్రూరుణ్ణి, బుద్ధిహీనుణ్ణిని. నా జన్మ అంతా ఇలాగే గడిచింది. నేనెప్పుడూ పాపం చేస్తూనే ఉన్నాను. నేను దుర్బుద్ధి కలిగి నమ్మదగని వాడిని. క్రౌర్యాన్నే నా జీవనవిధానంగా చేసుకుని పక్షులను, జంతువులను వేటాడి, చంపి జీవిస్తున్నాను. ఆ పావురం ఎంత గొప్ప మనస్సు కలది. తను దహించబడుతూ నా క్రౌర్యానికి సరియైన ప్రతీకారం చేసి ధర్మ మార్గమేదో చూపెట్టింది. ఇక నుంచి నేను ఆ మార్గాన్నే అనుసరిస్తాను. ఈ రోజు నుండి అన్ని భోగాలు వదిలిపెట్టి శరీరాన్ని కృశింపచేసి, ఉపవాసాలతో పరలోక హిత కరమైన పనులే చేస్తాను.

ఈ కపోతం తన శరీరం అగ్నిలో అర్పించి అతిథిపూజ ఎలా చేయాలో ఆచరించి చూపింది. కనుక నేను కూడా ఆ ధర్మమే ఆచరిస్తాను. ధర్మమే ఉత్తమగతి. ఆ పుణ్యకపోతం ఆచరించినదే ఉత్తమధర్మం. అదీ నాకు ఇష్టం" బోయవాడు ఈ విధంగా ఆలోచించి, కఠోర వ్రతాన్ని ఆశ్రయించి మహాప్రస్థానం వైపు ప్రయాణం మొదలు పెట్టాడు. అప్పుడే తన కర్రను, వలను, పంజరాన్ని, అందులో బంధించిన కపోతిని విడిచి పెట్టి వేశాడు.

బోయవాడు వెళ్ళి పోగానే కపోతి భర్తను తలుచుకుని దుఃఖిస్తూ ఇలా అంది. "నాథా నేనెప్పుడూ నీ పట్ల అప్రియంగా ప్రవర్తించలేదు. స్త్రీకి ఎంతమంది పిల్లలు ఉన్నా భర్త లేకపోతే జీవితమంతా శోకమే. బంధువులు కూడా ఆమెను దరిచేరనీయరు. నీవు నన్ను ఎంతప్రేమగా చూసుకున్నావు. ఎంతో స్నేహంతో సెలయేళ్ళ దగ్గర, చెట్టుకొమ్మల్లో నన్ను ఎంతో సుఖపెట్టావు."

ఇంకా "గతంలో నీతో కలిసి పొందిన సుఖంలో ఏ కొంచెము ఇప్పుడు లేదు. తండ్రి, సోదరుడు, వీరంతా మితంగానే సుఖం యిస్తారు. అమితంగా సుఖపెట్టేది భర్త ఒక్కడే. అటువంటి భర్త పోతే ఏ స్త్రీ దుఃఖించదు? స్త్రీకి భర్తను మించిన రక్షణ లేదు. ధనాన్నంతా పరిత్యజించి అయినా స్త్రీకి భర్తయే శరణ్యం" ఇలా దుఃఖిస్తూ కపోతి ఆ మండుతున్న అగ్నిలోకి దూకింది. అప్పుడు ఆమె తన భర్తను



చూసింది. ఆ కపోతం రంగు రంగుల ఆభరణాలు ధరించి విమానంలో కూర్చుని ఉంది. మహాత్ముల పూజలందుకుంటున్నది. దాని చుట్టూ ఇంకా ఎన్నో విమానాలు ఉన్నాయి. ఆ కపోతం తన భార్యతో సహా ఒక చక్కటి విమానం ఎక్కి స్వర్గంలోకానికి వెళ్ళింది. అక్కడ ఆనందగా నివసించింది.

బోయవాడు విమానంలో వెళ్తున్న కపోత మిథునాన్ని చూసి వారి సద్గతి గురించి ఆలోచించాడు. "నేను కూడా ఇలాటి తనస్సునే చేసి ఉత్తమ గతిని పొందుతాను" అని ఇలా నిశ్చయించుకుని అతను మహాప్రస్థానం వైపు మళ్ళాడు.

అతడు అప్పటి దాక చేసిన క్రూరకర్మలను వదిలి పెట్టాడు. గాలినే ఆహారంగా భోంచేస్తున్నాడు. అన్ని మమకారాలను, ఆకాంక్షలను వదిలి పెట్టాడు. అంతలో ఒకనాడు అతనొక సరస్సు చూశాడు. అక్కడ చక్కటి నిర్మలమైన నీరు ఉంది. సరస్సు నిండా పద్మాలు కలవు. ఎన్నో పక్షి సమూహాలు అక్కడ ఉన్నాయి.

ఉపవాసం చేత కృశించిపోతున్న బోయవాడు దానిని చూడలేకనే అరణ్యంలోకి ప్రవేశించాడు. ఆ అరణ్యం క్రూరజంతువులకు నివాస స్థానం. అక్కడ అతను ముళ్ళలో చిక్కుకున్నాడు. ఆ ముళ్ళు అతని శరీరాన్ని చీరాయి. అయినా అతడు నెత్తురు కార్చుతూ అక్కడే తిరిగాడు. ఇంతో పెనుగాలి వచ్చి అరణ్యంలో దావాగ్ని చెలరేగింది. ఆ మంటలు అరణ్యం అంతా వ్యాపించి, పక్షులు మృగాలు ఆ మంటల్లో పడిదహించుకుపోయాయి. అప్పుడు బోయవాడు ఆనందంతో ఆ మంటల వైపు పరుగెత్తాడు. అతను అందులో పడి అగ్ని దగ్ధుడై పునీతుడయ్యాడు. అతను స్వర్గంలోకంలో ప్రకాశిస్తున్న తనను చూడగలిగాడు. అతను ఆ యక్షగంధర్వుల మధ్య ఇంద్రునిలా వెలిగిపోతున్నాడు. ఈ విధంగా కపోతం, పాతివ్రత్యంతో కపోతి పుణ్యకర్మలతో బోయవాడు స్వర్గాన్ని చేరారు.

ఈ విధంగా ఏ కాంత అయినా భర్తను అనుసరిస్తే ఆమె స్వర్గానికి చేరుకుంటుంది. కనుక అతిథికి సత్కారం చేయడం, ఆదరించడం గొప్ప ధర్మం. ఈ ధర్మం వలన, గోహత్య వలన కలిగిన పాపం నుంచి కూడా నిష్కృతి లభిస్తుంది. *-ఇంకావుంది*

రక్షణ శిరస్త్రాణము



'దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి.' - ఎఫెసి *6:11*

సర్వాంగ కవచము దేవుడు ఉచితముగా ఇచ్చేది. ఎవరో ఇచ్చేది కాదు. ఎక్కడో దొరికేది కాదు. ఆయనను నమ్మినటువంటి వారికందరికి ఉచితము. దేవుడు లోకాన్ని ప్రేమించి లోకమంతటికి కృపతో రక్షణను అనుగ్రహించాడు. దానిని పొందుకున్న వారి శిరస్సుకు ఇది రక్షణ శిరస్త్రాణము (హెల్మెట్)గా ఉంటుంది.

రక్షణ శిరస్త్రాణమును కలిగి ఉంటే - ★పాత ఆలోచనలు, అభిప్రాయాలు, అబద్ధాలు, గందరగోళ పరిస్థితి పోయి పరిశుద్ధమైన తలంపులు, ఆలోచనలు కలిగి ఉంటాము. ఈ లోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును అనుకూలమును సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలుసుకొని మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుతాము.

★ తరచు మనకు వచ్చే అనుమానాలు ఉండవు. అనవసరమైన అనుమానాల వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందుల్లో కూరుకు పోతున్నాయి. భార్యా భర్తలు అనుమానాలతో ఇంటినే నరకం చేసుకొంటున్నారు. దాని నుండి గొడవలు, కొట్లాటలు చివరకు విడాకుల దాకా వెళ్తున్నారు.

★ అల్పకాల భోగాలు సుఖాల కన్న నిత్యజీవము మీద మనసు ఉంటుంది.

★ క్రీస్తు చనిపోయి తిరిగి లేచిన సంగతి జ్ఞాపకముంచుకొని, (పాపము విషయములో మృతులుగా దేవుని విషయములో క్రీస్తు యేసు నందు సజీవులుగా మిమ్మును మీరే ఎంచుకొనుడి. - రోమీ 6:11) క్రీస్తులో జీవము కలిగి ఉంటాము.

క్రీస్తు యేసు నందున్న వారు నూతన సృష్టి. పాతవి గతించెను. ఇదిగో సమస్తము కొత్తవాయెను *- 2 కొరింథీ 6:17*

దేవుని మూలముగా పుట్టిన ప్రతి వానిలో ఆయన బీజము నిలుచును గనుక వాడు పాపము చేయడు. *- 1 యోహాను 3:9.* క్రీస్తును నమ్మినవారు అందరూ దేవుని వలన పుట్టిన వారే.

★ మన నిరీక్షణ (Hope) విషయములో పూర్తిగా క్రీస్తు పైనే ఆధారపడి ఉంటాము.

నీవు నాకు ఉండగ లోకములో నిది ఏదీ నాకక్కరలేదు అని దావీదు మహారాజు కీర్తన *73:25*లో చెప్పినట్టు, మనము కూడా ఎటువంటి ఆరాటము లేకుండా ఉండగలము. Salvation is save, help in distress, rescue, deliver, set free.

Helmet ఎంత ఉపయోగమో మనకందరికి తెలిసిందే. పోలీసు వారు పదేపదే చెబుతూనే ఉంటారు. కొన్నిసార్లు వారే కొని ఇస్తున్నారు కూడా. ఇది మన మేలుకే అన్నది చాలా తక్కువ మంది అర్థం చేసుకుంటారు. వాస్తవానికి హెల్మెట్ పెట్టుకోవాలని రూల్ ఉంది గనుక చాలామంది కొంటున్నారు. కొంతమంది మాత్రమే ధరిస్తున్నారు. కొంతమందేమో హేండిల్‌కి తగిలించి ఉంచుతున్నారు.



కొంతమంది హెల్మెట్‌ను తలకు పెట్టుకుంటారు గానీ బకిల్ అప్ చేయరు. దానివల్ల ఉపయోగం లేదు. ప్రమాద సమయములో అది ఉపయోగపడదు. మాకు తెలిసిన ఒకమ్మాయి హెల్మెట్ పెట్టుకుంది గానీ బకిల్ అప్ చేయక పోవటం వల్ల ప్రమాదం జరిగి తలకు గాయమై కోమాలోకి వెళ్లి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తోంది. దీన్నిబట్టి హెల్మెట్ ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. శరీరంలోని ఏ అవయవం లేకున్నా బతికేయ్యొచ్చు గానీ తల లేకుండా ఎలా? దాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనదే.


క్రీస్తును నమ్మినటు వంటి వారు ఆయన ఉచితముగా ఇచ్చిన రక్షణను తప్పనిసరిగా తలకు తగిలించుకోవాలి. అయితే చాలామంది చర్చిలో మాత్రం తప్పనిసరిగా పెట్టుకుంటారు. బైటకు రాగానే దాన్ని తీసివేస్తారు. ఆఫీసులలో మార్కెట్ స్థలాలలో అసలు వాడరు. ప్రార్థన సమయాలలో పెడుతూ ఉంటారు. శిరస్త్రాణము ఎంత మంచిది ఉన్నా ధరించుకొనకపోతే ఉపయోగం లేదు. కొంతమంది ఎగతాళి చేస్తున్నారు. చులకనగా చూస్తున్నారు. ఇది మాకవసరం లేదు అనుకునేవారు కూడా ఉన్నారు.

మన తలంపులలో ఊహలలో ఎన్ని దురాలోచనలు, దుష్ట తలంపులు వస్తుంటాయో మనకు తెలుసు. క్రీస్తును ధరించుకొనక మునుపు నా తలంపులు ఊహలు ఎలా ఉండేవి నాకు తెలుసు. ఆ చెడు తలంపులకు వావి వరుసలు, చిన్నాపెద్దా తేడాలు ఉండేవి కాదు. క్రీస్తే మన 'హెల్మెట్' అయినప్పుడు ఆయన పరిశుద్ధుడు గనుక మనకు పరిశుద్ధమైన తలంపులు ఉంటాయి. ఆయన చేసిన బలి యాగము జ్ఞాపకముంటుంది. మన చెడు తలంపులకు మన తలకు పెట్టవలసిన ముండ్ల కిరీటము ఆయన ధరించి, రక్షణ శిరస్త్రాణమును మనకు ఇచ్చాడు. రక్షణ శిరస్త్రాణము ధరించుకొని సాతానుని ఎదిరించి స్థిరముగా ఉంటే జీవ కిరీటము ఇస్తానని వాగ్దానమిస్తున్నాడు. - ప్రకటన 2:10. సాతానుతో పోరాడటానికి రక్షణ శిరస్త్రాణము ధరించవలసిందే. లేకపోతే వాడు వేసే బాణాలు మన తలకు తగిలే అవకాశముంది. దుష్ట తలంపులు, చెడు ఆలోచనలు, భయాందోళన, దిగులు, విచారము, కోపం, అసూయ, అహం.. ఇంకా ఇహలోక పరమైన అనేక విషయాలు చోటు చేసుకొంటాయి. పాపములో పడి రక్షణ పోగొట్టుకుంటాము.

ప్రార్థన

\- మద్దు పీటర్
9490651256

దేవుడే మానవునిగా వచ్చి ఎన్నో శ్రమలు శోధనలు భరించి కొరడా దెబ్బలు తిని ముండ్ల కిరీటము పెట్టించుకొని మోయలేని సిలువను మోసి చేతులలో కాళ్లల్లో సీలలతో గుచ్చబడి రక్తమంతా ధారపోసి ప్రాణమిచ్చి సంపాదించిన ఈ గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల నరకము నుండి ఎలా తప్పించుకొనగలము. మరి ఎవని వలనను రక్షణ కలుగదు. రక్తము చిందించిన యేసు నామమున మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇవ్వబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము.- అపొ.కార్యములు *4:12.*



తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను. - మత్తయి *1:21*

చేసిన పాపాల నుండి రక్షణ. ఇక చేయకుండా రక్షణ.

క్రీస్తును ధరించుకున్నప్పుడు అది తలను మాత్రమే కాదు కన్నులకు చెవులకు నాలుకకు కూడా కవచముగా ఉంటుంది. చెడును చూడనివ్వదు. విననివ్వదు. మాట్లాడనివ్వదు.

క్రీస్తు ఇచ్చిన రక్షణ శిరస్త్రాణమును ధరించుకొనకపోతే ఉపయోగము లేదు. మన తలంపులు మాటలు చూపులు ఏవీ మన నియంత్రణలో ఉండవు.

క్రీస్తు రక్షించకపోతే మన పాపాలను కడుగకపోతే, మన జన్మ పాపములు కర్మ పాపములకు ప్రాయశ్చిత్తము లేదు. పాపాలకు పరిహారము మానవునికి అసాధ్యము. లోకములో ఏ నీరు మన మెదడును శుభ్రపరచలేదు. కేవలము క్రీస్తు చిందించిన సిలువ రక్తములోనే మన పాపములకు పరిహారము కలుగుతుంది. సిలువలో మన పాపముల కొరకు రక్తము చిందించిన క్రీస్తును కలిగి ఉండటమే మనకు రక్షణ. ఈ రక్షణను కొనసాగిస్తూనే ఉండాలి.

క్రీస్తులో ఉచితముగా దొరికే ఈ రక్షణను పోగొట్టుకొనకూడదు. ఎవరైనా ఈ రక్షణను పొందుకోవచ్చు. క్రీస్తు మనకు కొండ అండ కోట దుర్గము బలమై ఉన్నాడు. ఆయనలో మనకు రక్షణ బలము ధైర్యము శక్తి ఐశ్వర్యము ఆరోగ్యము కాపుదల భద్రత నడిపింపు అన్నీ ఉంటాయి.

యెహోవా నాకు వెలుగును రక్షణయై ఉన్నాడు. నేనెవరికి భయపడుదును. యెహోవా నా ప్రాణ దుర్గము ఎవరికి వెరతును. -కీర్తన *27:1*

యెహోవాయే నీతిమంతులకు రక్షణాధారము.

ఆయనే నా ఆశ్రయ దుర్గము ఆయనే నా రక్షణ కర్త.

క్రీస్తును ప్రేమించి శిరస్సునకు కవచముగా ధరించుకొంటే నరకము నుండి తప్పిస్తాడు. ఘనపరుస్తాడు. మొట్ట పెట్టినప్పుడు జవాబిస్తాడు. శ్రమలో తోడై ఉంటాడు. బంధకాల నుండి విడిపించి గొప్ప చేస్తాడు. దీర్ఘాయువు చేత తృప్తి పరచి రక్షణ చూయిస్తాడు.


దేవుడిచ్చిన ఈ రక్షణను చులకనగా చూడవద్దు. భయముతోను వణుకుతోను మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి. ఎవరి రక్షణ వారిదే. ఒకరిది ఇంకొకరికి ఉపయోగపడదు.

మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడుదురు. ఇది దేవుని వరము. ఉచితముగా దేవుడిచ్చే ఈ రక్షణ వరాన్ని అందరము పొందుకొని కొనసాగించుటకు పరిశుద్ధాత్మ దేవుడు సహాయము చేయును గాక.

పాప బంధకాల నుండి శాపము నుండి రక్షించటానికి శక్తిగల మన అద్వితీయ దేవునికి మహిమయు మహాత్యమును ఆధిపత్యము అధికారము యుగములకు పూర్వము ఇప్పుడు సర్వయుగములు కలుగును గాక. ఆమెన్.

రక్షణ శిరస్త్రాణము ధరించు.. క్రీస్తు వలె మాట్లాడు ఆలోచించు జీవించు. ■

పరమహంస బోధామృతము



196\. లౌకికులు భక్తులతోగూడి ఒక్కొక్కప్పుడిచ్చటికి వచ్చుచుందురు. లౌకికులకు పారమార్థిక ప్రసంగములనిన గిట్టదు. ఇతరులు భగవంతుని గూర్చియు పరమార్థమును గూర్చియు చాలసేపు ముచ్చటించుచుండ, వారు విసుగుకొని చీకాకుపడుదురు. ఊరక కూర్చుండుట కూడ వారికి చాల కష్టముగా నుండును. అందుచే తమ మిత్రుల చెవిలో, "ఎప్పుడు మీరు బయలుదేఱుట? ఇంకను ఎంత సేపుందురు?" అని గుసగుసలాడుదురు. అప్పుడప్పుడు వారి స్నేహితులిట్లు సమాధానము చెప్పుచుందురు: "కొంచెము తాళుడు, ఇప్పుడే వచ్చుచున్నాము." ఈ మాటలను విని విసుగుకొని వా రిట్లందురు: "సరే, మీరు మాటలాడుచుండుడు. మేము పోయి పడవలో కనిపెట్టుకొనియుందుము." (కలకత్తానుండి జనులు శ్రీరామకృష్ణదర్శనార్థము పడవపై దక్షిణేశ్వరము వచ్చువారు.)

197\. పావురము యొక్క కుత్తుక అది యేరుకొని తిను గింజలతో నిండియుండు రీతిని లౌకికుని హృదయము అడ్డమైన లౌకిక చింతలతోడను క్రిక్కిఱిసి యున్నదని వానితో రవంత ప్రసంగించినంతనే తెలియనగును.

198\. పాపాత్ముని మనస్సు ఉంగరాల జుట్టు వంటిది. ఎంత ప్రయత్నించినను ఉంగరాల జుట్టును నీవు సాపుగా నుండునట్లు చేయజాలవు. అటులనే దుర్జనుని వక్రబుద్ధిని సరిచేయుట దర్లభము. (చూ.579.)

199\. సాధువు చేతనున్న కమండలువు ఆతడు తీర్థయాత్రలు చేయుచు ధామములను (దర్శింపవలసిన ముఖ్యమైన పుణ్యస్థలములు) నాల్గింటిని దర్శించినను ఎప్పటివలెనే చేదుగనే యుండును. సంసారబద్ధుల స్వభావము గూడ నిట్టిదే.

200\. కాల్పని రేగడిమట్టితో కుమ్మరి బొమ్మలను జేయగలడుగాని కాల్చిన మట్టితో జేయజాలడుగదా! నరుని హృదయము లౌకికవాంఛలను దావానలమున బడి దగ్ధమైన వెనుక ఉత్తమాశయముల ప్రభావముచే చక్కని మార్పునొందవలయుననిన సాధ్యముకాదు.

201\. ఱాతిముక్కలో నీరు ఇంకజాలని రీతిని ధర్మబోధలు సంసారబద్ధుని మనసున కెక్కజాలవు,- అందెట్టి మార్పును గల్గింపజాలవు.

202\. మేకును ఱాతిలో గొట్టజాలము, కాని మట్టిలో సుళువుగ గ్రుచ్చవచ్చును. అటులనే సాధుజనుల హితబోధ లౌకికుని మనస్సున చొరదు, కాని శ్రద్ధాభక్తులుగల ఆస్తికుని హృదయమున అతిసులభముగ నాటుకొనును.

203\. మెత్తని రేగడిమట్టిపై ముద్రపడును, కాని ఱాతిపై బడదు. అటులనే తత్త్వజ్ఞానము భక్తుని హృదయమున హత్తుకొనునట్లు సంసారబద్ధుని హృదయమున హత్తుకొనదు.

204\. వంతెన క్రింద నీరు ఒకవైపునుండి ప్రవేశించి రెండవ వైపునుండి పోవునటుల సాంసారికులకు జేయు ధర్మబోధ ఒక చెవిలోనుండి వారి మనసున బ్రవేశించి రెండవ చెవినుండి పలాయనమగును. వారి హృదయమున రవంతయు మార్పు గలుగదు.

205\. లౌకికుని లక్షణమేమి? (ముంగిసను బెంచువాని) కుండలోని ముంగిస వంటివాడు లౌకికుడు. ముంగిసను మచ్చికచేయువాడు ఎత్తుగా గోడలో ఒక కుండ నుంచును, అదియే దానిగూడు. మఱియు, ముంగిస మెడకు ఒక త్రాటినిగట్టి దాని రెండవ కొనకు బరువు నొకదానిని గట్టును. ముంగిస కుండలోనుండి వెలువడి, గోడ దిగి వచ్చి, యిటునటు తిరుగాడును. కాని యేదేని భయము తోపగనే తుట్టున పైకి పోయి కుండలోదూరి దాగుకొనును. కాని, పాపము, త్రాటి రెండవ కొనను గట్టియున్న బరువు దానిని దిగలాగుచుండుటచే అది యచట చాలసేపు ఉండజాలదు. అటులనే లౌకికుడు జీవితముననెన్నియో యాతనలను అనుభవించి, యెట్లో బుద్ధితెచ్చుకొని, లౌకిక చింతల విడిచి, భగవంతుని శరణుజొచ్చును. కాని, పాపము, దురంతమైన సంసార భారమును, వ్యసనములును వాని నచట నిలువనీయవుకదా! అవి వానిని మఱల సంసార తాపత్రయములోనికి లాగివేయుచుండును!

-ఇంకావుంది

ఆంధ్రభూమి
చిత్రభూమి
జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!
శనివారం 2, ఫిబ్రవరి 2019
12

డబ్బింగ్‌లో '118'



ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేవీ గుహన్ దర్శకత్వంలో నందమూరి కళ్యాణ్‌రామ్ హీరోగా రాబోతున్న చిత్రం '118'. ఈ చిత్రంలో రామ్ సరసన నివేదా థామస్ అలాగే 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ షాలినిపాండే హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటుంది. కళ్యాణ్‌రామ్ తన పాత్రకు డబ్బింగ్ చెబుతున్నారు. మొదటిసారి కేవీ గుహన్ డైరెక్టర్‌గా మారి తెరకెక్కిస్తున్న సినిమా థ్రిల్లింగ్ అంశాలతో ఆకట్టుకుంటుందని చిత్రయూనిట్ చెబుతోంది. సినిమాలో అండర్ వాటర్ క్రేజీ ఫైట్ సీక్వెన్స్ బాగా వచ్చిందని టాక్. థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తున్నారు. ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ ఎస్ కోనేరు చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సినిమాలే నా లోకం

మమ్ముట్టి. ఎప్పటికీ కొత్తగా అనిపించే లెజండరీ నటుడు. ఇండియన్ సినిమా చరిత్రలో సూపర్ స్టార్ అనిపించుకున్న ఆర్టిస్ట్. మలయాళ చిత్రసీమకే పరిమితం కాకుండా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించిన అనుభవజ్ఞుడు. అప్పుడెప్పుడో విశ్వనాథ్ చిత్రం 'స్వాతికిరణం'లో సంగీత విద్వాంసుడిగా నిండైన విగ్రహంతో కనిపించి మెప్పించిన మమ్ముట్టి, చాలాకాలం తరువాత తెలుగు స్ట్రెయిట్ సినిమా 'యాత్ర'లోనూ గాంభీర్యమైన పాత్రే పోషిస్తున్నాడు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవితంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన పాదయాత్ర ఘట్టాన్ని మహి వి రాఘవన్ తెరకెక్కిస్తుంటే, ఆ చిత్రంలో లీడ్‌రోల్ పోషించాడు మమ్ముట్టి. 8న యాత్ర విడుదలవుతున్న సందర్భంలో మమ్ముట్టితో ఇంటర్వ్యూ.



తెలుగులో చాలా గ్యాప్?

ఔను. నిజంగానే చాలా టైమ్‌పట్టింది. అందుకు కారణం- తగిన స్క్రిప్ట్ దొరక్కపోవడం. స్క్రిప్ట్ బావుంటే ఎప్పుడైనా నేను రెడీ.

కొత్త దర్శకుడితో..

కెరీర్‌లో దాదాపు 70మంది కొత్త దర్శకులతో పని చేశా. నిజానికి మహి ఇప్పటికే రెండు సినిమాలు చేశాడు. కొత్త డైరెక్టర్ అనగానే ఏదోకటి కొత్తగా చెప్పడానికి ట్రై చేస్తారనే నమ్మకం. అందుకే వారితో చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తా.

యాత్ర చేయడానికి కారణం?

ఒక్కటి కాదు, అనేక కారణాలు. ముఖ్యంగా స్క్రిప్ట్. దాంతోపాటు తపనవున్న నిర్మాత. మూడోది వైఎస్ లాంటి లెజండరీ పాత్ర. సినిమాకు ఓకే చెప్పడానికి ఉండాల్సిన ఎలిమెంట్ అన్నీ ఉన్నాయి. కాబట్టే ఈ సినిమా చేశా.

ఏం చెప్పబోతున్నారు..?

వైఎస్ పాదయాత్ర అంటే జస్ట్ నడవడమే కాదు, జనాల్ని కలవడం. వారిగురించి తెలుసుకోవడం. జనాల సమస్యలు వినడం. పాదయాత్రలో వైఎస్ అనుభవాలు, భావోద్వేగ పార్శ్వం మొత్తం 'యాత్ర'లో కనిపిస్తుంది. ఇది పూర్తిగా వైఎస్ జీవిత కథ కాదు. ఒక ఫేజ్ మాత్రమే. అంటే ఆయన ముఖ్యమంత్రి అయ్యేముందు చేసిన పాదయాత్ర నేపథ్యంలో ఉంటుంది.

పాత్రకు చేసిన హోంవర్క్?

ఈ పాత్రని ప్లే చేయడానికి పెద్దగా కష్టపడలేదు. దర్శకుడు మహి సినిమాకి కావాల్సిన రీసెర్చ్ చేసి స్క్రిప్ట్ రెడీ చేసుకున్నాడు. మహి రాసుకున్నది, అతనికి ఏంకావాలో అదే చేశా.

రాజకీయాలపై ఆసక్తి?

దాదాపు 33ఏళ్లుగా సినిమాల్లో ఉన్నాను. అవే నా ప్రపంచం, నా పాలిటిక్స్.

తెలుగు చిత్రాల్లో కనిపిస్తున్న మార్పు?

తెలుగే కాదు, అన్ని భాషా చిత్రాల్లో మార్పు వచ్చింది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుల అభిరుచి మారింది. కొత్త కథలను అంగీకరిస్తున్నారు. ఈమధ్యే రామ్‌చరణ్ 'రంగస్థలం', మహేష్ 'భరత్ అను నేను..' చూశాను. యూట్యూబ్‌లో తెలుగు వీడియోస్ చూస్తుంటాను. తెలుగు సినిమాలు ఇతర భాషల్లో రీమేక్ విషయంలో పోటీ పడుతున్నాయి. నిజంగా మంచి పరిణామం.

మీ డ్రీంరోల్?

గత 33 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఇప్పటికే 370కి పైగా చిత్రాలు చేశాను. నేను చేసే ప్రతి రోల్ నా డ్రీమ్ రోలే. నాకు తెలిసి ఏ యాక్టర్ అయినా తను కంఫర్ట్‌గా ఫీలయ్యే పాత్రలను చేసుకుంటూ వెళ్తాడు. కంఫర్ట్‌గా ఫీలయ్యేవే డ్రీమ్ రోల్స్ అనేది నా ఫీలింగ్.

వైఎస్ ఫ్యామిలీనుంచి సంప్రతింపులు..?

వైఎస్సార్ పార్టీ, ఫ్యామిలీ నుంచి కానీ ఎవరూ కలవలేదు. సినిమా మొదలైనప్పటి నుంచి డైరెక్టర్, ప్రొడ్యూసర్‌తో నేను టచ్‌లో ఉన్నాను. వాళ్లనూ ఎవరూ కలవలేదని చెప్పారు.

టాలీవుడ్‌లో మీ ఫ్రెండ్స్?

నాకు టాలీవుడ్‌లో మంచి స్నేహితులు ఉన్నారు. గతంలో సినిమాలన్నీ చెన్నైలోనే జరిగేవి. కాబట్టి అప్పుడు కలుస్తూనే ఉండేవాళ్లం. ఇప్పటికీ ఆ పరిచయాలున్నాయి.

80వ దశకం బ్యాచ్‌తో టచ్‌లో ఉన్నారా?

నేను 80 బ్యాచ్ కాదు, 2018 బ్యాచ్.

దుల్కర్‌తో కలిసి సినిమా చేసే ఆలోచన?

దుల్కర్‌తో నాకు పోటీ లేదు. తనతో కలిసి నటించే ఆలోచన కూడా లేదు.

భవిష్యత్ ప్రణాళికలు?

సినిమా అనేది నాకు ఫ్యాషన్. దాని కోసం ఎంతైనా కష్టపడతా. నచ్చిన స్క్రిప్ట్‌లను చేసేకుంటూ వెళ్లడమే నా పని.

మళ్లీ తెలుగులో ఎప్పుడు?

చాలాకాలం కిందట విశ్వనాథ్‌తో స్వాతికిరణం చేశా. మళ్లీ ఇన్నాళ్లకు యాత్ర చేస్తున్నాను. మళ్లీ మంచి స్క్రిప్ట్ వస్తే ఇప్పుడు కూడా రెడీ.

రాజకీయాలను టచ్ చేశారా?

ఆ చాన్స్ లేదు. సినిమా కేవలం వైఎస్, ఆయన పాదయాత్రలో చేసిన పనులు, యాత్ర నేపథ్యంలో జనాలను కలవడం, వారి సమస్యల నేపథ్యంలో మాత్రమే కథ సాగుతుంది.

వైఎస్‌ను ఇమిటేట్ చేశారేమో?

వైఎస్‌ది కంప్లీట్ డిఫరెంట్ పర్సనాలిటీ. ఒకవేళ నేను ఆయనలా కనిపించే ప్రయత్నం చేసినా కుదిరేది కాదు. అందుకే ఆయన కథ, వ్యక్తిత్వాన్ని మాత్రమే ఎంచుకున్నాం. హావభావాలు కాదు. ఎందుకంటే ఈ సినిమాలో ఆయనలాగే ఉండాలన్న మిమిక్రీ ఏమీ చేయలేదు.



అలా సాధ్యమేనా?


ఖాకీ కెమిస్ట్రీని మరోసారి రుచి చూపించేందుకు కార్తి, రకుల్ ప్రీత్ సింగ్ జోడీగా వస్తున్న చిత్రం -దేవ్. తాజాగా విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచుతోంది. రజత్ రవిశంకర్ దర్శకత్వం వహించిన చిత్రానికి హ్యారిస్ జైరాజ్ సంగీతం సమకూర్చారు. 'మగతోడు లేకుండా ఆడది బతకగలదా?' అన్న కార్తి ప్రశ్నకు 'ఇంటి పేరు కూడా లేకుండా బతకగలం' అని రకుల్ ఇచ్చే సమాధానం ట్రైలర్‌లో హైలెట్ అయ్యింది. చిత్రంలో కార్తి రేసర్‌గా కనిపించనున్నాడన్న కథనాలకు బలం చేకూరుస్తూ -సాసహాలు, విన్యాసాలంటే ఇష్టపడే వ్యక్తిగా కార్తిని చూపించారు. మునపటి చిత్రాలకంటే కార్తి మరింత హ్యాండ్సమ్‌గా కనిపిస్తుంటే, సెటిల్డ్ పెర్ఫార్మెన్స్‌తో రకుల్ మరింత ఆకట్టుకుంది. 'బావా ఏ పని చేసేటప్పుడు డబ్బు, పేరుకంటే మనసు ప్రశాంతంగా, సంతోషంగా ఉంటుందో.. అదేరా నువ్వు చేయాల్సిన పని' అన్న కార్తి డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. చిత్రంలో 'లవ్' ట్రాక్‌ను సైతం ఒకింత కొత్తగా డిజైన్ చేసినట్టు అర్థమవుతుంది. ట్రైలర్ వరకూ హ్యారిస్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆకట్టుకుంది. 'ఖాకీ' తరువాత మళ్లీ రెండక్షరాల 'దేవ్' టైటిల్‌తో వస్తున్న కార్తి, రకుల్ జోడీ ఫిబ్రవరి 14న కొత్త రుచులు చూపిస్తారేమో చూడాలి.



లవ్ 2020

మోహన్ మీడియా క్రియేషన్స్‌లో మోహన్ వడపట్ల, మహేందర్ వడపట్ల మరియు జో శర్మ, మెక్విన్ గ్రూప్ యుఎస్‌ఏ సహకారంతో వడపట్ల సినిమాస్ సమర్పిస్తున్న కొత్త చిత్రం లవ్ 2020. ఈ చిత్రం ద్వారా అరవింద్, మోహిని హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. ఇప్పటికే బెంగళూర్, నాగర్హోలే నేషనల్ పార్క్, కూర్గ్, కుషాల్ నగర్, ఊటీ, ఇడుక్కి, హైదరాబాద్ పరిసరాల్లో షూటింగ్ చేశారు.

ఫిబ్రవరి 6వరకు నవీ ముంబైలోని ముఖ్యప్రాంతాల్లో ప్యాచ్ వర్క్‌తోపాటుగా ఫైనల్ సాంగ్, షూటింగ్ పూర్తి చేసుకోనుంది. సెంథిల్ కుమార్ దర్శకత్వంలో కొత్త కథాంశంతో తెరకెక్కుతుంది. ఈ చిత్రానికి ప్రత్యేకంగా యూత్‌కి కనెక్ట్ అయ్యే విధంగా లవ్ 2020 అనే టైటిల్ ఖరారు చేశారు. పోస్ట్ ప్రొడక్షన్ అనంతరం చిత్రాన్ని ఏప్రిల్‌లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. చిత్రానికి సంగీతం సత్యన్ సమకూరుస్తుంటే, సినిమాటోగ్రఫీ సెంథిల్ కుమార్ అందిస్తున్నారు.



ఒక్కటవుతారా?

కోలీవుడ్ హీరో ఆర్య పెళ్లివార్తలు ఎప్పటికప్పుడే కొత్త. ఎన్నో కథనాలు నిజాలుగా నమ్మిస్తూ తరువాత వదంతలుగా తేలిపోతుంటాయి. ఆర్య-నయన్‌ల పెళ్లంటూ ఆమధ్య కొన్ని ఫొటోలు బయటికొచ్చాయి. తీరాచూస్తే రాజా-రాణి స్టిల్స్ అంటూ తరువాత చిత్రం బృందం మిస్టరీని విప్పింది. కొద్దిరోజులకే బుల్లితెరపై ఆర్యకు పెళ్లిపందిరి కార్యక్రమం నిర్వహించారు. నిజమేనని జనం నమ్మేశారు. అదంతా ఓ కార్యక్రమం కోసం సరదాగా సృష్టించిన పెళ్లేనంటూ తెలియడంతో ఔరా అనుకున్నారు. ఇప్పుడు బాలీవుడ్ బ్యూటీ సాయేషాను ఆర్య పెళ్లాడుతున్నాడంటూ కోలీవుడ్‌లో కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. 'అఖిల్' చిత్రంలో అఖిల్‌కు జోడీగా తెరంగేట్రం చేసిన సాయేషా సెహెగల్, గత ఏడాది 'వనమగన్' చిత్రంతో తమిళ తెరపైకీ అడుగుపెట్టారు. తాజాగా స్టార్ హీరో సూర్యకు జోడీగా 'కాప్పాన్' చిత్రంతో సాయేషా చేస్తోంది. 'గజనీకాంత్' చిత్రంలో ఆర్య, సాయేషా జోడీకట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు టైంలోనే వీరిద్దరి మధ్యా ప్రేమ చిగురించిందని, వచ్చే నెలలోనే వీరి పెళ్లి ముహూర్తమని కోలీవుడ్‌లో కథనాలు చక్కర్లుకొడుతున్నాయి. బాలీవుడ్ ఒకప్పటి స్టార్ హీరో దిలీప్‌కుమార్ బంధువుగా సాయేషా సిల్వర్ స్క్రీన్‌పైకి అడుగుపెట్టడం తెలిసిందే.

కొడుకు కోసం..



శ్రీ భాగ్యలక్ష్మి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై బాలమురుగన్ దర్శకత్వంలో బోగారి లక్ష్మీనారాయణ నిర్మించిన చిత్రం -ఎదురీత. శ్రవణ్ రాగవేంద్ర హీరోగా నటించారు.లియోనా లిషోయ్ కథానాయిక. సినిమా చిత్రీకరణ పూర్తైంది. స్టైలిష్ విలన్‌గా పలు చిత్రాల్లో కనిపించిన శ్రవణ్ హీరోగా పరిచయం అవుతున్నాడు. విలన్‌గా నటించిన ఎంతో మంది ఆ తరువాత హీరోలుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నా, విజయం సాధించిన వాళ్లు మాత్రం ఏకొద్దిమందో. తాజాగా శ్రవణ్ కూడా సీరోగా తన లక్‌ను పరీక్షించుకోవాలని హీరోగా 'ఎదురీత' చేస్తున్నాడు. తను ఎంతో ప్రేమించే కొడుకును ఓ తండ్రి అత్యంత గారాబంగా చూసుకుంటాడు. ఏది కోరుకుంటే అది చేయడం, ఇవ్వడం చేస్తాడు. అంతగా కొడుకుపై ప్రేమను చూపించే తండ్రి, ఒకానొక సందర్భంలో ఇబ్బందుల్లో పడతాడు. ఆ ఇబ్బందులేంటీ? ఆ సమయంలో అతడి కొడుకు పరిస్థితి ఏంటి? ఓ తండ్రి కొడుకు గురించి పడే ఆవేదనను చిత్రంలో చక్కగా చూపించనున్నారట. తండ్రీ కొడుకుల సెంటిమెంట్ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందని, తప్పకుండా సినిమా కాన్సెప్ట్ ప్రేమక్షకులకు నచ్చుతుందని చిత్రబృందం చెబుతోంది. ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన రావడంతో, అదే ఉత్సాహంతో సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అభిమానమే అతిపెద్ద అవార్డు



కళలన్నింటిలో సాహిత్యం గొప్పది. సాహిత్యం కంటే నాటకం గొప్పది. నాటకం కంటే సినిమా గొప్పది. ఏ సినిమా కూడా సమాజాన్ని తప్పుదోవ పట్టించలేదు. సినిమాలవల్ల సమాజం చెడిపోతుందంటే ఒప్పుకోను. పాట జనరంజకంగా ఉంటే సరిపోతుంది. కానీ పాట దానిస్థాయిని దాటి ప్రేక్షకుణ్ణి ఆలోచింపజేసేలా ఉండాలి. అప్పుడే ఆ పాటకు సార్థకత అన్నారు సినీ గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఆయనకు 'పద్మశ్రీ' పురస్కారాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మీడియాతో ఆ ఆనందాన్ని పంచుకున్నారు.

ఇదివరకు పురస్కారాల్ని ప్రభుత్వాలు సిఫార్సు చేసేవి. ఇప్పుడు వ్యక్తులు అభ్యర్థిస్తున్నారు. అలా చేయడం నాకు ఇష్టంలేదు. నాకు పద్మశ్రీ ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేసింది. దాంతోపాటు వేలాదిమంది నాకు ఈ అవార్డు ఎందుకివ్వాలో తెలుపుతూ కేంద్రానికి తమ అభ్యర్థనను పంపారు. వాళ్లందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువాళ్లకి పాదాభివందనాలు. సినిమా రంగాన్ని దేవాలయంకంటే ఎక్కువగా ప్రేమిస్తాను. సినిమా పరిశ్రమ అనేది గొప్ప వ్యాపారం. సినిమా తీస్తున్నందుకు నిర్మాతలంతా గర్వించాలి. ఇంత గౌరవప్రదమైన వ్యాపారం ఏదీ లేదు. అలా అనుకొని నిర్మిస్తేనే మరిన్ని గొప్ప చిత్రాలను తెలుగు పరిశ్రమ అందిస్తుంది. సినిమాలో హత్యైనా, అత్యాచారానికి సంబంధించిన సన్నివేశమైనా కారణం లేకుండా చూపించడం లేదు. సినిమాలవల్ల సమాజం చెడిపోతుందంటే నేను ఒప్పుకోను.

స్త్రీ పాత్రని కించపర్చేలా, యువతరాన్ని కిర్రెక్కించేలా పాటలు రాయమంటే నేను రాయను. వ్యక్తి, ప్రదేశం గురించి వర్ణించమంటే వర్ణించను. పాటంటే భావోద్వేగ భరితం. మానవుడి భావోద్వేగాలను గమనించుకుంటూ వాటిపట్ల నాలో కలిగిన అనుభూతులను వ్యక్తపర్చే విధానమే పాటగా భావిస్తాను. వాటినే రాస్తాను. పాటంటే పదాల కూర్పుకాదు. పదాలమధ్య ఉన్న నిశ్శబ్దానికి ఇచ్చే గొంతుకే పాట. రచయిత అనేవాడు స్పేస్ తీసుకోవాలి. పాటలో పదాలు కథకు, సందర్భానికి న్యాయం చేస్తూనే మరో విశిష్ట లక్షణాన్ని సంతరించుకోవాలి. అలాంటి పాటలు రాయడానికే ఇష్టపడతాను.

చిత్ర పరిశ్రమలో 33ఏళ్లుగా అందరూ నన్ను అభిమానిస్తున్నారు. నేను అన్నింటి కంటే వ్యక్తిత్వానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తాను. సిరిసంపదల కంటే మనుషుల హృదయంలో స్థానం సంపాదించడమే గొప్పగా భావిస్తాను. ఇంతమంది ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించడం కంటే గొప్ప అవార్డు ఏముంటుంది' అంటూ ముగించారు.



ఆరు గెటప్పుల్లో స్వయంవద

ఆదిత్య అల్లూరి, అనికారావు జంటగా లక్ష్మి చలనచిత్ర పతాకంపై వివేక్‌వర్మ దర్శకత్వంలో రాజా దూర్వాసుల నిర్మిస్తోన్న 'స్వయంవద' చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ నిర్మాత లగడపాటి శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయంవద సినిమా టైటిల్ ఎంత పవర్‌ఫుర్‌గా ఉందో సినిమాకూడా అంతే పవర్‌ఫుల్‌గా ఉండాలని ఆకాంక్షించారు. ఫస్ట్‌లుక్ ఇంప్రెసివ్‌గా ఉంది. దర్శక నిర్మాతలు ఎంతో కష్టపడి సినిమాను తెరకెక్కించారు. చిన్న సినిమాగా విడుదలై పెద్ద విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు వివేక్‌వర్మ మాట్లాడుతూ స్వయంవద అనేది సంస్కృత పదమని, దీనికి ప్రత్యేకత ఉందన్నారు. తన గురించి తానే సర్వస్వం అనే ఓ పాత్ర గురించి సినిమాలో చెప్పబోతున్నా. ఇందులో హీరోయిన్ మొత్తం ఆరు గెటప్స్‌లో కనిపిస్తుంది. అన్ని గెటప్స్‌లోను డిఫరెంట్ వేరియేషన్స్ ఇస్తూ అనికారావు చక్కగా నటించింది. హీరో ఆదిత్య అల్లూరి కొత్తవాడైనా చక్కగా నటించాడు. అందరికీ నచ్చేవిధంగా కామెడీ, సస్పెన్స్, థ్రిల్లర్‌గా తెరకెక్కించాం అన్నారు. నిర్మాత రాజా దుర్వాసుల మాట్లాడుతూ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు చివరి దశలో ఉన్నాయి. టీజర్‌ను ఫిబ్రవరి 10న విడుదల చేస్తాం. సినిమాను మార్చిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.